


ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ



fb/prajasakti | Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu | www.prajasakti.com

సంపుటి : 37 సంచిక : 219 | విజయవాడ, బుధవారం 9 ఆగస్టు 2017 | 12 + 12 పేజీలు వెల : 4.00



న్యూఢిల్లీలోని కల్ కతోరా స్టేడియంలో మంగళవారం జరిగిన కేంద్ర కార్మిక సంఘాల సదస్సుకు భారీ సంఖ్యలో హాజరైన వివిధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు

శ్రామిక సమర భేరి

నవంబర్ 9,10,11 తేదీల్లో మహాధర్నా

కేంద్రం దిగిరాకుంటే నిరవధిక సమ్మె

ఇండియా న్యూస్ నెట్‌వర్క్ న్యూఢిల్లీ :

కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా నవంబర్ 9,10,11 తేదీలలో న్యూఢిల్లీలో మహాధర్నా నిర్వహించాలని కేంద్ర కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ ధర్నాపై ప్రభుత్వం స్పందించకపోతే నిరవధిక సమ్మె చేపట్టాలని మంగళవారం ఇక్కడ జరిగిన కేంద్ర కార్మిక సంఘాల సంయుక్త సమావేశం నిర్ణయించింది. ఈ సమావేశంలో సిఐటియు, ఐఎన్‌టియుసి, ఎఐటియుసి, హెచ్‌ఎంఎస్, ఎఐయుటియుసి, టియుసిసి, సేవా, ఎఐసిసిటియు, యుటియుసి, ఎల్‌పిఎఫ్ వంటి సంఘాలతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు బ్యాంకులు, బీమా, రక్షణ, ప్రభుత్వరంగ సంస్థలు, రైల్వేలు, టెలికాం, విద్యుత్, బొగ్గు, ఉక్కు, ఇంధన, పెట్రోలియం, రోడ్డు, వాయు, జల రవాణా రంగాలకు చెందిన కార్మికులు, పోర్టు, డాక్, మెటల్, మైనింగ్, ఐటి రంగాలకు చెందిన ఉద్యోగులు, స్కీమ్ వర్కర్లు ఫార్మా, నిర్మాణ, ప్లాంటేషన్ రంగాలకు చెందిన కార్మిక సంఘాల నేతలు హాజరయ్యారు. కనీస వేతనాలు, సామాజిక భద్రత, ఉద్యోగుల హోదా, వేతనాలు, స్కీమ్ వర్కర్లకు ఇతర సౌకర్యాలు, ప్రైవేటీకరణ, మూకుమ్మడి కాంట్రాక్టీకరణ వంటి అంశాలపై తాముచేసిన 12 డిమాండ్లకు సంబంధించిన ఛార్టర్‌ను నిర్లక్ష్యం చేస్తూ ప్రభుత్వం అహంకార ధోరణిని కొనసాగిస్తోందని, మిగతా 9లో

నైరుతి రుతు పవనాల్లో కదలిక

కోస్తాలో పలుచోట్ల జల్లులు

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

చత్తీస్‌గఢ్ నుంచి కోస్తా, తెలంగాణ, దక్షిణ కోస్తాంధ్ర మీదుగా దక్షిణ తమిళనాడు వరకు ద్రోణి స్థిరంగా కొనసాగుతోందని భారత వాతావరణ శాఖ తెలిపింది. వీటి ప్రభావంతో నైరుతి రుతుపవనాల్లో కదలిక వచ్చినట్లు తెలిపింది. ద్రోణి కారణంగా రాగల మూడు రోజుల్లో కోస్తాంధ్రలో పలు చోట్ల ఓ మోస్తరు నుంచి చెదురు మదురు జల్లులు, అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. రాయలసీమలోనూ అక్కడక్కడా చెదురుమదురు జల్లులు పడతాయని తెలిపింది.మంగళవారం ఉదయానికి కొయ్యలగూడెంలో 4.9, ఎర్రగొండుపాలెంలో 4.0, వేలాయిర్పాడులో 3.6, మార్కాపురం 3.4, పోలవరం, కుక్కునూరు 3.2, వేపాడ, తెర్లాం, బాపట్ల 2.6, నర్సీపట్నం, విజయనగరం 2.3, విజయవాడ 2.2, ప్రకాశం బ్యారేజీ 2.0, పిడుగురాళ్ల 1.7, కూనవరం 1.7 కంబం 1.5 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.

ప్రజల్లోకి సంక్షేమం

- టెలీకాన్ఫరెన్స్‌లో చంద్రబాబు
- జగన్ వ్యాఖ్యలపై ఆగ్రహం
- ప్రతిపక్షనేతవి శాడిస్టు లక్షణాలు
- 2019 ఎన్నికల్లో వైసిపికి 30 సీట్లే



వార్త 2లో

విజయవాడలోని గుణదలలో విద్యుత్‌సౌధ భవనాన్ని ప్రారంభిస్తున్న గవర్నరు నరసింహన్, సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు టిటిపి కార్యకర్తలకు, నాయకులకు పిలుపునిచ్చారు. సంక్షేమ పథకాలపై ఏడాదికి రూ.65 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. మంగళవారం ఉదయం టిడిపి నాయకులతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. మంచి చేస్తే జనం ఎప్పుడూ మనవెంటే ఉంటారని, చెడు చేస్తే క్షమించరని చంద్రబాబు హెచ్చరించారు. విశ్వసనీయత అన్నిటికంటే ముఖ్యమన్నారు. మూడేళ్లలో చేసిన సంక్షేమ పథకాల వల్ల ప్రజాదరణ మనవైపే ఉంటుందన్నారు. ప్రతిపక్షాలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నాయని, సంయమనం పాటించాలని కార్యకర్తలకు సూచించారు. నంద్యాలలో గెలుపు ఖాయమని, 2019 ఎన్నికల్లో వైసిపికి 30 సీట్ల కంటే అదనంగా గెలిచే అవకాశాలు లేవన్నారు. మిత్రపక్షాల గురించి మాట్లాడేటప్పుడు సంయమనంగా వ్యవహరించాలన్నారు. ప్రతిపక్షాలు ఎక్కడ అవకాశం దొరికినా అశాంతిని రేకెత్తించాలని చూస్తున్నాయన్నారు. టిడిపిపై ప్రజల్లో నమ్మకముందని, దాన్ని చెడగొట్టాలని ప్రతిపక్షాలు చేస్తున్న ప్రయత్నాలను చూస్తూ ఊరుకోవద్దని మిగతా 9లో

గుజరాత్ రాజ్యసభ ఎన్నికల

కౌంటింగ్‌లో ప్రతిష్టంభన

- క్రాస్ ఓటింగ్ జరిగిందన్న కాంగ్రెస్
- తోసిపుచ్చిన బిజెపి
- ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసిన రెండు పార్టీలు

న్యూఢిల్లీ/అహ్మదాబాద్ : గుజరాత్ నుండి మంగళవారం మూడు రాజ్యసభ స్థానాలకు జరిగిన ఎన్నికల ఓట్ల లెక్కింపులో ప్రతిష్టంభన నెలకొంది. ఇరువురు కాంగ్రెస్ సభ్యులు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడటమే కాకుండా, తమ ఓట్లను బిజెపి ఎన్నికల ఏజెంటుకు చూపించారని ఇది ఎన్నికల నిబంధనావళి ఉల్లంఘనేనని కాంగ్రెస్ ఆరోపించింది. ఆ రెండు ఓట్లను అనర్హమైనవిగా పేర్కొనాలని ఎన్నికల అధికారులను కోరింది. మరోవంక బిజెపి మిగతా 8లో

వేలిముద్రలు పడకున్నా రేషన్

పౌర సరఫరాల మంత్రి ప్రత్తిపాటి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రేషన్ దుకాణాల్లో లబ్ధి దారుల ఐరిస్, వేలిముద్రలు పడకపోతే వారి ఫొటో తీసుకుని సరుకులు ఇవ్వనున్నట్లు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. వాలిడేషన్ పేరుతో తొలగించిన 60 వేల రేషన్ కార్డులకు వచ్చే నెల నుంచి రేషన్ ఇస్తామన్నారు. పౌర సరఫరాల శాఖ కమిషనర్ కార్యాలయంలో వినియోగదారుల ఫోరాల ప్రతినిధులతో ఆయన మంగళవారం సమావేశమయ్యారు. సరుకుల కల్తీలతో మోసం చేసేవారికి కఠిన శిక్షలు తప్పవన్నారు. ఆహార సరకుల్లో కల్తీ లేకుండా చేయాలన్నారు. ఒకే వస్తువుకు రెండు రకాల ధరల లేకుండా చూస్తామనీ, సినిమా హాళ్ల లోపలికి బయట నుంచి మంచినీళ్ల బాటిళ్లను తీసుకెళ్లేందుకు వీలుగా సర్క్యులర్ జారీ చేస్తామన్నారు. తమిళనాడు నుంచి నాణ్యమైన ఉప్పును దిగుమతి చేసుకునేందుకు తీసుకుంటామన్నారు. వెయ్యి కార్డుదారులున్న రేషన్‌షాపును రెండు మిగతా 9లో

అంతర్ రాష్ట్ర

బదిలీలకు గ్రీన్ సిగ్నల్

- జోన్లు, జిల్లా స్థాయిలకూ మార్గదర్శకాలు సిద్ధం
- దంపతుల్లో ఒకరికి స్థానికత తప్పనిసరి
- దరఖాస్తులకు నెల రోజుల గడువు



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఇష్టం లేకున్నా తెలుగు వేర్వేరు తెలుగు రాష్ట్రాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు అంతర్ రాష్ట్ర బదిలీలకు అవకాశం కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నారు. రెండు రాష్ట్రాల అధికారులతో కూడిన కమిటీ అనేక దఫాలుగా చర్చించిన అనంతరం, తుది మార్గదర్శకాలు ఖరారయ్యాయి. దీనికి సంబంధించిన తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ సర్క్యులర్ విడుదల చేశారు.

2014లో రాష్ట్ర విభజన అనంతరం తరువాత కమల్‌నాథన్ కమిటీ రెండు రాష్ట్రాలకు ఉద్యోగుల పంపకాలు నిర్వహించింది. 42 : 58 నిష్పత్తిలో నిర్వహించిన ఈ పంపకాల్లో అనేక మంది తెలంగాణ ఉద్యోగులు ఆంధ్రాకు, ఆంధ్రా ఉద్యోగులు తెలంగాణకు వెళ్లాల్సి వచ్చింది. వారిలో కొందరు హైదరాబాద్‌లో ఉండాలన్న ఆలోచనతో తెలంగాణకు, 60 ఏళ్ల పదవీ విరమణ నిర్ణయం నేపథ్యంలో మరికొందరు ఆంధ్రాకు సుముఖత చూపించగా, మిగిలిన వారంతా ఇష్టం లేకుండానే ఇరు రాష్ట్రాల్లో పనిచేస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్న సమయంలో జరిగిన జోనల్ స్థాయి నియామకాల్లో కూడా ఇరు ప్రాంతాలకు చెందిన వారు ఇరు రాష్ట్రాల్లోనూ నియమితులయ్యారు. వారిలో అనేక మంది మల్టీ జోన్, జోన్, జిల్లా స్థాయిల్లో పనిచేస్తున్న వారున్నారు. కమలనాథన్ నిబంధనల మేరకు వారంతా వారు పనిచేస్తున్న రాష్ట్రాలకు స్థానికులుగానే ఉండి పోవాల్సి వచ్చింది. తాజాగా రాష్ట్ర విభజన అనంతరం రెండు రాష్ట్రాల్లో పని చేస్తున్న స్థానికేతరులు తమను సొంత రాష్ట్రానికి తీసుకోవాలంటూ డిమాండ్లు చేస్తూ వచ్చారు. వీటిపైనే రెండు రాష్ట్రాల ఉన్నతాధికారులు చర్చించి, చివరికు తాజాగా మార్గదర్శకాలు సిద్ధం చేశారు. దీంతో మల్టీ జోన్, జోన్, మిగతా 9లో

రేపు విద్యా సంస్థల బంద్

విద్యార్థి సంఘాల ఉమ్మడి పిలుపు



విశాఖలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అపరిష్కృత విద్యారంగ సమస్యలపై ఈనెల 10న రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి సంఘాలు ఉమ్మడిగా బంద్‌కు పిలుపునిచ్చాయి. ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు తదితర మౌలిక సదుపాయాలను కల్పించాలని, వసతి గృహాల విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలని మూడేళ్లుగా ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని తాము గురువారం ఈ బంద్‌కు పిలుపునిచ్చామని ఆయా విద్యార్థి సంఘాలు తెలిపాయి. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజులను నియంత్రించడానికి చట్టం చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతుండగా, ప్రభుత్వం సెల్ఫ్ ఫైనాన్స్‌డ్ ఇండిపెండెట్ స్కూల్స్ యాక్ట్-2017 తీసుకురానుంది. ఈ చట్ట ప్రతిపాదనను విరమించుకోవాలని మిగతా 9లో

సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా దీపక్ మిశ్రా



8

- 27న ప్రమాణం



సదావర్తి భూములకు మళ్లీ వేలం : హైకోర్టు

ప్రజాశక్తి, హైదరాబాద్ :

చెన్నైలోని ఏపీ దేవాదాయ, ధర్మాదాయ శాఖకు చెందిన కోట్ల రూపాయల విలువైన సదావర్తి సత్రం భూములపై హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. సదావర్తి భూములను మళ్లీ వేలం వేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. సదావర్తి భూములను తక్కువ ధరకే వేలం నిర్వహించి ప్రభుత్వానికి నష్టం చేకూర్చారని మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యాన్ని మంగళవారం ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి ఉమాదేవీలతో కూడిన డివిజన్ బెంచ్ విచారించింది. రూ. 22.44 కోట్ల కంటే అదనంగా రూ. 5 కోట్లు చెల్లించే వారు ముందుకు వస్తే ఆ వేలాన్ని రద్దు చేస్తామని ఏపీ సర్కార్ హైకోర్టుకు చెప్పింది. అదనపు సొమ్మును కూడా కలిపి వైసీపీ ఎమ్మెల్యే ఆళ్ల చెల్లించారు. ఈ మొత్తం రూ.27.44 కోట్లను కనీస వేలం ధరగా నిర్ణయించి సదావర్తి భూముల్ని తిరిగి వేలం వేయాలని బెంచ్ ఏపీ సర్కార్‌ను ఆదేశించింది. చెన్నైలోని 83 ఎకరాల భూమి వేలం ప్రకటనలను జాతీయ పత్రికల్లో కూడా ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఆరు వారాల్లో వేలం ప్రక్రియ పూర్తి చేయాలని, వేలంలో పిటిషనర్ ఆళ్ల రామకృష్ణారెడ్డి పాల్గొనే అవకాశం ఇవ్వాలని, వేలం ఎప్పుడేస్తారో కూడా తెలియజేయాలని హైకోర్టు ఆదేశించింది. సెప్టెంబర్ 21 జరిగే తదుపరి విచారణ సమయంలో మిగతా 9లో

నంద్యాలలో సామాజిక సమీకరణం

- కుల, మతాల ఆధారంగా ఓట్ల వేట
- ఆయా రంగాలకు చెందిన ప్రముఖులతో ప్రచారం

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

నంద్యాల ఉప ఎన్నికలు అధికార, ప్రతిపక్ష పార్టీలకు ప్రతిష్టాత్మకం కావడంతో గెలుపే లక్ష్యంగా కొత్త పంథా ప్రచారాలను చేపడుతున్నాయి. కులం-మతం, మహిళలు -పురుషుల పరంగా ఓట్లను రాబట్టుకునేందుకు వ్యూహాలు పన్నుతున్నాయి. ఆయా కులాల్లో ప్రముఖులకు పార్టీల కండువాలు కప్పి, ప్రచారానికి రప్పించి ఓట్లు రాబట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. 2,09,616 లక్షల ఓటర్లు ఉన్న నంద్యాల నియోజకవర్గంలో ముస్లిం మైనార్టీలు, కాపుల ఓట్లే కీలకం. వీరితో పాటు ఆర్యవైశ్యులు కూడా కీలకం కానున్నారు. ఈ మూడు సామాజిక తరగతుల తర్వాత ఎస్సిలు, క్రిస్టియన్‌లు, రెడ్లు, యాదవులు గణనీయంగానే ఉన్నారు. మహిళా ఓటర్లు 1.11 లక్షలు, పురుష ఓటర్లు 1.06 లక్షలుగా ఉన్నారు. మహిళా ఓటర్లను ఆకట్టుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు డ్వాక్రా రుణమాఫీలో భాగంగా పెట్టుబడి నిధి కింద రూ.4,000 లను నంద్యాల మహిళలకు అందజేశారు. ఇందుకు ధీటుగా వైసిపి రోజాను రంగంలోకి దించి ప్రచారాన్ని మహిళల మధ్యకు తీసుకెళ్తున్నారు. ఎన్నికల సమరం మొదలైనప్పటి నుంచి టిడిపి, వైసిపిలు కులాల పరంగానే విభజించి ఓట్లడుగుతున్న పరిస్థితి నెలకొంది. 2014లో సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎస్‌డిపిఐ) తరపున బరిలో నిలిచి దాదాపు 6 వేల ఓట్ల దాకా తెచ్చుకున్న అభ్యర్థిని వైసిపి తన పార్టీలోకి చేర్చుకుంది.

పట్టణంలో దాదాపు 60 వేల దాకా ముస్లిం ఓట్లు ఉన్నాయి. టిడిపికి ఈ మూడేళ్ల కాలంలో ఒక్క ముస్లిమును కూడా మంత్రి వర్గంలో తీసుకోలేదనే విమర్శ ఉంది. దీనిని ఎదుర్కొనేందుకు ఏకంగా నంద్యాల పట్టణంలోని ప్రముఖ ముస్లిం నేతలకు పదవులను మిగతా 9లో



నంద్యాలలో ప్రచారం చేస్తున్న శిల్పా మోహన్‌రెడ్డి

ప్రజ్ఞ

1. తాజాగా ఏ రాష్ట్రంలో మరో నెలపాటు సైన్యానికి ప్రత్యేక అధికారాలిచ్చే చట్టాన్ని పొడిగించారు?
2. సైకస్ వృక్ష జాతికి చెందిన మరో చెట్టును శాస్త్రవేత్తలు ఏ రాష్ట్రంలో కనిపెట్టారు?
3. జాతీయ చేనేత దినోత్సవాన్ని ఎప్పుడు నిర్వహిస్తారు?
4. ప్రపంచ బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నియమితులైన భారతీయ వనిత?
5. నీతి ఆయోగ్ నూతన ఉపాధ్యక్షునిగా నియమితులైందెవరు?

సమాధానాలు 7లో

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.
94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి దినపత్రిక, ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4, గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

విద్యుత్తు సంస్కరణల్లో ఎపి ముందుంది

- గవర్నర్ నర్సింహన్
- త్వరలో రెండో దశ విద్యుత్తు సంస్కరణలు:సిఎం చంద్రబాబు
- విద్యుత్తు సౌధను ప్రారంభించిన గవర్నర్, సిఎం



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్తు రంగ సంస్కరణల్లో ఎపి ముందుందని, ఇందుకు సిఎం చంద్రబాబు దూరదృష్టితో వ్యవహరించారని తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఇఎస్ఎల్ నర్సింహన్ అన్నారు. విజయవాడలోని గుణదలలో నిర్మించిన విద్యుత్తు సౌధ భవన సముదాయాన్ని ముఖ్యమంత్రితో కలిసి మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో విద్యుత్తు పరిస్థితిని స్టేట్ లోడ్ డిస్పాచ్ సెంటర్ (ఎస్ఎల్‌డిసి)లో అధికారులు ఆయనకు వివరించారు. అనంతరం నిర్వహించిన సభలో మాట్లాడుతూ విద్యుత్తు రంగంలో సంస్కరణల వల్ల నష్టాలు తగ్గడంతోపాటు ప్రజలకు నాణ్యమైన విద్యుత్తు అందించ డంతో పాటు సంస్థలకు ఆదాయం పెరుగుతోందన్నారు. విద్యుత్తు సౌధ భవనాలకు 'సంవృద్ధి' అనే పేరు పెట్టాలని సూచించారు. విద్యుత్తు ఉద్యోగులు వినియోగదారుల సంతృప్తే లక్ష్యంగా పనిచేయాలన్నారు.

త్వరలో రెండో దశ విద్యుత్ సంస్కరణలు : సిఎం చంద్రబాబు

ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ త్వరలో రెండో దశ విద్యుత్తు సంస్కరణలను రాష్ట్రంలో ప్రారంభిస్తామన్నారు. ఈ సంస్కరణల్లో పంపిణీ నష్టాలను బాగా తగ్గించుకోవడం, నిల్వ చేయడం, ఎక్కడ అవసరాలకు తగ్గట్టుగా అక్కడే విద్యుత్తు ఉత్పత్తి, వినియోగించుకునే అంశాలుంటాయన్నారు. రెండు దశాబ్దాల కిందటే విద్యుత్తు సంస్కరణలు తీసుకొచ్చి దేశానికే ఆదర్శంగా నిలిచామన్నారు. 2004 నుంచి 2014 వరకు సంస్కరణలపై ప్రభుత్వం శ్రద్ధ చూపకపోవడంతో 22.5 మిలియన్ యూనిట్ల లోటుకు చేరుకోవ డానికి కారణమైందన్నారు. మూడేళ్ల కిందట పంపిణీ నష్టాలు 13.89 శాతం ఉంటే ప్రస్తుతం 9.8 శాతానికి తగ్గించామన్నారు. రూ.240కే ఇంటర్‌నెట్, కేబుల్ టివి, ఇతర సౌకర్యాలు ఫైబర్ గ్రిడ్‌లో భాగంగా కల్పిస్తున్నామ న్నారు. విద్యుత్తు శాఖ మంత్రి కళా వెంకట్రావు, ఆ శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్, ట్రాన్స్‌కో సిఎండి విజయా నంద్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దేవినేని ఉమ, ప్రత్తిపాటి పుల్లారావు, ఎమ్మెల్యే గద్దె రామమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపిసి విభాగంలో ముగిసిన ఎంసెట్ కౌన్సెలింగ్

- ఒక్క సీటూ భర్తీ కాని కళాశాలలు 5
- 32,178 సీట్లు ఖాళీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపి ఎంసెట్ ఎంపిసి విభాగంలో తుది విడత కౌన్సెలింగ్ ముగిసింది. ఈనెల 5,6 తేదీల్లో జరిగిన ఈ ప్రక్రియ మంగళవారంతో ముగిసింది. ఇందుకు సంబంధించిన అలాట్‌మెంట్ ఆర్డర్లను ఎపి ఎంసెట్ కన్వీనర్ జిఎస్ పాండదాస్ సీట్ల కేటాయింపు అనంతరం విడుదల చేశారు. ఈనెల 11లోపు సీట్లు పొందిన అభ్యర్థులు ఆయా కళాశాలల్లో రిపోర్టు చేయాల్సి ఉంటుందని కన్వీనర్ తెలిపారు. కన్వీనర్ విభాగంలో ఈ విద్యా సంవత్సరం 98,251 సీట్లు అందుబాటులో ఉన్నాయి. మొత్తం 66,073 సీట్లు భర్తీ అవ్వగా, 32,178 ఖాళీగా మిగిలాయి. ఇంజనీరింగ్ కళాశాలలు 291, ఫార్మసీ కళాశాలలు 120, ఫార్మా డి కళాశాలలు 56 ఉన్నాయి. యూనివర్సిటీ కళాశాలల పరిధిలో 4,661 సీట్లు అందుబాటులో ఉండగా, 128 సీట్లు భర్తీ అయ్యాయి. తుది విడతలో 13,379 మంది అభ్యర్థులు ఆప్షన్లు ఇవ్వగా, 2,040 మందికి సీట్లు కేటాయింపు జరిగింది. ఈ ఏడాది బోణీ కొట్టని కళాశాలలు ఐదు ఉన్నాయి. 1 నుంచి 5వరకు భర్తీ అయిన కళాశాలలు 14, ఆరు నుంచి 10 వరకు భర్తీ అయిన కళాశాలలు 9, 11 నుంచి 15 వరకు భర్తీ అయిన కళాశాలలు 9 ఉన్నాయి. 900 సీట్లకు మించి భర్తీ అయిన కళాశాల ఒక్కటే ఉంది. ఎక్కువగా ఇసిఇ గ్రూపును విద్యార్థులు ఎంపిక చేసుకున్నారు. మొత్తం 24,047 సీట్లు ఉండగా, 18,767 మంది ఈ గ్రూపునకు ఆప్షన్లు ఇచ్చారు. ఆ తరువాత కంప్యూటర్ సైన్స్ గ్రూపును ఎంచుకున్నారు. 21,779 సీట్లు ఉంటే, 17,490 మంది ఆప్షన్లు ఎంచుకున్నారు. 9 గ్రూపులకు ఒక్క విద్యార్థి కూడా ఆప్షన్ ఇవ్వలేదు. ఎంపిసి బైపిసి విభాగం విద్యార్థులు ఈ నెల 10 వరకు మొదటి కౌన్సెలింగ్, 11 సీట్ల అలాట్‌మెంట్ ఉంటుంది. తుది విడత కౌన్సెలింగ్ ఈ నెల 22 నుంచి 24 వరకు, సీట్ల అలాట్‌మెంట్ 25న ఉంటుంది. ఎపి ఐసెట్ అభ్యర్థులకు బుధవారం సీట్ల కేటాయింపు ఉంటుంది.

	మొత్తం సీట్లు	భర్తీ	ఖాళీ
ఇంజనీరింగ్	94,009	65,704	28,305
ఫార్మా	4,152	369	3,783

సెల్ఫ్ ఫైనాన్స్‌డ్ ఇండిపెండెంట్ యాక్ట్‌పై 13న ఫాప్టో రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపి సెల్ఫ్ ఫైనాన్స్‌డ్ ఇండిపెండెంట్ యాక్ట్-2017పై ఈ నెల 13న ఫ్యాప్టో ఆధ్వర్యంలో విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర సదస్సును నిర్వహించనున్నారు. పాఠశాల స్థాయిలో విద్యావ్యాపారాన్ని అడ్డూ అదుపులేకుండా విస్తరించడానికి, కార్పొరేట్ సంస్థల చేతికి అప్పజెప్పడానికి ముసాయిదా బిల్లును ప్రభుత్వం ప్రవేశపెట్టిందని ఫ్యాప్టో చైర్మన్ పి బాబురెడ్డి, సెక్రటరీ జనరల్ జి హృదయరాజు మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ విద్యా చట్టం-1964కు లోబడి జీవో 1 ద్వారా ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్ పాఠశాలల స్థాపన, నిర్వహణ జరుగుతుందని తెలిపారు. ఈ చట్టంలో ఉన్న లోపాలను సవరించాలని కోరుతున్న సందర్భంలో దుర్మార్గమైన ముసాయిదా చట్టం-2017ను ప్రవేశపెట్టారని వారు పేర్కొన్నారు. దీనిద్వారా పాఠశాలలు భూముల్ని పొందడం, కనీస ఫీజుల పెంపు 12శాతం, అడ్మిషన్లు, సిలబస్, పనిదినాలు, సమయాలు, బోధనా విధానాలపై ప్రభుత్వంతో సంప్రదించడం ఉండదని తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు కూడా స్వేచ్ఛ, హక్కులుండవని పేర్కొన్నారు. ఇది సహజ న్యాయానికి విరుద్ధమని వారు పేర్కొన్నారు. వ్యాపార ప్రయోజనాల ముసాయిదాను ఫ్యాప్టో వ్యతిరేకిస్తుందని, దీనిపై ఉద్యమ చైతన్యం కోసం రాష్ట్ర సదస్సును ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు,తల్లిదండ్రులు, మేధావులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాసంఘాలు, విద్యావేత్తలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

జియోలాజికల్ మ్యాపింగ్‌పై ఆస్ట్రేలియా ఆసక్తి

- త్వరలో విశ్వవిద్యాలయం ఏర్పాటు
- సిఎంతో క్వీన్స్‌ల్యాండ్ ప్రతినిధుల భేటీ



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఏపిలో హైరిజల్యూషన్ జియోలాజికల్ మ్యాపింగ్‌కు దోహదం చేసే సర్వే అసిస్టెన్స్ సిస్టమ్స్ ప్రాజెక్టును చేపట్టేందుకు తాము ఆసక్తిగా ఉన్నామని ఆస్ట్రేలియా కాన్సుల్ జనరల్ షాన్ కెల్లీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలిపారు. మంగళవారం సచివాలయంలో ఆస్ట్రేలియా క్వీన్స్‌ల్యాండ్ ప్రతినిధి బృందం సిఎంతో భేటీ అయ్యారు. ఏపిలో త్వరలో విశ్వవిద్యాలయంగాని, సెంటర్ ఫర్ ఎక్సలెన్స్‌గాని ఏర్పాటు చేస్తామన్నారు.

దీనిపై త్వరలోనే అవగాహనా ఒప్పందాన్ని చేసుకుంటామన్నారు. అలాగే ఏపిలో గనులు, రోడ్డు రవాణా, తయారీ రంగం, విద్య తదితర రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు తమ పారిశ్రామికవేత్తలు ఆసక్తి కనబరుస్తున్నారని. ఆస్ట్రేలియా-ఏపి మధ్య పరస్పర సహాయ సహకారాలు పెంపొందించుకునేందుకు కృషి చేస్తామన్నారు. రోడ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్‌పై రాష్ట్ర ప్రభుత్వంతో ఇప్పటికే కలిసి పనిచేస్తున్నామని షాన్ కెల్లీ తెలిపారు. ప్రపంచ బ్యాంకు సహాయంతో ఏఆర్ఆర్‌బి రహదారుల సర్వే చేపడుతోందన్నారు. రహదారుల అభివృద్ధికి ఆస్ట్రేలియా ఉత్తమ పద్ధతుల్ని ఏపిలో అమలు చేస్తామన్నారు. మారుమూల గ్రామాల్లో ఏటిఎం సదుపాయం కల్పించేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తామన్నారు. సిఎంను కలిసిన వారిలో క్వీన్స్‌ల్యాండ్ ప్రతినిధి శాండ్రా డెట్లెమ్ కూడా ఉన్నారు. ఆస్ట్రేలియాతో ఒప్పందం కుదుర్చుకున్న ప్రాజెక్టుల్ని త్వరితగతిన చేపట్టేందుకు వీలుగా తగిన చర్యలు తీసుకోవాలని సిఎస్ దినేష్ కుమార్ ఆయా శాఖల అధికారుల్ని ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో ఆస్ట్రేలియా-ఏపి ఎకనమిక్ కోఆపరేషన్ వర్కింగ్ గ్రూపు ప్రతినిధులతో సిఎస్ సమావేశమయ్యారు. ఎలక్ట్రిక్ బస్సు రవాణా ప్రక్రియను పైలట్ ప్రాజెక్టుగా చేపట్టేందుకు తగిన ప్రణాళికను సిద్ధం చేయాలని ఆర్టీసీ ఎండి మాలకొండయ్యను ఆయన ఆదేశించారు.

యుఎస్, ఐరోపాల్లో అమరావతి గ్యాలరీ

- బౌద్ధ విశేషాల ప్రదర్శన
- పరకాలతో మ్యూజియం ప్రతినిధుల భేటీ



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరావతి ఖ్యాతి అంతర్జాతీయ స్థాయిలో మారుమోగేలా అమెరికా సంయుక్త రాష్ట్రాలు, ఐరోపా దేశాల్లో ఇక్కడి కళాఖండాలు, చారిత్రక వస్తువులు ప్రదర్శించనున్నారు. ఆయా దేశాల్లో త్వరలో జరిగే అంతర్జాతీయ బౌద్ధ విశేషాల ప్రదర్శనలో అమరావతి, ఆంధ్రదేశం అంశాలపై ప్రత్యేక గ్యాలరీని ఏర్పాటు చేస్తామని మెట్రోపాలిటన్ మ్యూజియం ఆఫ్ ఆర్ట్ సంస్థ ప్రతినిధులు తెలిపారు. సచివాలయంలో మంగళవారం వారు ప్రభుత్వ సలహాదారు పరకాల ప్రభాకర్‌తో సమావేశమయ్యారు. ' మెట్రోపాలిటన్ మ్యూజియం ఆఫ్ ఆర్ట్ ' ఏర్పడి 150 వసంతాలు పూర్తయిన సందర్భంగా ఈ ప్రదర్శన నిర్వహిస్తున్నామని ఆ సంస్థ ఆసియా ప్రతినిధి జాన్ గయ్ తెలిపారు. నవంబర్‌లో మరోమారు అమరావతి సందర్శించి ముఖ్యమంత్రి సహా ప్రముఖులకు ఈ ప్రదర్శనకు రావాల్సిందిగా ఆహ్వానాలు అందజేస్తామన్నారు. తొమ్మిది నెలల పాటు ఈ ప్రదర్శన ఉంటుందని, ఎప్పుడు నిర్వహిస్తారో త్వరలో ప్రకటిస్తామని చెప్పారు. చారిత్రక విశేషాలు, పురాతన శాసనాలను పరిరక్షించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై పురావస్తు నిపుణులకు అవసరమైన శిక్షణ ఇస్తామన్నారు. ప్రభుత్వం తరపున ఈ కార్యక్రమానికి అవసరమైన సహకారం అందిస్తామని పరకాల వారికి హామీ ఇచ్చారు. స్థపతి ఈమని శివనాగిరెడ్డి, చరిత్రకారుడు కవిసాయి పాపినేని ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ఆరు వారాల్లోగా సమాచార కమిషనర్లను నియమించాలి

తెలుగు రాష్ట్రాలకు హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్

ఆరు వారాల్లోగా సమాచార కమిషన్‌కు ప్రధాన కమిషనర్లు, కమిషనర్లను నియమించే ప్రక్రియను పూర్తి చేయాలని తెలుగు రాష్ట్రాలను హైకోర్టు ఆదేశించింది. ఈ ఆదేశాల అమలు కోసం తీసుకున్న చర్యల్ని అఫిడవిట్ ద్వారా తెలపాలని మంగళవారం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి జె.ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ ఆదేశించింది. స్వచ్ఛంద సంస్థ ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ కార్యదర్శి ఎం.పద్మనాభయ్య దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని బెంచ్ మంగళవారం విచారించింది. ఆరు వారాల్లో నియామకాలు చేస్తామని తెలంగాణ అడ్వకేట్ జనరల్ డి.ప్రకాష్‌రెడ్డి హామీ ఇచ్చారు. తమకు మరింత సమయం కావాలని ఎపి ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది రమేష్ చెప్పారు. అంత సమయం ఎందుకని హైకోర్టు ప్రశ్నించింది. సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 15(1) ప్రకారం ప్రతీ రాష్ట్రానికి ప్రత్యేక సమాచార కమిషన్ ఉండాలని, ఎపికి విడిగా కమిషన్‌ను ఏర్పాటు చేసుకుంటా మని రమేష్ తెలిపారు. అదనపు సమయం ఇవ్వలేమని హైకోర్టు తేల్చి చెప్పింది.

ఒత్తిడి లేని విద్యను అందించాలి

ఇంటర్ బోర్డు కార్యదర్శి ఉదయలక్ష్మి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యార్థులకు ఒత్తిడి లేని విద్యను అందించాలని ఇంటర్మీడియేట్ బోర్డు కార్యదర్శి ఉదయలక్ష్మి సూచించారు. రాష్ట్రంలోని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లకు మూడు రోజుల పాటు శిక్షణ తరగతులు మంగళవారం ప్రారంభమయ్యాయి. విజయవాడలోని సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో ఏర్పాటైన ఈ కార్యక్రమంలో ఆమె ప్రారంభోపన్యాసం చేశారు. జూనియర్ కళాశాలల్లో ఎదురయ్యే సమస్యలకు ఈ శిక్షణా ద్వారా పరిష్కారాలు తెలుసుకోవాలని ఉదయలక్ష్మి తెలిపారు. విద్యార్థుల ఆత్మహత్యల నివారణపై ద్విసభ్య కమిటీ సూచించిన విషయాలను అన్ని జూనియర్ కళాశాలలు పాటించాలన్నారు. ఈ శిక్షణలో ఏడు జిల్లాల జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, లీడ్ ఇండియా ప్రతినిధులు,, ఇంటర్మీడియేట్ విద్యా మండలి, కమిషనరేట్ అధికారులు పాల్గొన్నారు.

ఓటమి భయంతో వ్యవస్థలను భ్రష్టు పట్టిస్తున్న సిఎం

వైసిపి అధికార ప్రతినిధి సీతారాం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలుగుదేశం పార్టీకి నంద్యాల ఉప ఎన్నికల్లో ఓటమి భయం పట్టుకుందని, అందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దగ్గరుండి అన్ని వ్యవస్థల్ని భ్రష్టుపట్టిస్తున్నారని వైసిపి అధికార ప్రతినిధి తమ్మినేని సీతారాం ఆరోపించారు. గెలుపు కోసం విచ్చలవిడిగా అవినీతి, అరాచకాలకు పాల్పడుతున్నారన్నారు. హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఉపఎన్నికల్లో వైసిపి గెలిస్తే...ఆ పార్టీని కంట్రోల్ చేయలేమని కుట్రలు, కుతంత్రాలకు పాల్పడుతూ అధికార పార్టీ ప్రజాస్వామ్యాన్ని నవ్వులపాల్జేస్తోందని ధ్వజమెత్తారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, టిడిపి నాయకులు నంద్యాలలో తిష్టవేసి డబ్బు, మద్యం ఏరులుగా పారిస్తున్నారన్నారు. దేవాలయాలు, దర్గాలు, ప్రార్థనా మందిరాలంటూ డబ్బులు పంచుతున్నారని ఆరోపించారు.
2014 ఎన్నికల్లో ఇచ్చిన 600లకు పైగా వాగ్దానాలకు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరించచదంటున్నారన్నారు. అప్పట్లోనే ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తే, తనకు రాజకీయ అనుభవం చాలా ఉందని, వనరులను సమీకరించుకోగలనని మాట్లాడారని గుర్తు చేశారు. అధికారం చేపట్టగానే ఎన్నికల వాగ్దానాలను తుంగలో తొక్కి ప్రజలను మోసం చేశారన్నారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎలక్షన్ కమిషన్‌కు, గవర్నర్‌కు విజ్ఞప్తి చేశారు. అవసరమైతే కేంద్ర బలగాలను రప్పించాలని కోరారు.

విభజన నాటి నుంచే 60 ఏళ్లు

షెడ్యూల్ సంస్థల్లో పదవీ విరమణపై సవరణ ఉత్తర్వులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

షెడ్యూల్ 9, 10 సంస్థల్లో పని చేసే ఉద్యోగులకు 60 ఏళ్ల పదవీ విరమణ అమలుపై ఇటీవల జారీ చేసిన ఉత్తర్వులను సవరిస్తూ మంగళవారం తాజా ఆదేశాలు జారీ చేశారు. పదవీ విరమణ నిర్ణయాధికారం ఆయా షెడ్యూల్ సంస్థలదేనని, వారు నిర్ణయం తీసుకున్న రోజు నుంచే 60 ఏళ్ల నిర్ణయం అమలులోకి వస్తుందని ముందుగా ప్రకటించగా, తాజా ఉత్తర్వుల్లో రాష్ట్ర విభజన జరిగిన రోజు నుంచి అమలులోకి వస్తుందని సవరించారు. దీంతో పెంపు నిర్ణయం తీసుకున్న సంస్థల్లో 2014 తరువాత పదవీ విరమణ చేసిన వారికి, పదవీ విరమణకు దగ్గరలో ఉన్న వారికి మేలు కలగనుంది.

కూరగాయల ధరలు సిఎంకు పట్టవా?

పిసిసి నేత రఘువీరా ధ్వజం

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో

రైతుబజార్లలో నాణ్యత లేని కూరగాయలు విక్రయిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పిసిసి అధ్యక్షులు ఎన్ రఘువీరారెడ్డి విమర్శించారు. విజయవాడ స్వరాజ్య మైదానంలోని రైతు బజార్‌ను రఘువీరారెడ్డి మంగళవారం సందర్శించి దుకాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూరగాయల ధరలు కొండెక్కుతుంటే కనీసం వాటి ధరలను నియంత్రించాలన్న ధ్యాసే చంద్రబాబుకు పట్టడం లేదన్నారు. ఉల్లి, టమోట ధరలు సామాన్యులకు అందుబాటులో లేవన్నారు. మహారాష్ట్ర, కర్నూలులో ఉల్లి అందుబాటులో ఉన్నా ఇక్కడకు ఎందుకు సరఫరా కావట్లేదని ప్రశ్నించారు. దళారీలతో ప్రభుత్వం చేతులు కలిపి రైతు బజార్లను నిర్వీర్యం చేస్తోందని ధ్వజమెత్తారు. రైతు బజార్‌లో తాగునీరు, మరుగుదొడ్లు లేక స్టాళ్ల యజమానులు, వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారని, ఇక్కడ రైతులకన్నా బినామీలే ఎక్కువగా ఉన్నారని విమర్శించారు. బినామీలను నియంత్రించక పోవడం దారుణమని వ్యాఖ్యానించారు. పిసిసి మహిళా విభాగం అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ, పిసిసి ప్రధాన కార్యదర్శి మీసాల రాజేశ్వరరావు, ఎన్ నరసింహరావు, కృష్ణా డిసిసి అధ్యక్షులు ధనేకుల మురళి తదితరులు పాల్గొన్నారు.

90వేల మందికి ఉద్యోగాలు

నైపుణ్యాభివృద్ధి సంస్థ సిఇవో సత్యనారాయణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నైపుణ్యాభివృద్ధి సంస్థ (స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 3 లక్షల 50 వేల మందికి శిక్షణ ఇవ్వగా వారిలో 90 వేల మందికి ఉద్యోగాలు లభించాయని ఆ కార్పొరేషన్ సిఇవో కెవి సత్యనారాయణ తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడలోని ఒక ప్రైవేటు హోటల్‌లో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఎడ్యుకేషన్ వర్క్‌షాపును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించడానికి ప్రత్యేక వ్యవస్థలు కానీ, వ్యక్తులు కానీ లేరని, రాష్ట్ర ప్రభుత్వం ఈ లోటును తీర్చి యువతకు శిక్షణ ఇవ్వడానికి నైపుణ్యాభివృద్ధి సంస్థను ఏర్పాటు చేసిందన్నారు. నూతన విధానాలను అనుసరిస్తూ ప్రపంచలో పేరొందిన నార్త్ ఈస్టన్ యూనివర్సిటీ వంటి సంస్థలతో మెలకువలు అందిస్తున్నట్టు తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులకు ఆరు నెలల కోర్సులు కూడా అందిస్తున్నామన్నారు. పాఠశాలల స్థాయి నుంచి కళాశాల స్థాయి వరకు శిక్షణా కార్యక్రమాల్ని చేపడుతున్నట్టు చెప్పారు. నూతన ఆలోచనాభివృద్ధికి విద్యార్థుల్లో ఆసక్తి కలిగించి ఔత్సాహికులు కొత్త వెంచర్లు ఏర్పాటు చేసే స్టార్టప్స్ కోసం కృషి చేస్తోందన్నారు. ఐటి రంగంతో సమానంగా స్టార్టప్స్‌కి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నైపుణ్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థకు దీన్‌దయాళ్ అర్బన్ గంగా కళ్యాణ్ యోజన కేంద్ర ప్రభుత్వ అవార్డు లభించిందన్నారు. ఇటువంటి వర్క్ షాపుల వల్ల యువతకు ఎంతో మేలు చేకూరుతుందని కార్పొరేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ గంటా సుబ్బారావు అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు హెల్త్‌కేర్ రీసెర్చ్ సెంటర్‌కు శంకుస్థాపన

ప్రజాశక్తి-తుళ్లూరు

రాజధాని ప్రాంతమైన గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం దొండపాడుకు సమీపంలో బిఆర్ షెట్టి హెల్త్ కేర్ రీసెర్చ్ సెంటర్ నిర్మాణానికి గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గురువారం ఉదయం 10.30 గంటలకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమాలను రూరల్ ఎస్‌పి అప్పలనాయుడు ఏర్పాట్లను పరిశీలించారు.

వ్యాపార సరళీకరణకు కొత్త చట్టం

ఆమోదం తెలిపిన ఈఓడీబీ కమిటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో వ్యాపార సరళీకరణకు ప్రభుత్వం కొత్తగా ప్రజాసేవల పంపిణీ హామీ(పబ్లిక్ సర్వీసెస్ డెలివరీ గ్యారంటీ) చట్టాన్ని తీసుకురానుంది. క్లియరెన్సులు, అనుమతులు, లైసెన్సులు, పునరుద్ధరణ వంటి సేవలకు నిర్ధిష్ట కాలపరిమితిని నిర్ణయించేందుకు చట్టాన్ని రూపొందిస్తున్నారు. ఒకవేళ నిర్ధిష్ట కాలపరిమితికి మించి జాప్యం జరిగితే సంబంధిత అథారిటీకి అప్పీల్ చేసే పటిష్ట వ్యవస్థ ఈ చట్టం ద్వారా అందుబాటులోకొస్తుంది. అధికారులు కాలయాపన చేసినట్లు రుజువైతే దరఖాస్తుదారుడు తగిన పరిహారం పొందే అవకాశాన్ని కూడా చట్టం కల్పిస్తుంది. మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఆయా శాఖల ఉన్నతాధికారులతో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ (ఈఓడీబీ) కమిటీ సమావేశం జరిగింది. వ్యాపార సంస్కరణల కార్యాచరణ ప్రణాళిక (బిఆర్ ఏపి)లో భాగంగా ఈ కొత్త చట్టాన్ని తీసుకురావాలని కమిటీ ప్రతిపాదించింది. సకాలంలో పని పూర్తి చేయగలమనే ధీమాతోనే ఇలాంటి నిబంధనలు పెడుతున్నామని సిఎం ఈ సందర్భంగా తెలిపారు. ఈఓడీబీ ప్రతిపాదించిన బిఆర్ఏపి 2017ను ఈ సమావేశంలో ఆమోదించారు. ఈ సంస్కరణలతో పెద్దఎత్తున పెట్టుబడులు సమకూర్చేందుకు వీలుంటుందని సిఎం అభిప్రాయపడ్డారు. ఇప్పటివరకు అమలులో ఉన్న ' సింగిల్ విండో యాక్ట్ 2002 ' ను ' ఇండస్ట్రీస్ సర్వీసెస్ డెలివరీ రైట్ అండ్ గ్యారంటీ యాక్ట్ 2017' గా సవరణ చేయాలని ఈఓడీబీ ప్రతిపాదించింది. మొత్తం 373 సంస్కరణలకుగాను ప్రస్తుతం 245 అమలవుతున్నాయని, మిగిలిన సంస్కరణలు అమలు దశలో ఉన్నాయని అధికారులు సిఎంకు వివరించారు. సంస్కరణల అమలులో వేగం పెంచి ఈనెల 25 నాటికి వాటన్నింటినీ అమలు చేయాలని సిఎం అధికారులకు స్పష్టం చేశారు.

నంద్యాలలో గెలుస్తాం : ఎంపి జెసి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నంద్యాలలో గెలుపు టిడిపిదేనని, అయితే టిడిపి మీద ఉన్న వ్యతిరేకత వల్ల మెజారిటీ రాదని అనంతపురం ఎంపి జెసి దివాకరరెడ్డి అన్నారు. బిజెపి ఎప్పటికీ జగన్‌తో కలవదని, ప్రధాని మోడీకి కొన్ని నైతిక విలువలున్నాయని తెలిపారు. సచివాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 2019 ఎన్నికల్లో బిజెపి, టిడిపి కలిసే పోటీచేస్తాయన్నారు. ఆశించిన మోజార్టీని రోజమ్మ, జగనయ్య కలిసి నాశనం చేశారన్నారు. నంద్యాలలో సభ తరువాత జగన్ వ్యాఖ్యలతో వైసిపి గబ్బు పట్టిందన్నారు.

నేటి నుంచి నంద్యాలలో జగన్ పర్యటన

13 వరకు ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నంద్యాల ఉప ఎన్నికల ప్రచారాన్ని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ముమ్మరం చేసింది. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రచార షెడ్యూల్‌ను పార్టీ కార్యాలయం మంగళవారం విడుదల చేసింది. ఈ నెల 9 నుంచి వరుసగా 13 వరకు నంద్యాల నియోజకవర్గంలో జగన్ పర్యటించనున్నారు. తొలిరోజు ప్రచారం మధ్యాహ్నం ఒంటి గంటకు రైతు నగరం నుంచి ప్రారంభించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. రామకష్ణానగర్, కానాల, హెచ్ఎస్ కోట్ల మీదుగా బాబానగర్ వరకు ప్రచారం సాగుతుంది. అనంతరం గోస్పాడు మండలంలో ఎం.చింతకుంట్ల, జూలేపల్లి, పసురపాడు, శ్రీరాంనగర్, తేల్లపురి, రాయపాడు మీదుగా ఎస్.కల్లూరు వరకు జగన్ రోడ్‌షో ఉంటుంది. 10న ఉదయం 8:30 గంటలకు నూనెపల్లి క్రాస్ రోడ్ నుంచి ప్రచారం ప్రారంభమవుతుంది. అక్కడి నుంచి చాబోలు, సంబవరం, దీబగుంట, కానాలపల్లె, ఎస్.నాగులవరం, నెహ్రూనగర్, సత్యనారయణపురం, జిల్లెల్ల వరకు రోడ్‌షో చేపడతారు. తిరిగి దేబగుంట చేరుకుని అక్కడి నుంచి అయ్యలూరు మెట్ట, అయ్యలూరు, పెదకొట్టాల మీదుగా కొత్తపల్లి వరకు రోడ్‌షో జరుగుతుంది. 11న పూర్తిగా నంద్యాల మండలంలోనే ప్రచారం జరుగనుంది. చప్పిరేవుల నుంచి ప్రారంభమయ్యే రోడ్‌షో సాయంత్రం వైఎస్ఆర్ నగర్ వరకు సాగనుంది. 12న పూర్తిగా కార్యకర్తలతో సమావేశమవుతారు. మరుసటి రోజు గోస్పాడు మండలంలో రోడ్‌షో చేపట్టనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ఎల్లేరు నుంచి సాయంత్రం 7 గంటలకు శ్రీనివాసపురం చేరుకుంటారు.

జగన్‌కు కృతజ్ఞతలు తెలిపిన ఆర్యవైశ్య సంఘాల నేతలు

అధికారంలోకి రాగానే ఆర్యవైశ్యుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీపై ఆర్యవైశ్య సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. మంగళవారం పలువురు ఆర్యవైశ్య సంఘాల నేతలు హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో వైఎస్ జగన్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వైసిపి ఎమ్మెల్సీ కోలగట్ల వీరభద్రస్వామి, పార్టీ నేతలు వెల్లంపల్లి శ్రీనివాస్, గుబ్బా చంద్రశేఖర్‌ల ఆధ్వర్యంలో ఆర్యవైశ్య మహాసభ ప్రతినిధులు జగన్‌తో భేటీ ఆయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, అధికారంలోకి రాగానే ఆర్యవైశ్యులకు కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని జగన్ హామీ ఇవ్వడం శుభపరిణామన్నారు. అన్ని కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసినప్పుడు, చంద్రబాబు నాయుడు తమకు మాత్రం ఎందుకు కార్పొరేషన్ ఏర్పాటు చేయడం లేదని ప్రశ్నించారు.

సర్కారుకి పట్టని ఎంబిసిలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వెనుకబడిన తరగతుల్లో అత్యంత వెనుకబడిన తరగతుల (ఎంబిసి) కార్పొరేషన్ విషయంలో ప్రభుత్వం మరింత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. రాష్ట్రంలోని బిసిలతో సమానంగా ఎంబిసిలను కూడా అన్ని విధాలుగా ఆర్థికంగా అభివృద్ధి చేస్తామని గతంలో ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఎంబిసిలకు ప్రత్యేకంగా ఒక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆ మేరకు 2016 జూన్ 8న ఉత్తర్వులు కూడా జారీ చేశారు. తర్వాత దీన్ని గాలికి వదిలేశారు. ఏడాది తర్వాత 2017 ఏప్రిల్ 10న ' ఆంధ్రప్రదేశ్ మోస్ట్ బ్యాక్‌వర్డ్ క్లాస్ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ' పేరుతో కంపెనీ చట్టం కింద పేరును మాత్రమే నమోదు చేసిన ప్రభుత్వం అక్కడితో చేతులు దులుపుకుంది. ఆ తర్వాత దానిని పట్టించుకున్న పాపాన పోలేదు. ఇంత వరకు ఎంబిసి కార్పొరేషన్ విధివిధానాల్ని రూపొందించడం కానీ, చైర్మన్‌తో పాటు ఇతర సభ్యుల్ని నియమించడం కానీ చేయలేదు.

రాష్ట్రంలోని బిసి వర్గాల్లో అత్యంత వెనుకబడిన ఎంబిసిల్ని బిసి జాబితాలో చేర్చారే కానీ నేటికీ వారి గురించి పట్టించుకోకపోవడం గమనార్హం. వీరిలో అత్యధిక కులాల వారు నేటికీ భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి స్థిర నివాసమంటూ లేకపోవడం వల్ల రేషన్ కార్డుకానీ, ఆధార్ కార్డు కానీ ఉండదు. విద్యా, ఉద్యోగ రంగాల్లో వీరి స్థానం గురించి ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. రాజకీయ, వ్యాపార రంగాల్లో వీరి ప్రాతినిధ్యం జీరో అనే చెప్పాలి.

ఇటువంటి వారిలో ఇప్పటి వరకు 32 కులాలను ప్రభు త్వం గుర్తించింది. వీరు అత్యంత దుర్భర పరిస్థితుల్లో జీవనాన్ని సాగిస్తున్నారని ప్రభుత్వమే పేర్కొంది. బుడబుక్కల, బాలసంతు, బండర, గంగిరెద్దుల,జంగం, జోగి, కాటికాపల, పాముల వంటి కులాల వారు ఈ జాబితాలో ఉన్నారు. వీరికి విద్యను అందించడంతో పాటు ఆర్థికంగా వీరిని అభివృద్ధి చేసి, జనజీవన స్రవంతిలో కలపాలనే సదుద్దేశంతో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని గతేడాది ప్రభుత్వం నిర్ణయించింది.

అంతేకాకుండా వీరిపై విస్తృత స్థాయిలో పరిశోధనలు జరగాల్సి ఉందని, ఈ దిశగా చర్యలు తీసుకుంటామని కూడా గతంలో ప్రకటించింది.

ఎంబిసి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తామని ప్రకటించి ఏడాది అవుతున్నా ఇంత వరకు ఆయా ఎంబిసి కులాల వారు ఎంత మంది ఉన్నారో కూడా లెక్కలు తేల్చలేదు. ఎంబిసిలు ఏయే ప్రాంతాల్లో ఉన్నారు, ఎంత మంది ఉన్నారు, వారి జీవన స్థితిగతులు ఎలా ఉన్నాయనే అంశాలపై కూడా ఇంత వరకు సర్వే జరగలేదు.

అడిగేవారు లేరనే

ఆయా వర్గాల నుంచి ఎటువంటి ఒత్తిడి రానందు వల్లే ఎంబిసి కార్పొరేషన్ ఏర్పాటు పై ప్రభుత్వం నాన్చుడు ధోరణితో వ్యవహరిస్తోందన్న విమర్శలొస్తున్నాయి. దీనికి తోడు ఎంబిసి వల్ల ప్రభుత్వానికి ఎటువంటి రాజకీయ లాభం లేదని, ప్రస్తుతం ఏర్పాటు చేసిన కార్పొరేషన్లు, ఫెడరేషన్ల వల్ల అయితే ప్రభుత్వానికి ఎంతో కొంత రాజకీయ లాభం ఉంటుందని, దీంతో వాటిపై ప్రభుత్వం ఎక్కువ మక్కువ చూపుతోందని అధికారులు వ్యాఖ్యానిస్తున్నారు.

పోర్టు భూములపై 'రియల్' బేరం!

- ప్రయివేటు కంపెనీల వ్యాపారాలకు ఆహ్వానం
- మోడీ నియోజకవర్గం వడోదర నుంచి భూవిలువ బృందాలు



విశాఖ నగరంలోని హార్బర్ పార్కు ఏరియాలో పోర్టుకు చెందిన భూములివే..

ప్రజాశక్తి - విశాఖపట్నం ప్రతినిధి

వైజాగ్ పోర్టు సిటీ అన్న నామకరణం కనుమరుగయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. 2007లోనే పోర్టుకు కూతవేటు దూరంలోని గంగవరంలో ప్రయివేటు పోర్టుకు అనుమతులను ఇచ్చేసి మేజర్ పోర్టు వ్యాపారాన్ని దెబ్బతీసిన విషయం తెలిసిందే.

విశాఖ పోర్టు ట్రస్ట్ (విపిటి) ఇప్పటికే కార్గో హేండ్లింగ్ లక్ష్యాల్లో వెనుకబడి పోర్టు భవిష్యత్‌పై నీలినీడలు అలముకుంటున్నాయి.. తాజాగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, యాజమాన్యం పోర్టు ట్రస్టు భూములను రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులకు పిపిపి పద్ధతిలో లీజుకిచ్చే నిర్ణయాన్ని తాజాగా చేపట్టింది. వ్యాపారాలు, వాణిజ్య అవసరా లకు లీజుకిచ్చేందుకు ప్రక్రియను మొదలుపెడుతున్నారు.

ఇప్పటికే విశాఖ నగరంలోని కైలాసపురం ఖాళీ అయ్యింది. మల్కాపురం సిబ్బంది క్వార్టర్స్‌లో అధికారులు చాలావరకూ ఖాళీ చేయించారు. కైలాస పురంలోగల 30 ఎకరాల్లోని క్వార్టర్స్ అన్నింటినీ పడగొట్టేసి ఈ భూమినంతటినీ 4నెలల క్రితమే ఐటి కంపెనీలకిచ్చేయ్యాలని నిర్ణయించింది. తాజాగా కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం వైజాగ్ పోర్టు భూములను అమ్మేయాల్సిందిగా ఆదేశించినట్లు తెలుస్తోంది. పోర్టు భూముల విలువను తేల్చేందుకు గానూ తన సొంత నియోజకవర్గం 'వడోదర' నుంచే భూ విలువ బృందాల (కంపెనీ)ని పంపుతున్నట్లు వెల్లడైంది. ఈ మేరకు పోర్టు డిప్యూటీ ఛైర్మన్ పిఎల్.హరనాథ్ కూడా పోర్టు భూముల లీజు వ్యవహారాన్ని తాజాగా వెల్లడించారు.

'లీజు'పేర లూటీకి పన్నాగం..

విశాఖ సిటీ, పరిసర గ్రామాల్లో గల పోర్టు భూములన్నింటినీ డెవలప్ మెంట్‌కు ఇచ్చేసేం దుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎప్పటినుంచో పోర్టుపై ఒత్తిడి తెస్తున్నాయి. ఇటీవలే ఢిల్లీ వెళ్లొచ్చిన పోర్టు ట్రస్టు ఛైర్మన్ ఎంటి.కృష్ణబాబు పోర్టు ఉన్నతాధి.కారుల సమావేశంలో పోర్టు భవిష్యత్‌పైనా, ఆస్తుల లీజు వ్యవహా రంపైనా చర్చించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ విధానాన్ని ఈ సంద ర్భంగా ప్రకటించారు. రియల్ ఎస్టేట్‌కు ఇవ్వడం ద్వారా వచ్చే డబ్బుతో నష్టాలను భర్తీచేసుకోవచ్చన్నది ప్రభుత్వాలు చెబుతు న్నట్లు తెలుస్తోంది. దీనికి పబ్లిక్ ప్రయివేటు పార్టనర్‌షిప్ (పిపిపి) మోడల్ అన్నది తాజాగా ప్రచారం చేస్తున్నారు. లీజు కివ్వడ మంటే 33ఏళ్ల పాటు పోర్టు అన్ని హక్కు లనూ వదులు కోవడమే. రియల్ ఎస్టేట్‌కు ఇలా భూమి నిచ్చేసేందుకు కంపెనీలను త్వరలో ఆహ్వానించ నున్నారు.

రూ.వందల కోట్ల విలువైన భూమి ధారాదత్తం

నగరంలోని ఎపిఐఐసి హార్బర్ పార్కులో గజం భూమి ధర రూ.కోట్లపైమాటే. భారత పరిశ్రమల సమాఖ్య (సిఐఐ) సదస్సులు రెండు దఫాలు ఇక్కడే ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహించారు. సిఐఐ సదస్సుల ద్వారా విశాఖకు సంబంధించి విపరీత ప్రచారాన్ని దేశ, విదేశ కంపెనీలకు ఇచ్చారు. దీని ఫలితంగా ఈ భూములు పోర్టు ట్రస్ట్‌వి అయినందున ఇవి కూడా రియల్‌ఎస్టేట్ కోరల్లోకి వెళ్లబోతున్నాయి.

పోర్టు టాప్ ఆఫీసర్ల క్వార్టర్స్ కైలాసపురంలో ఉన్నాయి. వీటిని కూడా ఇచ్చేయబోతున్నారు. శాలి గ్రాంపురం, రాజీవ్ గాంధీ స్టేడియం (సీతమ్మ ధార)లో గల భూములు రియల్ ఎస్టేట్‌కు బేరం పెడుతూ టెండర్లను పిలిచే పనిలో ఉన్నట్లు తెలుస్తోంది. హార్బర్ పార్కు, కైలాసపురం కలిపి 65 ఎకరాల వరకూ పోర్టు భూమి వెళ్లిపోబోతుంది. నగర పరిధి మొత్తం కలిపితే (లంకెలపాలెం అనకాపల్లివద్ద, భీమునిపట్నం వద్ద మూలకుద్దు గ్రామం) పోర్టుకు సుమారు 7600 ఎకరాల వరకూ భూములున్నాయి. రూ.వేలకోట్లు వీటి ధర ఉంటుంది. 7600 ఎకరాల్లో 50శాతం తొలి దఫా లీజు పేర ధారాదత్తం చేయబోతున్నారు.


రామతీర్థసాగర్ బ్యారేజీ

పేరుకే ప్రాధాన్యత... ఏటేటా నిధుల కొరత

- 12 ఏళ్లు గడుస్తున్నా పూర్తి కాని 'రామతీర్థసాగర్'
- రైతుల్లో నిరాశ
- నిర్వాసితుల్లో నిర్వేదం

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

రాష్ట్రంలోనే అత్యంత ప్రాధాన్యతగల ప్రాజెక్టుగా చెబుతున్న విజయనగరం జిల్లాలోని రామతీర్థసాగర్ సాగునీటి ప్రాజెక్టును నిధుల కొరత పీడిస్తోంది. ప్రభుత్వ ప్రకటనలకూ, ఆచరణకూ పొంతన ఉండటం లేదు. తగిన నిధులు కేటాయించకపోవడం, కేటాయించిన నిధులను సక్రమంగా ఖర్చు చేయకపోవడంతో 12 ఏళ్లు దాటుతున్నా ఈ ప్రాజెక్టు అసంపూర్తిగానే ఉంది.

అరకొర నిధులతో అసంపూర్తి పనులు

జిల్లాలోని గుర్ల మండలం కోట గండ్రేడు వద్ద చంపావతి నదిపై ఈ ప్రాజెక్టు నిర్మాణం తలపెట్టారు. బ్యారేజీ నీటిని మళ్లించి కుమిలి పెద్ద చెరువును జలాశయంగా తీర్చిదిద్దాలని నిర్ణయించుకున్నారు. 8,172 ఎకరాల ఆయకట్టును స్థిరీకరించే, కుడి, ఎడమ కాలువల ద్వారా మొత్తం 24,710 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే లక్ష్యంతో 2005లో అప్పటి ప్రభుత్వం ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టింది. రూ.220.04 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టుకు ఇప్పటి వరకూ రూ.134.5 కోట్లు, భూసేకరణ నిమిత్తం 48.680 కోట్లు చొప్పున మొత్తం 198.92 కోట్లు ఖర్చు చేశారు. అరకొర నిధుల వల్ల ఇప్పటి వరకూ బ్యారేజీ నిర్మాణ పనులు 80 శాతం మాత్రమే పూర్తయ్యాయి. బ్యారేజీకి అవసరమైన 13 షట్టర్లకుగానూ ఇప్పటివరకూ 12 షట్టర్లను అమర్చారు. హైడ్రో మెకానికల్ పనులు, ఎగువ, దిగువ రక్షిత పనులు, ఇరువైపులా అప్లక్స్ మట్టికట్టల పనులు నేటికీ ప్రారంభం కాలేదు. మళ్లింపు కాలువ పనులు, రిజర్వాయర్ నిర్మాణ పనులు 41 శాతం చొప్పున చేపట్టారు.

ఎఐబిపి నిధులపైనే రాష్ట్రం ఆశ

ఇది ప్రాధాన్యతా ప్రాజెక్టు అంటూ ప్రభుత్వం చెప్తోంది. ఇదే పేరుతో ఈ నెల ఒకటిన జిల్లా కలెక్టర్ వివేక్‌యాదవ్... ప్రాజెక్టు, రెవెన్యూ అధికారులను వెంటబెట్టుకుని పనులను పరిశీలించారు. అధికారులతో అక్కడే సమీక్షించారు. ఏటేటా కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన ఎఐబిపి (యాక్సలరేటెడ్ ఇరిగేషన్ బెన్ఫిట్ స్కీం) నిధులను ఆశగా చూపి, రాష్ట్రం తన వాటాను తగ్గించుకుంటోంది. ఇప్పటి వరకూ ప్రాజెక్టు పరిధిలో జరిగిన పనులకు కేంద్రం నుంచి రూ.66 కోట్ల ఎఐబిపి నిధులు విడుదల కావాల్సి ఉండగా, రూ.33 కోట్ల మాత్రమే వచ్చాయి. కేంద్ర ప్రభుత్వం ఏళ్ల తరబడి తన వాటా చెల్లించేందుకు మీనమేషాలు లెక్కిస్తోంది. 2017-18లో రూ.309 కోట్లు అవసరమని రాష్ట్ర ప్రభుత్వానికి అధికారులు ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం రూ.ఎనిమిది కోట్లు మాత్రమే కేటాయించింది. ఎఐబిపి కింద రూ.152 కోట్ల కేంద్ర ప్రభుత్వం కేటాయించనుందని రాష్ట్ర ప్రభుత్వం తన బడ్జెట్లో పేర్కొనడం గమనార్హం. రాష్ట్ర ప్రభుత్వం 2014-15లో రూ.37.99 కోట్లు, 2015-16లో 44.80 కోట్లు, 2016-17లో రూ.ఎనిమిది కోట్లు కేటాయించింది. నిధుల కేటాయింపు మేరకు ఖర్చు జరగలేదు. నిధుల కేటాయింపు పెంచాలని, కేటాయించిన నిధులను పూర్తి స్థాయిలో ఖర్చు చేయాలని, పనులు వేగవంతం చేయాలని ఆయకట్టుదారులు కోరుతున్నారు.

పూర్తి కాని నష్టపరిహారం పంపిణీ, భూసేకరణ, పునరావాసం

నష్టపరిహారం పంపిణీ, భూసేకరణ, పునరావాస కల్పన పూర్తి కాలేదు. ఈ ప్రాజెక్టు కోసం 3,600 ఎకరాలు సేకరించాల్సి ఉంది. ఇప్పటి వరకూ 3,334.40 ఎకరాలు సేకరించారు. ఇంకా 265.60 ఎకరాలు సేకరించాల్సి ఉంది. భూములు, ఇళ్లు త్యాగం చేసిన వారికి నేటికీ పునరావాసం కల్పించలేదు. కోరాడపేట, ఎ.టి.అగ్రహారం, పడాలపేట, సారిపల్లి గ్రామస్తులు భూములను కోల్పోయారు. వీరికి నష్టపరిహారం కొంతమేరకే అందింది. పునరావాసం కల్పించలేదు. 515 ఇళ్లు మంజూరు చేసినా నిర్మాణాలు చేపట్టలేదు.

నేడు అరకులో ఆదివాసీ దినోత్సవం

- గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరు
- థింసాకు కూచిపూడి స్థాయి వచ్చేనా?
- ఏడాదైనా నెరవేరని సిఎం హామీలు

ప్రజాశక్తి - అరకులోయ (విశాఖ)/ అమరవతి బ్యూరో

ప్రపంచ ఆదివాసీ దినోత్సవం రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యాన బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు దత్తత పంచాయతీ పెదలబుడు పరిధిలోని అరకులోయలో జరగనుంది. దీనికి చంద్రబాబుతో పాటు రాష్ట్ర గవర్నర్ నరసింహన్ హాజరు కానున్నారు. వీరి పర్యటనకు సంబంధించి ఇప్పటికే అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. గిరిజన సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆర్‌పి.సిసోడియా, స్పెషల్ కమిషనర్ డాక్టర్ పద్మ, జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, జెసి డాక్టర్ జి.సృజన, ఐటిడిఎ పిఒ రవిసుభాష్ పఠాన్‌శెట్టి, జిల్లా ఎస్‌పి రాహుల్ దేవ్‌శర్మ, స్థానిక ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు బుధవారం ఏర్పాట్లను పర్యవేక్షించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఎగ్జిబిషన్, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, సిఎం దత్తత పంచాయతీ పెదలబుడు వాసులతో ముఖాముఖి వంటి అన్ని కార్యక్రమాలను అరకులోయలోని ఎన్‌టిఆర్ మైదానంలోనే ఏర్పాటు చేస్తున్నారు.

అభివృద్ధి అంతంత మాత్రమే...

ముఖ్యమంత్రి పెదలబుడు పంచాయతీలోని 22 గ్రామాల్లో అభివృద్ధి పనులు అంతంతమాత్రంగానే జరిగాయి. గతేడాది ప్రపంచ ఆదివాసీ దినోత్సవానికి విచ్చేసిన ముఖ్యమంత్రి అనేక హామీలు గుప్పించారు. ఏడాది అవుతున్నా అభివృద్ధి పనులు నత్తనడకనే సాగుతున్నాయి. పెదలబుడు పంచాయతీ కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రం, లైబ్రరీ, ఎఎన్ఎం సబ్ సెంటర్ మినహా అన్ని పనులు అరకొరగానే జరిగాయి. గ్రామాల్లో సిసి రోడ్లు మాత్రం 80 శాతం వరకు పూర్తయ్యాయి. కొన్ని గ్రామాల్లో ఇంటింటికి కుళాయి కనెక్షన్లు ఇచ్చినా నీటి సరఫరా మాత్రం సక్రమంగా లేదు. దీంతో మళ్లీ గిరిజనులు ఊట గెడ్డల నీటినే తాగాల్సిన దుస్థితి. పక్కా ఇళ్లులు లేని వారికి 413 ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు సిఎం పెదలబుడు పర్యటనలో ప్రకటించారు. కాని బిల్లులు మంజూరు చేయలేదు. దీంతో ఉన్న ఇళ్లను తొలగించి కొత్త ఇళ్ల ప్రారంభించిన గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అందరికీ బిల్లులు వెంటనే ఇవ్వాలని గతేడాది పర్యటనలో ముఖ్యమంత్రి చెప్పినా ఆచరణ రూపం దాల్చలేదు. డ్రెయినేజీల నిర్మాణం నేటికీ చేయలేదు. మరుగు దొడ్ల నిర్మాణం జరిగిన వాటికి కూడా బిల్లులు చెల్లించలేదు. దీనికి తోడు నీటి సమస్య కారణంగా ఆ మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉన్నాయి. అరకును ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చి ఇంజినీరింగ్, నర్సింగ్, డైట్, బిఇడి కళాశాలలను ఏర్పాటు చేస్తామని చెప్పిన చంద్రబాబు ఈ ఏడాదిలో ఆ దిశగా ఒక్క అడుగు కూడా పడలేదు. ఈ పంచాయతీలోని 22 గ్రామాల ప్రజలతో నేరుగా అమరావతి నుంచి మాట్లాడడానికి ఫైబంగ్రిడ్ పెడతామని ఇచ్చిన హామీ గాలిలో కలిసిపోయింది. వైఫై సౌకర్యం కల్పించినా మూడు నెలల క్రితమే అది మూలకు చేరింది. ఇప్పుడు ముఖ్యమంత్రి వస్తున్నారని మంగళవారం హడావిడిగా మరమ్మతులు చేపట్టారు. ఆదివాసీల ప్రఖ్యాత నృత్యం అయిన థింసా అభివృద్ధికి అధికారికంగా ప్రభుత్వం ఇంత వరకు ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. థింసాను కూచిపూడి నృత్యం స్థాయిలో విశ్వవ్యాప్తంగా అభివృద్ధి చేస్తామని గతేడాది ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన విషయం తెలిసిందే. సిఎం ఈ ప్రకటన చేసి నేటితో సరిగ్గా ఏడాది కావస్తున్నా ఇందుకు సంబంధించి ప్రతిపాదనలు కూడా రూపొందించకపోవడం గమనార్హం. దీంతో సిఎం హామీ కేవలం ప్రకటనలకే పరిమితమన్న విమర్శలొస్తున్నాయి.


ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి ఏర్పాట్లను పరిశీలిస్తున్న గిరిజన సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సిసోడియా

దళిత, గిరిజనులకు అన్యాయం జరిగితే సహించం

ఎస్‌సి,ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ కారెం శివాజీ

ప్రజాశక్తి - ఒంగోలు క్రైం

దళిత, గిరిజనులకు అన్యాయం జరిగితే సహించబోమనీ, బాధితులు వెంటనే ఫిర్యాదు చేస్తే వారి కుటుంబాలకు న్యాయం చేస్తామని ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ కారెం శివాజీ పేర్కొన్నారు. నగరంలో ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన స్థానిక ఎన్‌ఎస్‌పి అతిథి గృహంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ.. దళిత, గిరిజనులపై ఎవరైనా భౌతిక దాడులకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన నివేదికల మేరకు దేవరపల్లిలోని చెరువును 'నీరు-చెట్టు' పథకం కింద తవ్వారన్నారు. ఈ విషయంలో అధికార పార్టీ నాయకులు దళితుల పట్ల అన్యాయంగానే వ్యవహరించారని విమర్శించారు. పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించడం వల్లే సమస్య పెద్దదయ్యిందన్నారు.

రోడ్డు ప్రమాదాలపై దృష్టి సారించాం

గుంటూరు రేంజ్ డిఐజి గోపాలరావు

ప్రజాశక్తి - ఒంగోలు క్రైం

రోడ్డు ప్రమాదాల్లో అనేక మంది మృత్యువాత పడుతున్నారని వాటిని నివారించేందుకు ప్రత్యేకమైన చర్యలు తీసుకుంటున్నామని గుంటూరు రేంజ్ డిఐజి కె.వి.గోపాలరావు పేర్కొన్నారు. స్థానిక ఎస్‌పి కార్యాలయంలో మంగళవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలపై ప్రజలలో అవగాహన కలిగించేందుకు బస్సులపై, ఆటోలపై పోస్టర్లు అంటించే కార్యక్రమం ప్రారంభించామన్నారు. ఇప్పటికే జాతీయ రహదారిపై బ్లాక్ స్పాట్స్ గుర్తించి ఆ ప్రాంతాలలో ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకునే విధంగా ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో అవగాహన నిమిత్తం బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. ఇళ్లలో చోరీలను అరికట్టేందుకు కొత్త యాప్‌ను (లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్) ను ప్రవేశ పెట్టామన్నారు.

నగర పారిశుధ్యంపై కమిషనర్ ఆగ్రహం

ప్రజాశక్తి-తిరుపతి టౌన్

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా కమిషనర్ మంగళవారం నగరంలోని పలు వార్డుల్లో సందర్శించారు. ముఖ్యంగా కరకంబాడి, లీలామహల్ సర్కిల్, ఎంఆర్‌పల్లి స్టేషన్ నుంచి అన్నమయ్య సర్కిల్ వరకు రహదారులను పరిశీలించారు. అక్కడి పారిశుధ్యం సక్రమంగా లేకపోవడంతో సంబంధిత అధికారులను కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలో పారిశుధ్యానికి పెద్దపీట వేయాలని ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ముగిసేవరకు నగరం పరిశుభ్రంగా ఉండాలని, రోడ్లపై చెత్త వేసే వాళ్లకు జరిమానా విధించాలని సూచించారు.

పాత కరెన్సీ మార్పిడి ముఠా అరెస్టు

రూ.1.16 కోట్లు స్వాధీనం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం క్రైం

పాత కరెన్సీ నోట్లను మారుస్తున్న 10 మంది సభ్యుల ముఠాను తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం అర్బన్ పోలీసులు సోమవారం రాత్రి అరెస్టు చేశారు. వారి నుంచి రూ.1,16,35,000 విలువ చేసే పాత రూ.500, రూ.1000 నోట్లను, రూ.55 వేల కొత్త నోట్లను స్వాధీనం చేసుకున్నారు. రాజమహేంద్రవరం పోలీస్‌గెస్ట్ హౌస్‌లో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో అర్బన్ ఎస్‌పి బి.రాజకుమారి ఈ వివరాలను వెల్లడించారు. కడప జిల్లాకు చెందిన గుడ్డ తారక ప్రసన్నకుమార్, మేడిశెట్టి శివరామ్, రాయుడు నాగకుమార్, సోమి జగదీష్, కడలి వీరవెంకట శ్రీరామచంద్రమూర్తి, ముసునూరి తేజోలక్ష్మీనారాయణ ప్రసాదు, వాండ్రాసి వీరవెంకట సత్యనారాయణ, వేమగిరి చిరంజీవి, గొలకోటి నాగేశ్వరరావు అలియాస్ కోటిబాబు, తోరం శ్రీనివాస్ రియల్ ఎస్టేట్ వ్యాపారులు. పాతనోట్లను రాజమహేంద్రవరంలో మార్చుకునేందుకు వచ్చారు. ముందస్తు సమాచారంతో తూర్పు మండల డిఎస్‌పి కె.రమేష్‌బాబు ఆధ్వర్యాన బొమ్మూరు పోలీసులు వీరిని హౌసింగ్ బోర్డు కాలనీ వద్ద అరెస్టు చేశారు. నగదుతోపాటు ఒఎల్ఎక్స్ వింటోకారు, 10 మొబైళ్లు, ఐదు బైకులను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న నగదు వీరి సొంతదిగా విచారణలో తేలిందని, వీరి వివరాలను ఆదాయపుపన్ను శాఖ అధికారులకు ఇస్తామని రాజకుమారి తెలిపారు.


పాత నోట్ల మార్పిడి కేసులో నిందితులను చూపుతున్న రాజమహేంద్రవరం అర్బన్ జిల్లా ఎస్‌పి రాజకుమారి

అభివృద్ధి పనులు చేస్తున్నందుకు సిఎంను కాల్చాలా..?

జగన్‌ను ప్రశ్నించిన మంత్రి అమరనాథ్ రెడ్డి

ప్రజాశక్తి-నంద్యాల

అభివృద్ధి, సంక్షేమ పథకాలను సమర్ధవంతంగా అమలు చేస్తున్నందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కాల్చి పారేయాలా అంటూ రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి అమరనాథ్ రెడ్డి వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డిని ప్రశ్నించారు. మంగళవారం నంద్యాల పట్టణంలోని 24వ వార్డులో జరిగిన టిడిపి ఇంటింటి ప్రచారంలో మంత్రులు అమర్‌నాథ్ రెడ్డి, భూమా అఖిలప్రియ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ రెడ్డి మాట్లాడుతూ నంద్యాలను అభివృద్ధి చేయాలన్న తన తండ్రి ఆశయాన్ని నెరవేర్చడానికి ఒక్క అవకాశం ఇవ్వాలని భూమా కుటుంబ సభ్యులు ప్రజలు ముందుకు వస్తున్నారని తెలిపారు. కానీ వైసిపి నాయకులు భూమా కుటుంబ సభ్యులపై అనైతిక వ్యాఖ్యలు చేస్తున్నారని పేర్కొన్నారు. పదవీ కాంక్ష తప్ప అభివృద్ధి చేయాలనే ఉద్దేశ్యం లేని శిల్పా సోదరులకు ఓటుతోనే బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. అనంతరం మంత్రి భూమా అఖిల ప్రియ మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి రాజకీయంగా ఎదగడానికి తన తల్లిదండ్రులు ఎంతో శ్రమించారని అన్నారు. కాని ఈ రోజు వారు మాట్లాడుతున్న మాటలు వింటే ఆవేదన కలుగుతుందని చెప్పారు. టిడిపి అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డికి ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. అనంతరం వార్డుకు చెందిన పలువురు యువకులు టిడిపిలో మంత్రుల సమక్షంలో చేరారు. అలాగే 30వ వార్డులో నంది పరిశ్రమల ఎండి సజ్జల శ్రీధర్ రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించారు.

చేతులకు సంకెళ్లతో నిరసన

మళ్లీ ముద్రగడ పాదయాత్రను అడ్డుకున్న పోలీసులు

ప్రజాశక్తి-కిర్లంపూడి, జగ్గంపేట (తూర్పుగోదావరి)

కాపులకు రిజర్వేషన్లు కల్పించాలంటూ పాదయాత్రకు బయలుదేరిన మాజీమంత్రి ముద్రగడ పద్మనాభాన్ని పోలీసులు 15వ రోజైన మంగళవారం అడ్డుకున్నారు. తన నివాసం నుంచి కాపు జెఎసి నాయకులు ముద్రగడతో కలిసి నల్లరిబ్బన్లతో చేతులకు సంకెళ్లు వేసుకుని పాదయాత్రగా బయల్దేరారు. ప్రధానగేటు వద్ద ముద్రగడ పద్మనాభాన్ని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ముద్రగడ పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ప్రభుత్వానికి మాపై కక్ష సాధింపు ఎందుకు.సంకెళ్లు వేసి, కళ్లకు గంతలు కట్టి తీసుకుపోండి. మీరు కొట్టినా, తిట్టినా నేనేమీ అనుకోను. నా కోసం ఎవరూ రారు. నన్ను జైల్లోకి తీసుకుపోయే దారైనా చూపించండి. నేను పాదయాత్ర అనుమతికోసం ఉత్తరం పెట్టాను. అనుమతి లేదని 2009 గైడ్‌లెన్స్ చూపించి అడ్డుకుంటున్నారు. గతంలో చేపట్టిన పాదయాత్రలకు పెట్టిన అనుమతులను మాకు చూపించండని అడిగే హక్కు మాకు లేదా?.' అంటూ పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. అనంతరం ముద్రగడ తన అనుచరులతో కలిసి ఇంట్లోకి వెళ్లిపోయారు.


సంకెళ్లతో నిరసన తెలుపుతున్న ముద్రగడ మద్దతుదారులు

సర్పంచ్ హత్య

మావోయిస్టుల ఘాతుకం

ప్రజాశక్తి-చింతూరు (తూర్పుగోదావరి)

పోలీస్ ఇన్ఫార్మర్ నెపంతో ఒడిశా రాష్ట్రంలోని మల్కన్‌గిరి జిల్లా పొడియా పోలీస్ స్టేషన్ పరిధిలోని హతిబారి గ్రామ సర్పంచ్ జోగాఖోర (50)ను మావోయిస్టులు సోమవారం అర్ధరాత్రి హత్యచేశారు. సర్పంచ్ నిద్రిస్తున్న సమయంలో 60 మంది వరకూ మావోయిస్టులు ఆయన ఇంటికి వచ్చారు. మాట్లాడే పని ఉందంటూ గ్రామ శివారుకు తీసుకెళ్లి, ప్రజా కోర్టు నిర్వహించారు. ఆయన చేసిన తప్పులను గ్రామస్తులకు తెలిపి వారి ఎదుటే సర్పంచ్ గొంతును కోసి హతమార్చారు. సర్పంచ్ తప్పుల చిట్టాను మృతదేహం వద్దే వదిలి పెట్టారు. సర్పంచ్‌కు చెందిన ట్రాక్టర్, కమాండర్ జీపు, మోటారు సైకిల్‌కు పెట్రోలు పోసి నిప్పంటించారు. ఈ ఘటనతో పోలీసులు అప్రమత్తమై, వాహనాలను తనిఖీ చేశారు.


సర్పంచ్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

కాపులకే కాకినాడ మేయర్ పదవి

హోంమంత్రి చినరాజప్ప

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

కాకినాడ మేయర్ పదవి కాపులకే కట్టబెట్టనున్నట్లు హోంశాఖమంత్రి నిమ్మకాయల చినరాజప్ప తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ టిడిపి కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాకినాడ కార్పొరేషన్‌ను టిడిపి కైవసం చేసుకుంటుందని, బిజెపితో పొత్తు పెట్టుకుంటామని చెప్పారు. కాకినాడ సిటీ, రూరల్ ఎంఎల్‌ఎలు వనమాడి వెంకటేశ్వరరావు, పిల్లి అనంతలక్ష్మి కలిసి పార్టీ అభ్యర్థుల ఎంపిక పూర్తి చేశారని చెప్పారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు అభ్యర్థులను ప్రకటిస్తామని వివరించారు. టిడిపి అభ్యర్థులంతా ఈ నెల 10న నామినేషన్లు దాఖలు చేస్తారని తెలిపారు. కాపు సామాజిక వర్గానికి చెందిన మేయర్ అభ్యర్థిని ముందుగానే నిర్ణయిస్తామని చెప్పారు. ముద్రగడ ఉద్యమం వల్లే కాపులకు మేయర్ పదవి కేటాయిస్తున్నారా? అన్న ప్రశ్నకు ఆయన బదులిస్తూ... కాపులకు రిజర్వేషన్ల కోసం టిడిపియే మ్యానిఫెస్టోలో ఇచ్చేందుకు ప్రయత్నిస్తోందన్నారు. 30 ఏళ్లు రాజకీయాల్లో ఉండి కాపులకు ఏమీ చేయలేని ముద్రగడకు భయపడి ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. వైసిపి నాయకుడు బొత్స సత్యనారాయణ ముద్రగడను కలిసి మద్దతు ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ముఖ్యమంత్రిని కాల్చేయాలని జగన్ అంటే బొత్స మద్దతు ఇవ్వడం సిగ్గుచేటన్నారు.

ప్రత్యామ్నాయ పంటల సాగుకు విత్తనాలు సిద్ధం చేయండి

సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కాలవ

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో ప్రత్యామ్నాయ పంటల సాగుకు విత్తనాలు సిద్ధం చేయాలని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గ్రామీణ గృహ నిర్మాణ శాఖల మంత్రి కాలవ శ్రీనివాసులు వ్యవసాయ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో వ్యవసాయ అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో 20 లక్షల ఎకరాల్లో వ్యవసాయ భూమిలో 6.35 లక్షల ఎకరాల్లో మాత్రమే పంటలు సాగు చేశారన్నారు. మిగిలిన 13.69 లక్షల ఎకరాల్లో ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేందుకు విత్తనాలను సిద్ధం చేయాలని ఆయన ఆదేశించారు. గతేడాది రాయదుర్గం నియోజకవర్గంలో ప్రత్యామ్నాయ పంటల సాగులో ఉలవ, మొక్కజొన్న, జొన్న పంటలను సాగు చేసేలా ప్రోత్సాహించామన్నారు. దీనివల్ల మంచి ఫలితాలు లభించాయన్నారు. మంత్రి ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ జెడి పి.వి.శ్రీరామ్మూర్తి ఖరీఫ్ కంటింజెన్సీ ప్రణాళికను రూపొందించి మంత్రికి అందించారు. ఈ కార్యక్రమంలో జెసి-2 సయ్యద్ ఖాజామొహినుద్దీన్, ఆయా శాఖ అధికారులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు తీసుకోవడం నేరం

గ్రేస్ ఫేస్ ఇండియా ఆర్గనైజేషన్ ప్రతినిధి ఎన్.నితిన్ కుమార్

ప్రజాశక్తి-వత్సవాయి

మత్తు పదార్థాలు తీసుకోవటం నేరమనీ, అలాంటి ఉచ్చులో పొరపాటున పడితే జీవితం నాశనమవుతుందనీ గ్రేస్ ఫేస్ ఇండియా ఆర్గనైజేషన్ (చెన్నై) ప్రతినిధి ఎన్.నితిన్ కుమార్ కోరారు. 'మాదక ద్రవ్యాల వినియోగం-అవగాహన' అనే అంశంపై కృష్ణాజిల్లా వత్సవాయి మండలం భీమవరంలోని గాంధీజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్, టెక్నాలజీ కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. విద్యార్థులు చదువుకునే వయస్సులో దురలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. చెడు అలవాట్లకూ, ఆకర్షణలకూ లోను కాకుండా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, అధ్యాపకులపై ఉందన్నారు. ప్రతి విద్యార్థీ ఉన్నత శిఖరాలకు ఎదగాలనే లక్ష్యం కోసం నిరంతరం శ్రమించాలని కోరారు. మరో ప్రతినిధి శివకుమార్ మాట్లాడుతూ కళాశాలలో సిలబస్‌తోపాటు నైతిక విలువలపై కూడా క్లాసులు నిర్వహించాలని సూచించారు. సమాజ విలువలు పతనం కాకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై బాధ్యత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ డాక్టర్ గుర్రం సుబ్బారావు, కరస్పాండెంట్, సెక్రటరీ కె.సత్యన్నారాయణరావు, ఉపాధ్యక్షులు ఎస్‌విపి సత్యన్నారాయణ, ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ ఎహెచ్ షరీఫ్, ప్లేస్‌మెంట్ అధికారి మోహన్‌బాబు, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సంపాదకీయం


సిగ్గుచేటు!

అధికార బలం, కండకావరంతో ఓ యువతిని కారులో వెంటాడి వేధించిన హర్యానా బిజెపి నేత పుత్ర రత్నం చేష్టలు దేశాన్ని మరోసారి సిగ్గుతో తలవంచుకునేలా చేశాయి. 2012 డిసెంబరు 16 నిర్భయ కేసు తరువాత క్రిమినల్ చట్టాలను కఠినతరం చేసినప్పటికీ మహిళలపై అత్యాచారాలు పెరిగిపోతుండడం ఆందోళన కలిగిస్తోంది. హర్యానా బిజెపి అధ్యక్షుడి కుమారుడు వికాస్ బరాల్, అతని స్నేహితుడితో కలిసి అచ్చోసిన ఆంబోతులా రోడ్డుపై పడి ఒంటరిగా కనిపించిన అమ్మాయిని కారులో వెంటాడి వేధించిన తీరు నాగరిక సమాజానికే సిగ్గు చేటు! ఓ సీనియర్ ఐఎస్ అధికారి కుమార్తెను వికాస్ వెంటాడిన తీరును సిసి కెమెరాల వీడియో ఫుటేజీలలో తిలకించిన ఓ పోలీస్ అధికారి ఇది హాలీవుడ్ హారర్ సినిమాను మరపించేలా వుందని తన ఆంతరంగికుల వద్ద చేసిన వ్యాఖ్యలు నేరతీవ్రతకు దర్పణం పడుతున్నాయి. ఈ అపర కీచకుడిపై పోలీసులు నమోదు చేసిన అభియోగాలు నవ్వు తెప్పించేవిగా వున్నాయి. కిడ్నాపు చేసేందుకు యత్నించిన నేరానికిగాను నిందితులపై భారతీయ శిక్షా స్మృతి (ఐపిసి)లోని సెక్షన్ 365, 511 వంటి కఠిన నిబంధనల కింద కేసు నమోదు చేయడానికి బదులు, తేలికగా బెయిలు లభించే 354 డి సెక్షన్‌ను ప్రయోగించారు. నిందితుడు తండ్రికి వున్న రాజకీయ పలుకుబడి, రాష్ట్రంలోను, కేంద్రంలోను బిజెపి ప్రభుత్వాలే అధికారంలో వుండడంతో కేసును తిమ్మిని బమ్మిని చేయడం వారికి పెద్ద కష్టమేమీ కాదు. బాధితురాలు ఐఎఎస్ అధికారి కుమార్తె కావడం, ఆమె కూడా ధైర్యంగా సోషల్ మీడియా ముందుకు రావడం వల్ల ఈ కేసు వెలుగుచూసింది. లేకుంటే చడీ చప్పుడు లేకుండా పోలీసులు దీనిని చాప కిందకు నెట్టేసేవారు.

అణగారిన వర్గ మహిళలపై జరిగే అకృత్యాల్లో చాలావరకు పోలీస్ ఠాణా దాకా రావు. వచ్చినా, వాటిపై దర్యాప్తు ముందుకుసాగదు. దర్యాప్తు జరిగినా శిక్షలు పడిన దాఖలాలు చాలా అరుదు. మన రాష్ట్రంలో అయేషా కేసు ఈ కోవకు చెందినదే. 'బేటీ బచావో', 'మహిళల హక్కులు, భద్రత' గురించి బిజెపి వల్లించే చిలుక పలుకులు వట్టి బూటకమని హర్యానా ఘటన మరోసారి రుజువు చేసింది. ఘటనపై ప్రజలకు సంజాయిషీ ఇచ్చుకోవాల్సిన బిజెపి నేతలు, అర్ధ రాత్రి వేళ ఆ యువతి ఒంటరిగా కారులో వెళ్లడమేంటని ప్రశ్నిస్తున్నారు. స్వాతంత్య్రం వచ్చి డెబ్బయ్యేళ్లు కావస్తున్నా ఈ దేశంలో స్త్రీ స్వేచ్ఛగా సంచరించే పరిస్థితి లేదు. దీనికి సిగ్గు పడాల్సింది పోయి మహిళల స్వేచ్ఛకు హద్దులు పెట్టడం ఈ మనువాదులకే చెల్లింది. మహిళలను ద్వితీయశ్రేణి పౌరులుగా చూడాలన్నది వీరి అభిమతం. పురుషాధిపత్య భావజాలాన్ని, ఫ్యూడల్ సంస్కృతిని పూర్తిగా పుణికిపుచ్చుకున్న మనువాదుల పాలనలో మహిళల భద్రత గాలిలో పెట్టిన దీపం చందంగా మారింది. మహిళల హక్కులన్నా, సాధికారత అన్నా వీరికి అస్సలు గిట్టదు. చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లు రాజ్యసభ ఆమోదం పొందినా, లోక్‌సభలో ప్రవేశపెట్టడానికి బిజెపి సుతరామూ ఇష్టపడడం లేదు. ఏకాభిప్రాయం పేరుతో నాటకాలాడుతోంది.

స్త్రీ స్వాతంత్య్రానికి అనర్హురాలని వాదించిన ఓ 'యోగి'ని తీసుకొచ్చి దేశంలో అతి పెద్ద రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా నియమించిన ఏలికల నుంచి ఇంతకుమించి ఏమి ఆశించగలం? మహిళలు ఏ దుస్తులు ధరించాలో, ఏవి ధరించకూడదో, ఎక్కడ తిరగాలో, ఎక్కడ తిరగకూడదో అంతా ఈ కాషాయ తాలిబాన్లే శాసిస్తారు. కేంద్రంలోను, పలు రాష్ట్రాల్లోను అధికారంలో వున్న బిజెపి అండతో ఈ మనువాదులు మరింత పేట్రేగిపోతున్నారు. పోలీసులన్నా, కేసులన్నా వీరికి భయం లేదు. జైలుకెళ్లినా వెంటనే బెయిలు వస్తుంది. కేసులున్నా శిక్షలు పడవు. ఇదే వీరి ధైర్యం. నైతికత గురించి, సుపరిపాలన గురించి పెద్ద పెద్ద మాటలు చెప్పే బిజెపి నేతలు ఈ కేసులో నిందితులను కాపాడేందుకు నగ్నంగా ప్రయత్నించడం వారి దివాళాకోరుతనానికి నిదర్శనం. తాజా కేసులో సాక్ష్యాలను మాఫీ చేసేందుకు సిసి కెమెరా ఫుటేజీలను మాయం చేయాలని చూశారు. దీనిపై పెద్దయెత్తున విమర్శలు రావడంతో అబ్బే అలాంటిదేమీ లేదని చెప్పారు. దర్యాప్తును అడుగడుగునా అడ్డుకుంటున్న బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు సుభాష్ బరాలాను ఆ పదవి నుంచి తొలగించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తే బిజెపి అగ్ర నాయకత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నది. కేసులో సాక్ష్యాధారాలను తారుమారు చేసి, దర్యాప్తును సమాధి చేసే యత్నాలను ఒక వైపు నిర్విఘ్నంగా సాగిస్తూ, మరో వైపు చట్టం తన పని తాను చేసుకుపోతుందని చెప్పడం బిజెపి వంచనకు పరాకాష్ట. నేరస్తులను బోనులో నిలబెట్టాల్సిన ప్రభుత్వమే వారికి అండగా నిలుస్తుంటే న్యాయానికి ఇక స్థానమెక్కడుంటుంది? ఈ దేశంలో ఆడపిల్లలకు భద్రత ఏముంటుంది?

మహనీయుల మాట



ప్రభుత్వం అవినీతిమయం అయినకొద్దీ, చట్టాలు ఎక్కువ అవుతుంటాయి.

-టాసిటస్

ఇండొనేషియాలో మత సామరస్యం

ఆర్ రాజేశమ్



బిజెపి-ఆర్ఎస్ఎస్ పరివారంలో మోడీకి వారసుడిగా ప్రచారమవుతున్న యూపి ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ ఈ మధ్య ఆశ్చర్యకరమైన ప్రకటన చేశారు. హిందూ మతోన్మాదాన్ని రెచ్చగొట్టే వ్యాఖ్యలకు పేరుగాంచిన యోగి మొదటి సారిగా ముస్లింలను మెచ్చుకుంటూ మాట్లాడారు. అయితే ఆయన ప్రశంసించింది ఇక్కడ ముస్లింలను కాదు, ఇండొనేషియా దేశపు ముస్లింలను.. మొన్న జులై 28న యూపి శాసన మండలిలో ప్రసంగిస్తూ 'ఇండొనేషియా ముస్లింలు చాలా గొప్పవారు. నేటికీ అక్కడ రాంలీలా ఉత్సవాలు జరుపుకుంటారు. వారిని చూసి ఇక్కడివారు నేర్చుకోవాలి' అంటూ ఆదిత్యనాథ్ పేర్కొన్నారు.

అందరూ అంగీకరించే విశ్వజనీన సత్యాలను సైతం తమ కుత్సిత మత రాజకీయాలకు అనుగుణంగా వక్రీకరించడం మతోన్మాదులందరూ చేసే పనే. అబద్ధాలు వల్లెవేసి ప్రజలను బోల్తా కొట్టించడంలో దిట్ట అయిన ఆదిత్యనాథ్ కూడా అదే పంథాను అవలంబి స్తున్నారు. ఇండొనేషియా దేశపు ముస్లింల ఉదార స్వభావం నుంచి తాను, తన లాంటి మతోన్మాదులు నేర్చుకోవాల్సిందెంతో వుండగా ఆయన నెరపుతున్న మత రాజకీయాలను వ్యతిరేకించే వారిని విమర్శించడానికి ఆ వాస్తవాన్ని వక్రీకరించి



వాడుకుంటున్నారు ఆదిత్యనాథ్.

మతపరమైన అంశాల పట్ల ఇండొనేషియా ముస్లింలు చూపే సహనాన్ని ప్రపంచమంతా మెచ్చు కుంటుంది. ప్రపంచంలోనే అత్యధిక ముస్లిం జనాభాగల దేశం ఇండొనేషియా. 20 కోట్ల మంది ముస్లింలున్న ఈ దేశంలో 87 శాతం మంది ఇస్లాం మతాన్ని అను సరిస్తారు. అయితే ఇండొనేషియా ప్రజల గొప్పతనమేమంటే.. ఈనాడు ప్రపంచంలోనే అతిపెద్ద ముస్లిం జనాభాగల దేశం మాదే నంటూ గర్వంగా చెప్పుకునే ఇండోనేసియన్లు 'అనిమిజం' మతాన్ని (ప్రకృతిలోని అన్ని వస్తువుల్లో, జీవుల్లో భగవంతుడున్నాడనే భావన) అవలంభించారు. క్రీస్తుశకం ఒకటవ శతాబ్దంలో భారతదేశం నుంచి వైదిక మతం అక్కడికి చేరింది. ముందు రాజులు, ఆ తర్వాత అక్కడి ప్రజలందరూ వైదిక మతాన్ని స్వీకరించారు. ఆ తర్వాత 12 వ శతాబ్దంలో .. మరోసారి భారత దేశం నుంచే వచ్చిన సూఫీ సాధువులు ఇస్లాం మతాన్ని పరిచయం చేశారు. దీంతో ముందు రాజులు, తర్వాత సామాన్యులు ముస్లింలుగా మారారు.

ప్రస్తుతం తాము అవలంభిస్తున్న ఇస్లాం మతాచారాలని ఎంతో నిష్ఠతో పాటించే ఇండోనేసియన్లు.. తమ హిందూ గతాన్ని కూడా అంతే గర్వంతో.. అభి మానంతో ప్రదర్శిస్తారు. ఆదిత్యనాథ్‌లు, తొగాడియాలు, బుఖారీలు, ఒవైసీలు, ప్రదర్శించే మత దురహంకార ధోరణి.. మచ్చుకైనా అక్కడి ప్రజల్లో కనిపించదు. ఇండొనేషియా ప్రజలు మాట్లాడే భాషను 'బహసా' అంటారు. సంస్కృత పదం భాష నుండి వచ్చిందే ఇది. అనుసరించేది ఇస్లాం మతమైనా.. పేర్లు మాత్రం హిందూ మతాన్ని సూచించేవిగా వుంటాయి. సుహార్తో, సుకర్ణోలు గతంలో దేశాధ్యక్షులుగా పనిచేశారు. మేఘావతి సత్యవతి సుకర్ణోపుత్రి 2001-04 మధ్య దేశాధ్యక్షురాలిగా పనిచేశారు. వీరందరూ ముస్లింలే. ఇండోనేసియా ముద్రించిన ఇరవైవేల రూపాయల కరెన్సీ నోటు మీద గణేషుడి బొమ్మ వుంటుంది. రాయాయణం అక్కడి ప్రజల ప్రముఖ జానపద కళారూపం. మనుషుల పేర్లే కాదు..! అక్కడి ద్వీపాల పేర్లు కూడా హిందూ మత సంబంధమైనవే. సుమత్రా, కాళీమంథన్, బాలి(వాలి) అనేవి వాటి పేర్లు.

వాషింగ్టన్ నగరంలోని 'ఎంబసీ రో' వీధిలో వివిధ దేశాల రాయబార కార్యాలయాలుంటాయి. అక్కడికెళ్లి చూస్తే... అరుదైన దృశ్యం కనబడుతుంది. బ్రిటిష్ రాయబార కార్యాలయం ముందు విన్‌స్టన్ చర్చిల్ ప్రతిమ కనబడుతుంది. దక్షిణాఫ్రికా దేశ ఎంబసీ ముందు మండేలా బొమ్మ, భారతదేశపు ఎంబసీ ముందు మహాత్మాగాంధీ బొమ్మ పలకరిస్తాయి. ఆ పక్కనే వున్న ఇండోనేసియా రాయబార కార్యాలయం ముందు సుకర్ణో బొమ్మనో, సుహార్తో ప్రతిమో వుంటుందని భావిస్తాం. కానీ ఇండోనేసియా ఎంబసీ ముందు సరస్వతీదేవి బొమ్మ వుంటుంది. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే విమానయాన సంస్థ పేరు కూడా గరుడనే! తమ గతకాలపు మత చిహ్నాలను గర్వంగా ప్రదర్శించడం ద్వారా ఇండొనేషియన్ ముస్లింలు నేటి కాలపు ప్రపంచానికి ఓ గొప్ప సందేశాన్ని ఇస్తున్నారు. 'మేము ఒకనాడు అనిమిస్టులం, ప్రకృతి ఆరాధకులం. ఆ తర్వాత మేమంతా హిందువులమయ్యాం. నేడు ముస్లింలుగా కొనసాగుతున్నాం. మతాలు వస్తుంటాయి. పోతుంటాయి. మానవత్వమే మనందరి అసలు గుర్తింపు'-ఇదీ ఇండోనేసియా ప్రజలు ప్రపంచానికిస్తున్న సందేశం! పరిశీలించి చూస్తే ఈ విశిష్టత మనకు అన్ని జాతుల్లోనూ కనబడుతుంది. ఈజిప్టు దేశపు ప్రజలు నేడు ఇస్లాంను అనుసరిస్తున్నా.. తమ గతకాలపు 'పాగన్' మతానికి చెందిన పిరమిడ్లను, ఫారోల అవశేషాలను తమ జాతి సంపదగా గర్వంగా ప్రదర్శిస్తారు. ఇరాక్ దేశస్తులు కూడా నేడు విభిన్న మతాలను అవలంభిస్తున్నా.. గతంలోని మొసపుటోమియన్ మత చిహ్నాలను తమ గుర్తింపులో ఒక భాగంగా స్వీకరిస్తారు.

ప్రపంచమంతటా చరిత్ర పొడుగునా కొనసాగుతున్న ఈ సమ్మిళిత జీవన విధానానికి భారత దేశం మినహాయింపేమీ కాదు. మన దేశం కూడా ఎన్నో మతాల సంస్కృతుల సంగమస్థలి. సిక్కు, ఇస్లాం, క్రైస్తవ మతాలను భారతీయులు స్వీకరించారు. ఈ మతాలన్నింటిలోని మంచిని కలబోసిన సమ్మిళిత సంస్కృతియే నేడు భారతదేశపు గుర్తింపుగా నిలిచి వుంది. ఈ సమ్మిళిత సంస్కృతినే తమ జీవన విధానంగా నేడు దేశ ప్రజలందరూ స్వీకరిస్తున్నారు. కొందరు సంకుచిత మనస్కులు.. ప్రజల మత నమ్మకాలను తమ కుత్సిత రాజకీయాల్లో పాచికలుగా వాడే కొందరు స్వార్ధ శక్తులు మాత్రమే దీనికి మినహాయింపు!

రాంలీలా ఉత్సవాలను ఘనంగా నిర్వహించే ఇండోనేసియా ముస్లింలను పొగుడుతున్న యోగి ఆదిత్యనాథ్.. వారి నుంచి తానేం నేర్చుకున్నాడో దేశ ప్రజలకు తెలియజెప్పాలి. ఇండొనేషియా ప్రజలు చాటిచెబుతున్న మత సహనత్వానికి.. భారతదేశ ప్రజలు అనాదిగా అవలంభిస్తున్న సమ్మిళిత సంస్కృతికీ.. ఆదిత్యనాథ్, ఆయన ప్రాతినిథ్యం వహించే సంఘపరివారం బద్ధ శత్రువులేనన్న వాస్తవం ఈ దేశ ప్రజలందరికీ తెలిసిందే. ఇండొనేషియా ముస్లిం సమాజంతో పాటు... వేల సంవత్సరాలుగా కొన సాగుతున్న మన దేశపు సమ్మిళిత సంస్కృతి.. అందరూ ఒప్పుకోవాల్సిన ఒక సత్యాన్ని నిరూపిస్తున్నది. 'మతములన్నియు మాసిపోవును. మానవత్వమే నిలిచి వెలుగును..!' అన్నదే ఆ సత్యం. ఆదిత్యానాథులు, మోడీలు, సంఘపరివార్- ఎంఐఎం నేతలు.. ఎంత త్వరగా ఈ వాస్తవాన్ని గుర్తిస్తే.. అంతగా ఈ దేశానికి మంచిది.

సెల్: 9440443183

ఉత్పత్తి శక్తులను దెబ్బతీస్తున్న మోడీ

డాక్టర్ కత్తి పద్మారావు



దర్పణం

ప్రధానంగా నరేంద్ర మోడీ అనుసరిస్తున్న జిఎస్‌టి విధానాలపై వ్యతిరేక స్వరాలు వినిపిస్తున్నాయి. వ్యాపారం వేరు. ప్రజా సంక్షేమం వేరు. దీర్ఘకాలికంగా భారత దేశాన్ని పునర్నిర్మించటం కూడా వేరు. భారతదేశంలో ప్రాజెక్టులను నిర్మించి భూమిని పెద్ద ఎత్తున వ్యవసాయానికి అనువుగా చేయడం ఒక పెద్ద ప్రణాళిక. వీటన్నింటినీ ఒకే గాట కట్టి పన్నులు విధించటం ద్వారా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల హక్కులన్నిటిని రద్దు చేసే ప్రయత్నంలో వున్నట్టు అర్థమవుతోంది. ప్రపంచ బ్యాంక్ సరుకుల బట్వాడా సామర్థ్యాన్ని పెంచుకున్నంతగా భారతదేశంలో అంతర్గత ఉత్పత్తి విధానాలను మనం పెంచుకోలేకపోతున్నాం. ఎక్కడెక్కడైతే సరైన ఉత్పత్తులు ఉన్నాయో వాటిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధ్వంసం చేస్తున్నాయి. ప్రపంచ ఆర్థిక శాస్త్రం అంతా కూడా భారతీయ ఆర్థిక అభివృద్ధి తిరోగమనాన్ని ఎత్తి చూపుతోంది. ముఖ్యంగా భారత దేశపు ఆయువు వ్యవసాయం మీద, పాల ఉత్పత్తుల మీద ఆధారపడి ఉంది. మోడీ వచ్చిన తర్వాత ఈ రెండేళ్ళలో క్షీర ఉత్పత్తి బాగా పడిపోయింది. మోడీకి, చంద్రబాబుకు రైతులంటే గిట్టదు. వారు వ్యాపారస్తుల మనుషులు. ప్రపంచంలో అత్యంత గిరాకీ ఉన్న ఆహార ఉత్పత్తుల్లో పాలు, పాల ఉత్పత్తులదే అగ్ర స్థానం. అయితే ఈ స్థాయిలో పాల ఉత్పత్తి జరగడం లేదు. పాల ఉత్పత్తి-వినియోగంలో ముందున్న భారత్‌లో పాడి పరిశ్రమ, రైతులు అభివృద్ధి చెందితేనే ప్రపంచ అవసరాలు తీర్చే స్థాయికి మార్కెట్ చేరుతుంది. 2015లో ప్రపంచవ్యాప్తంగా 81.80 కోట్ల టన్నుల పాలు ఉత్పత్తి అయ్యాయి. ఇందులో ఆవు పాల వాటా దాదాపు 65 కోట్ల టన్నులు. ఆవు పాలు అధికంగా ఉత్పత్తి చేస్తున్న దేశాలే ప్రపంచ క్షీర విపణిని శాసిస్తున్నాయి. 2015 ధరల ప్రకారం వంద లీటర్ల పాలు అమ్మిన చైనా పాడి రైతు 63.67 డాలర్లు ఆర్జిస్తున్నాడు. మన రైతుకు 41.39 డాలర్లు మాత్రమే లభిస్తుంది. భారత దేశానికి పశువులు చాలా ముఖ్యం. పశుశాస్త్రం తెలియకుండా, క్షీర శక్తి తెలియకుండా మనం దేశాన్ని నడిపించలేం. భారత ప్రజలు మొదటి నుండి కూడా పశు పోషకులు. పెద్ద సంఖ్యలో ఉన్నటువంటి జౌళి పరిశ్రమ, ఆటోమొబైల్స్‌లో 2 కోట్ల 31 లక్షల మంది పనిచేస్తున్నారు. మోడీ వచ్చిన తర్వాత ఉత్పత్తి క్రమాన్ని తగ్గించటం వల్ల ప్రజలను అప్పులకు అలవాటు చేయటం, వస్తు వ్యామోహాన్ని పెంచటం, పరస్పర సహకారాన్ని, ప్రేమను పెరగనివ్వకపోవటం వల్ల మన రవాణాను పెంచుకున్నంతగా ఉత్పత్తిని, ఉత్పత్తి రవాణాను పెంచలేకపోతున్నాం. ముఖ్యంగా 2013-16 మధ్య కాలంలో వ్యవసాయోత్పత్తుల విలువ చూస్తే ... తాజా పండ్లు, కూరగాయలు 8,391.41 కోట్లు, శుద్ధి చేసిన పండ్లు, కూరగాయలు 7,213.10 కోట్లు, జంతు సంబంధ ఉత్పత్తులు 30,137.07 కోట్లు, శుద్ధి చేసిన ఇతర ఆహారోత్పత్తులు 18,854.54 కోట్లు, వరి, గోధుమ, తృణధాన్యాలు 40,433.24 కోట్లు విలువ ఉంది. కానీ మోడీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ ఉత్పత్తులు దెబ్బతినటానికి కారణం ఆయనకు వ్యాపారం మీద, బడా పెట్టుబడిదారులను ఉత్సాహపరచటం మీద, అన్ని వ్యవస్థలపై పన్ను వసూలు చేయటం మీద ఉన్న దృష్టి వ్యవసాయ విస్తరణ మీద లేదు. నిజానికి భారతదేశం అతి ప్రాచీన కాలం నుంచి బియ్యం, సుగంధ ద్రవ్యాలు, జీడిపప్పు, నూనె, పొగాకు, టీ, కాఫీ పొడి, ఆవు మాంసం ఉత్పత్తిలో అనేక దేశాల మన్ననలు పొందింది. వాటిలో దేనికీ ఇంతవరకు ప్రోత్సాహం లేకపోగా గోరక్షణ ముఠాలు ఏర్పడి ఉత్పత్తి శక్తుల మీద తీవ్రమైన దాడులు చేస్తున్నాయి. ఈ సందర్భంలో భారతదేశ ఆర్థిక వ్యవస్థ కుదేలవటమేకాక 500 రూపాయల నోట్లు రద్దు చేసిన క్రమంలో వ్యవసాయ ఉత్పత్తులు అమ్ముకునే చిన్న చిన్న రైతులు, రైతు కూలీలు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయారు. ప్రపంచవ్యాప్తంగా వరి, గోధుమ, చక్కెర ఉత్పత్తి చేయటంలో భారతదేశం రెండో స్థానంలో ఉన్నదల్లా మోడీ వచ్చాక ఐదో స్థానానికి పడిపోయింది. ప్రాజెక్టుల నిర్మాణం మీద దృష్టి లేదు. పర్యవేక్షణ లేదు. పర్యావరణాన్ని రక్షించే హృదయం లేదు. శ్రామికునికి ఉత్పత్తి పరికరాలు సరఫరా చేయటంలో ఇవాళ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాగా వెనుకబడి ఉన్నాయి.



తమ బుద్ధితో, జ్ఞానంతో, మనస్సుతో, శ్రమతో ఈ దేశం మాది అని నీతిగా, నిజాయితీగా దేశ సంపదను పెంచటం కోసం కృషి చేస్తున్నారో వారిని గుర్తించాలి. ఆ రోజున భారతదేశం ఆర్థిక ఉత్పత్తిలో, పంపిణీలో ముందు వుంటుంది. అంతే కాని, జిఎస్‌టి లాంటి అరాచక పన్ను విధానాల వల్ల కాని, పెద్ద నోట్ల రద్దు విధానాల వల్ల కానీ, సామాజిక మైనార్టీల వివక్ష వల్ల కానీ భారతదేశం అభివృద్ధి చెందదు.

ఈ పరిస్థితుల్లో భారతదేశం ఆర్థిక సవాళ్ళను ఎదుర్కోవాలంటే స్త్రీల మానసిక శక్తిని, ఉత్పత్తి శక్తిని బలంగా పెంచుకోవాల్సిన అవసరం ఉంది. ఉద్యోగస్తులు రిటైర్ అయిన తర్వాత పెన్షన్ ఇస్తున్నట్లే అసంఘటిత కార్మికులకు ప్రతి నెల పెన్షన్ ఇచ్చే పథకాన్ని తీసుకు రావటం లేదు. ఒక వ్యవసాయ కూలీ, బీడీ కార్మికురాలు, మార్కెట్‌లో పూలు అమ్మే చిన్న వ్యాపారస్తురాలు ఆ పని చేయలేనినాడు అనాథలుగా మిగిలిపోయే ప్రమాదం వుంది. అందువల్ల భారత దేశంలో జీవన ప్రమాణాలు బాగా తగ్గుతున్నాయి. ఈ దశలో ఏ దేశాలయితే స్త్రీ శక్తిని గుర్తిస్తాయో ఆ దేశాలే ముందుకు వెళ్తున్న విషయం కూడా మోడీ గుర్తించలేకపోతున్నారు. ఈ సందర్భంగా తప్పకుండా దేశ ఉత్పత్తిని పెంచాల్సిన సామాజిక బాధ్యత మోడీపై ఉందని ఆర్థిక శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.


చరిత్రలో స్త్రీ శక్తికి ఉన్న గొప్పతనాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించలేకపోతున్నాయి. ఒకసారి మనం ప్రపంచవ్యాప్తంగా స్త్రీల శ్రామిక శక్తిలో భాగస్వామ్యాన్ని చూస్తే వియత్నాంలో 73 శాతం, భూటాన్ 67 శాతం, థాయ్‌లాండ్ 64 శాతం, చైనా 64 శాతం, బ్రెజిల్ 59 శాతం, బంగ్లాదేశ్ 58 శాతం, ఇండొనేషియా 51 శాతం, దక్షిణాఫ్రికా 45 శాతం, శ్రీలంక 35 శాతం, ఇండియా 27 శాతం, పాకిస్థాన్ 25 శాతంగా ఉంది. నిజానికి ప్రపంచంలో అన్ని దేశాల కంటే కూడా భారతదేశంలో స్త్రీలు అందునా దళిత స్త్రీలు ఉత్పత్తిలో ప్రధాన భాగస్వాములుగా ఉన్నారు. అయినా వారిని అంటరానివారిగా నెట్టేసి కూడు, గూడు, గుడ్డ లేనివారిగా వారిని పక్కకు తోసేశారు. దళిత స్త్రీలు ఆనకట్టలు, భవనాలు, రోడ్ల నిర్మాణాల్లో కూడా తమ శ్రమను ధారపోస్తున్నారు. బట్టల మిల్లులు, బీడీ పరిశ్రమ, సిమెంటు ఫ్యాక్టరీలు, ఆసుపత్రులు, క్వారీ పనులు ఇలా ఎన్నో రంగాల్లో దళిత స్త్రీలు పనిచేస్తున్నారు. ఒక వైపు ఇలా శ్రమిస్తూ కూడా మరో వైపు గృహ జీవనానికి సంబంధించిన పిల్లల పోషణ, సుదూర ప్రాంతాల నుండి కట్టెలు కొట్టి మోసుకు రావడం, నీళ్ళు తేవడం వంటి పనులన్నీ దళిత స్త్రీలు చేస్తున్నారు. అందువల్లే మొత్తం భారతీయ శ్రామిక శక్తిలో దళిత స్త్రీలు ప్రధాన పాత్ర పోషిస్తున్నారనేది చారిత్రక సత్యం. పగలంతా చెమటోడ్చి పొలాల్లో పని చేసే దళిత స్త్రీలకు అతి తక్కువ కూలీ మాత్రమే లభిస్తుంది. నూకలు కొనడానికి కూడా ఆ డబ్బు చాలదు. గంజి బువ్వలో మిరపకాలు నంచుకొని తినటం వల్లే దళిత స్త్రీలు పోషకాహార లోపానికి గురవుతున్నారు. మాతృ హృదయం గల దళిత స్త్రీ భర్తకు పిల్లకు వడ్డించిన తరువాతే కుండ అడుగునున్న మెతుకులు తింటుంది. అన్నం చాలక కరుణార్ద్రతతో ఆమె కళ్ళు గుంటలు పడి వుంటాయి. నూనె లేక అట్టలు కట్టిన ఆమె జుట్టు, శ్రమించి కాయలు కాసి ఆమె చేతులు మానవతా రహితమైన ఈ దేశ పాలక వర్గాల కర్కశత్వాన్ని గుర్తుచేస్తాయి. ఈ రోజున శ్రామికులు వృత్తికారుల్లో ఉన్నారు, శూద్ర కులాల్లో ఉన్నారు, అన్ని వర్గాల స్త్రీలలో ఉన్నారు. అయితే అస్పృశ్యతకు గురైనవారు మరింతగా కుల, ఆర్థిక దోపిడి వంటి అన్ని రకాల అణచివేతలకు గురవుతున్నారు.

నరేంద్ర మోడీ ప్రజాస్వామ్యంలో ఉండే ఫెడరలిజాన్ని దెబ్బతీయాలని చూస్తున్నారు. సామాజిక అసమానతలను పెంచుతున్నారు. సమాజాన్ని నిరంతరం తమ బుద్ధితో, జ్ఞానంతో, మనస్సుతో, శ్రమతో ఈ దేశం మాది అని నీతిగా, నిజాయితీగా దేశ సంపదను పెంచటం కోసం కృషి చేస్తున్నారో వారిని గుర్తించాలి. ఆ రోజున భారతదేశం ఆర్థిక ఉత్పత్తిలో, పంపిణీలో ముందు వుంటుంది. అంతే కాని, జిఎస్‌టి లాంటి అరాచక పన్ను విధానాల వల్ల కాని, పెద్ద నోట్ల రద్దు విధానాల వల్ల కానీ, సామాజిక మైనార్టీల వివక్ష వల్ల కానీ భారతదేశం అభివృద్ధి చెందదు. భారతదేశం అభివృద్ధి చెందాలంటే మార్క్స్, అంబేద్కర్‌ల ఆర్థిక శాస్త్రాన్ని సమన్వయం చేసుకుని, సముజ్వలం చేసుకున్నప్పుడే సాధ్యం. అందుకు లౌకికవాద శక్తులన్నీ ఒక తాటిమీద నడిచి భారతదేశంలో పునరుజ్జీవనానికి నడుం కట్టాల్సిన చారిత్రక సందర్భం ఇది.

(రచయిత సామాజికత తత్వవేత్త, నవ్యాంధ్రపార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు), సెల్:9849741695

ఆదివాసీల కష్టాలు పాలకులకు పట్టవా!

దాస్ వంతాల



సందర్భం

మన సమాజంలో అత్యంత బలహీనులు, నిస్సహాయులు అయిన ఆదివాసీలకు అడవులకు మధ్య విడదీయరాని బంధముంది. అందుకే ఇప్పటికీ అప్పటికీ వారు అడవుల్లోనే జీవిస్తున్నారు. మైదాన ప్రాంత నాగరికత ఛాయలు ఇప్పుడిప్పుడే అడవి ఒడికి విస్తరించటంతో తమ వేషభాషల్లో మార్పులు చేసుకుంటూ, సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకుంటున్నారు. కానీ ఇప్పుడు కాలం పరుగు తీస్తోంది. సామ్రాజ్యవాదుల దోపిడీ పెరిగిపోతోంది. మన ప్రభుత్వాలు సరళీకరణ విధానాలు అమలు చేయడం వలన ఆదివాసీల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది.

2014 ఎన్నికల్లో మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత భారత పౌరుల ప్రజాస్వామ్య, రాజ్యాంగ హక్కులపై దాడి తీవ్రమైంది. అందులో భాగంగానే గిరిజనుల ఐక్యతను దెబ్బ తీస్తున్నారు. వారి ఉనికి, సంప్రదాయాలు సంస్కృతులు కనుమరుగయ్యేలా వారిని హిందుత్వ పరిధి లోకి లాగే ప్రయత్నం చేస్తున్నారు. అటవీ హక్కుల చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. మూడు సంవత్సరాల్లో మోడీ ప్రభుత్వం అటవీ హక్కుల చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి ఎంతగానో ప్రయత్నించింది. పైగా పెద్ద ఎత్తున అడవుల ప్రయివేటీకరణ చేస్తోంది. ఎఫ్ఆర్ఏ చట్టాన్ని నిలుపుదల చేయడానికి ఉత్తర్వులు జారీ చేసింది. జంతువుల సంరక్షణ పేరుతో కొన్ని ప్రాంతాలను చట్టం నుండి వేరు చేసింది. గద్దెనెక్కిన రెండు నెలల కాలంలోనే 5 లక్షల కోట్ల రూపాయల విలువైనటువంటి భూముల్ని ప్రయివేటు వ్యక్తులకు ధారాదత్తం చేయడానికి మోడీ సర్కారు ప్రయత్నించింది. మూడు నెలల కాలంలోనే 7,000 హెక్టార్ల భూమిని ప్రయివేటు ప్రాజెక్టులకు కేటాయించింది. స్వాతంత్య్రం వచ్చిన నాటి సుమారు 85 లక్షల మంది గిరిజనులు నిరాశ్రయులయ్యారు. ప్రాజెక్టుల నిర్మాణం వల్ల 40 శాతం మంది నివశించడానికి భూములు లేకుండా పోయాయి. దేశంలో 7.5 శాతం మంది అనేక రకాలుగా నిస్సహాయులైనారు. 60 లక్షల మంది తమ భూములను, జీవనాధారాన్ని కోల్పోయారు.

గిరిజనులకు అన్యాయం చేయడంలో మన రాష్ట్ర ప్రభుత్వం కూడా తక్కువేమీ కాదు. మైనింగ్ అభివృద్ధి పేరిట ఆదివాసీల రక్షణలో వున్న ప్రాంతాలను స్వాధీనం చేసుకుంటోంది. విశాఖ ఏజెన్సీలో బాక్సైట్ తవ్వకాలకు 1212 హెక్టార్ల అటవీ భూమిని అప్పగించేందుకు జి.ఓ నెం.97ను జారీ చేసింది. గిరిజనులు పెద్ద ఎత్తున పోరాటం చేయటంతో వెనక్కు తగ్గింది. కాని జి.ఓను రద్దు చేయకపోవడం చూస్తుంటే ప్రభుత్వాలు గిరిజనులపై వున్న ప్రేమ కంటే ఖనిజ సంపద మీదే ఎక్కువ మక్కువ కనబడుతోంది.

జార్ఖండ్‌లో '1949 సంతాల్ పరగణా టెనన్సీ చట్టా'న్ని సవరించింది. '1908 చోటా నాగపూర్ టెనన్సీ చట్టాన్ని' సైతం సవరించింది. దీనికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నిరసనలు చేసిన గిరిజనులపై తూటాలు కురిపించడంతో అమాయక గిరిజనులు బలౌతున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో పోలవరం నిర్మాణం సాకుతో అదుపు లేకుండా భూములను ఆక్రమిస్తున్నారు. ప్రాజెక్టుల వల్ల నిర్వాసితులైన గిరిజనులకు నష్టపరిహారం చెల్లించటం లేదు. పోలవరం ప్రాజెక్టు వల్ల 80 వేల మంది నిరాశ్రయులయ్యే ప్రమాదం వుంది. ముంపు గ్రామాల గిరిజనుల సమస్యలు పట్టించుకోవడం లేదు. ఆదివాసీ మహిళలపై దాడులు అధిక సంఖ్యలో జరుగుతున్నాయి. మావోయిస్టులు, పోలీసుల మధ్య గిరిజనులు నలిగిపోతున్నారు. బిజెపి ప్రభుత్వం 2017-18 బడ్జెట్‌లో జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించ లేదు. వాస్తవానికి ఆదివాసీలకు 9 శాతం బడ్జెట్ కేటాయింపు జరగాలి. అలా చేయకపోగా బడ్జెట్ కేటాయింపుల శాతాన్ని క్రమేణా తగ్గించింది. 2014లో కేటాయింపులు 1.84 శాతం కాగా 2017-18లో 1.53 శాతానికి పడిపోయాయి. కేటాయించిన నిధులను కూడా ఖర్చు చేయటం లేదు. ఇతర పథకాలకు దారి మళ్ళిస్తోంది.

గిరిజనులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభిచంటం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల ఫలితంగా ఆదివాసుల జీవనోపాధి దెబ్బతిన్నది. అటవీ భూముల నుండి వారిని దూరం చేయడం, కలపేతర చిరు అటవీ ఉత్పత్తులైన గడ్డి, వెదురు, విత్తనాలు, మొక్కలు, వేర్లు, తేనె, చిగురు సేకరణను ఉమ్మడి ఆస్థి హక్కుగా గుర్తించకపోవడం శోచనీయం. అతి తక్కువ ధరలతో దళారుల చేతిలో మోసపోతున్నారు. గిరిజనుల ప్రయోజనాల పరిరక్షణకై ఏర్పడిన గిరిజన సహకార సంస్థ (జిసిసి) నిర్వహణ పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి కరువైంది. సంస్కరణల నేపథ్యంలో దీన్ని కూడా వ్యాపార సంస్థగానే ప్రభుత్వం పరిగణిస్తూ అవసరం మేరకు నిధులు కేటాయించడం లేదు.



నేడు ప్రపంచ గిరిజన దినోత్సవం

గిరిజన కార్పొరేషన్, వ్యాపారులు కుమ్మక్కై గిరిజనులకు అతి తక్కువ ధరలు ఇస్తున్నారు. దీనివల్ల ఆదాయం రాక తీవ్రంగా నష్టపోతున్నారు.

ఉపాధి హామీ పథకం నిర్లక్ష్యం చేయబడుతోంది. అయితే దేశంలోకెల్లా ప్రత్యమ్నాయ గిరిజన అభివృద్ధి జరుగుతున్న రాష్ట్రం త్రిపుర. ఉపాధి హామీ పని కల్పించడంలో ప్రథమ స్థానంలో వున్నది. బిజెపి ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులు తగ్గించడంతో ఈ సంవత్సరం వేతన బకాయిలు రు. 2,600 కోట్లకు చేరింది. వివిధ రాష్ట్రాలలో గిరిజనులు వలసలు పోయి వెట్టిచాకిరి చేసుకుంటున్నారు. ఉపాధి క్షీణిస్తున్నది. ఆదివాసి పురుషులు, యువత, మహిళలు పనుల కోసం లేబర్ మార్కెట్‌లోకి ప్రవేశిస్తున్నారు. ఆదివాసీ యువతీ, యువకులు నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు. పట్టణాల్లో బట్టల షాపులు, హోటళ్లు, క్యాంటిన్లలో పని చేస్తున్నారు.

వ్యవసాయ రంగం నాశనమౌతోంది. వ్యవసాయంపై ఆధారపడ్డ గిరిజనులు 1961లో 68.18 శాతం వుంటే 1991 సరళీకరణ ప్రారంభం అయిన తరువాత 54.50 శాతానికి తగ్గిపోయారు. ఆధునిక యంత్రాలు పెరగటం, పనిముట్లలో జిఎస్టి వంటి టాక్స్ భారాలు మోపి వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారు.

ఏజెన్సీలో వున్న నీటి వనరుల్లో కాల్షియం, మెగ్నీషియం, క్లోరైడ్, సల్ఫేట్, ఫ్లోరైడ్ శాతం తక్కువగా వుండటంతో గిరిజనులు నిత్యం అనారోగ్యంతో బాధ పడుతున్నారు. గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్య పరిస్థితి రాను రాను క్షీణిస్తున్నది. ప్రభుత్వాలు మారినా గిరిజనుల బతుకులు మాత్రం మారడం లేదు. స్వాతంత్య్రం వచ్చి 67 సంవత్సరాలు గడిచిపోతోంది. అయినా బ్రిటీష్ కాలం నాటి కష్టాలు నేటికీ అనుభవిస్తున్నారు. ఇతర ప్రాంతాలతో పోల్చితే గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్య పరిస్థితులు మరింత దారుణంగా వున్నాయి. 2016-17 సంవత్సరం వ్యాధుల సీజన్‌లో 113 మంది గిరిజనులు చనిపోయారు. 2017-18 వ్యాధుల సీజన్ ఇంకా పూర్తి కాలేదు. ఈ ఏడాది మలేరియా, డయేరియా, టైఫాయిడ్, మాతా శిశు మరణాలు కలిపి 98 మంది గిరిజనులు చనిపోయారు. గోదావరి జిల్లా చాపరాయి ప్రాంతంలో 16 మంది మరణించారు. ప్రభుత్వం మాత్రం ఈ మరణాలకు ఏవేవో కారణాలు చెప్తోంది. అధికారులు తప్పుడు లెక్కలు చూపుతున్నారు. అక్టోబర్ వరకు మరణాలు పెరిగే అవకాశముంది. ప్రసవ సమయంలో తల్లుల మరణాలు రాష్ట్రంలో 1000 మందికి నాలుగు వుండగా గిరిజన ప్రాంతాల్లో 8 నుండి 25 వరకు వున్నాయి. శిశు మరణాలు 120 నుండి 150 వరకు వున్నయి. 3వేల జనాభాకు ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పిహెచ్‌సి) వుండాలి. కానీ 20 వేల జనాభాకు ఒక పిహెచ్‌సి వుంది. సర్వే ప్రకారం 66 శాతం పిహెచ్‌సిలకు మరమ్మతులు లేవు. 62 శాతం పిహెచ్‌సిలకు ప్రసవ గదులు, మంచినీటి వసతులు లేవు. 26 శాతం డాక్టర్ల పోస్టులు, 20 శాతం పురుష, 26 శాతం గైనిక్ డాక్టర్ల పోస్టులు ఖాళీగా వున్నాయి.

గిరిజన విద్యా వ్యవస్థ కుంటుపడింది. అక్షరాస్యత, సామాజిక తరగతుల మధ్య అంతరం పెరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో 50 శాతం మహిళలు, 32 శాతం పురుషులు నిరక్ష్యరాస్యులుగా ఉన్నారు. స్కూల్లో చేరిన వారిలో కూడా 70 శాతం మంది మధ్యలోనే మానేస్తున్నారు. దీనికి ప్రభుత్వ విధానాలే కారణం. విశాఖ ఏజెన్సీ 3574 ఆవాస ప్రాంతాలకు గాను 1565 ప్రాంతాలకు 2 కి.మీ పరిధిలో ప్రాథమిక పాఠశాలలు లేవు. ఈ సంవత్సరం 6వ తరగతి అడ్మిషన్లు ఆపేశారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా వుందన్న సాకుతో స్కూళ్ళు మూసేస్తున్నారు. అట్టడుగున ఉన్న గిరిజనుల బతుకులు ఉద్ధరణ కోసమే పాటుపడుతున్నామని గిరిజన ఉత్సవాలు చేయడం ఉపయోగం లేదు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం పేరుతో గిరిజనుల్ని మభ్య పెట్టడానికి ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి బాబు గారు ఆదివాసీ దినోత్సవం రోజు అరకు పర్యటిస్తున్నారు. ఆయన దత్తత తీసుకున్న పెదలబుడు గ్రామాన్ని కూడా సమగ్రంగా అభివృద్ధి చేయట్లేదు. అరకు ప్రాంతాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తామని చెప్పినా చేయలేదు. గిరిజన విశ్వవిద్యాయాన్ని నేటికి ప్రారంభించకుండా వివక్ష ప్రదర్శిస్తున్నారు. ఈ ప్రభుత్వాల కుటిల యత్నాలను గిరిజనులందరూ ముక్త కంఠంతో వ్యతిరేకించాలి. హక్కులు, చట్టాలను కాపాడుకోవడం కోసం ఉద్యమాలకు సిద్ధం కావాల్సిన తరుణమిది. అప్పుడే ఆదివాసీ దినోత్సవాలు చేసి సంబరాలు చేసుకోవడంలో అర్థం వుంటుంది.

(రచయిత గిరిజన సంఘం నాయకులు), 9494076092

సామాన్యుడి కోరిక.. తీరేనా!

ఊహ

"మంత్రీ పారాయణా.. ఎందుకనో ఈవేళ.. నా మానసంబున కడు సంతోషముగా ఉన్నది.. ఈ సందర్భముగా.. నా ప్రియమైన ప్రజలతో మనసు విప్పి మాట్లాడాలని ఉంది.. ఏమందురు?" మొఖమంతా యాంత్రికమైన నవ్వు పులుముకుని అడిగారు శ్రీశ్రీశ్రీ రాజాబహదూర్ రాజావారు.

"ఎప్పుడూ..మాడు మొఖముతో ఉండే మీరు.. క్షమింపుడు.. క్షమింపుడు ఎప్పుడూ.. సీరియస్‌గా ఉండే.. మీరు.. ఈపూట.. ఇంత సంతోషంగా ఉండటం మాకెంతో ఆనందముగా ఉన్నది. మీ ప్రియమైన ప్రజానీకాన్ని ప్రవేశపెట్టమందురా?" రాజావారి ఉత్సాహాన్ని పదింతలు చేస్తూ అడిగాడు పారాయణ.

"యావత్.. ప్రజానీకం.. వద్దులేగానీ.. కోట్లాది నా అక్క, చెల్లి తమ్ముళ్ళ తరపున.. ఒక్కరిని.. ఉత్తమోత్తమ సామాన్యుడిని తోడ్కొనిరమ్ము.. చాలు" అని రాజావారు అనగానే..

"ఎవరక్కడ.. రాజావారు ఆజ్ఞప్రకారము.. మన రాజ్యంలోని.. మొత్తం ప్రజానీకంలోకెల్లా.. అతిసామాన్యుడిని కనిపెట్టి.. ఇచ్చటకు గైకొని.. అటుపిమ్మట దర్బార్‌హాలులోకి ప్రవేశపెట్టుడి" అంటూ మంత్రి పారాయణ.. పక్కనేఉన్న భటులకు పిలుపుచ్చాడు.

"సరే.. ఆ సామాన్యుడు వచ్చేలోపుగా.. ఏవైనా విశేషాలుంటే.. సెలవివ్వండి పారాయణా.." తనదైన శైలిలో అడిగారు రాజావారు.

"ఏముంది మహారాజా.. ఎక్కడివేసిన గొంగళి అక్కడే ఉన్నది.. " అని పారాయణ పరధ్యానంలో అనగానే..

"పారాయణా... ఏం.. గొంగళి.. గింగళి అంటున్నారు.. ఏం తమాషాగా ఉందా.." గుడ్లు రిమారు రాజావారు.

"అయ్యో.. రాజావారు క్షమించాలి. కొంతమంది గిట్టనివాళ్ళు అలా అనుకుంటున్నారుగానీ.. అలాంటిదేమీలేదూ.. ఎంతో అద్భుతంగా మన రాజ్యపాలన సాగిపోతుంది.. అని నేను చెప్పబోయేంతలో.. గొంతులో కరక్కాయ అడ్డుపడి.. ఆ విషయం మీకు చెప్పలేకపోతిని.. అంతే ప్రభూ.. హిహ్హిహ్హీ.." సర్దిచెప్పుకున్నాడు పారాయణ

"సరే.. సరేగానీ.. నా మూడ్ మారేలోపు ఇంతకుముందు అనుకున్నట్టుగా.. నా ప్రియాతిప్రియమైన సామాన్యుడ్ని ప్రవేశపెట్టుడి? " అని రాజావారు అనగానే..

"అటులనే రాజావారు.. ఎవరక్కడ.. ఆ పాపిని.. ప్రవేశపెట్టుడి.. ఆ..ఁ.. కాదు కాదు.. ఆ ఉత్తమోత్తమ సామాన్యుడిని ప్రవేశపెట్టుడి.." అని పారాయణ అనగానే.. ఓ బక్కపలచని వ్యక్తిని బరాబరా లాక్కొస్తారు భటులు

"రాజావారికి దండాలు.. మీరు ఇంతిలా నాబోటి ఓ సామాన్యుడిపైన దయతలచి.. తమరి



దర్బారుకు పిలిపించుకోవడం.. చానా సంతోషంగా ఉందయ్యా.. దండాలు.. దండాలు" అడమోర్పు కళ్ళతో రెండు చేతులు పైకెత్తి దణ్ణంపెట్టాడు సామాన్యుడు.

"హిహ్హిహ్హీ.. సామాన్యా... నేనెప్పుడూ అంతే... పేదోడి సంక్షేమమే.. నా..." అని రాజావారు అంటుండగా..

"పేదవారి సంక్షేమమే.. రాజావారికి అదీ.. ఇదీ.. ఇంకా..ఎంతో.. ఏదో అన్నమాట.. " అతి ఉత్సాహంతో అడ్డుపడుతూ సామాన్యుడివైపు చూస్తూ చెప్పాడు మంత్రి పారాయణ.

"పారాయణ.. మన గొప్పల గురించి నన్నూ చెప్పనివ్వక.. నువ్వూ చెప్పక.. మధ్యలో.. ఒక ఇదీ.. ఒక అదీ అని ఇండైరెక్ట్‌గా అడ్డుపడతావా? ఏం తమాషాగా ఉందా.. అయ్" ఒకింత ఆవేశపడతారు రాజావారు.

"అయ్యో నేను.. మీతో తమాషాలు వేయడమా.. ఎంతమాట.. ఎంతమాటా.. సామాన్యుడికి.. మీ గురించి, మన రాజ్యము గురించి గొప్పగా చెప్పాలని.. మధ్యలో నేను కలుగజేసుకుంటిని.. హిహ్హిహ్హీ.." సర్దిచెప్తాడు పారాయణ.

"సరిసరే.. కాసేపు మీరు ఆ పక్కకెళ్ళి ఆశీనులవ్వండి.. నేను ఆ..సామాన్యుడితో సంభాషించెద. ఏం సామాన్య.. ఏమిటి విశేషాలూ.. బాగున్నారా?!" రాజావారు అడగ్గానే..

"అబ్బో.. బ్రహ్మాండం... అట్టా.. ఇట్టాకాదండి బాబు.. ఈ జన్మకు కావాల్సినంత.. బ్రహ్మాండంగా ఉన్నా.. కాకపోతే.. చిన్న కోరిక సామీ.. తీరుత్తారా... " ఎంతో వినమ్రంగా అడగుతాడు సామాన్యుడు.

"అయ్యో.. సామాన్యా.. ఎంతమాట.. నేనున్నది.. అందుకేగా.. అడగండి.. నిరభ్యంతరంగా అడగండి.. చిటికెలో తీరుస్తా.. హిహ్హిహ్హీ.." అభయమిచ్చారు రాజావారు.

"మరేంలేదు.. సామీ.. మరేంటంటే.. ఏంటంటే.. " సామాన్యుడు చెప్పడానికి మొహమాటపడుతుండగా..

"ఓయ్.. సామాన్య.. నువ్వు ఏమాత్రం మొహమాట పడమాక.. ధైర్యంగా అడుగు.. నీ కోరిక చిటికెలో తీరుస్తా.. " మరోసారి అభయమిచ్చారు రాజావారు.

"ఏం.. లేదు సామీ.. నాది చానా చిన్నకోరికే. అదేంటంటే .. మీరు కొత్త రాజధాని కడతన్నారంటగా.. అది ఎట్టా ఉంటాదో చూడాలని ఉందయ్యా.. నేను బతికుండగా.. అది చూత్తానంటారా?" బేలగా, అమాయకంగా మొఖంపెట్టి అడిగాడు సామాన్య.

"రాజధాని.. కొత్త రాజధాని.. హిహ్హిహ్హీ.. చూడాలని ఉందా.. దానికేం భాగ్యం.. కళ్ళారా చూస్తావోయ్.. భలేవాడివే.. హిహ్హిహ్హీ.." అని రాజావారు అంటుండగా..

"నాకు నమ్మకంలేదు సామీ.. నాగొంతులో పేనముండగా.. నాకోరిక తీరదేమోనయ్యా.." నిరుత్సాహంగా అంటాడు సామాన్య

"ఇదిగో.. సామాన్యా.. అట్టా డీలా పడమాక.. అదిగో.. అక్కడ చూడు.. ఎలా ఎల్‌ఈడీ బల్బులు ఎంత కాంతివంతంగా వెలుగుతున్నాయో.. అదిగో.. అక్కడ చూశావా.. ఆ రోడ్లు..మధ్యనున్న డివైడర్లు బాగు చేయించి.. మొక్కలు పాతించాను..ఎంత బావున్నాయి.. అదిగో.. గన్నవరం ఎయిర్‌పోర్ట్‌కాడ.. రోడ్లన్నీ.. తళతళమెరిపోవడంలేదు.. హిహ్హీ" అని రాజావారు.. ఇంకా ఏదో చెప్తుండగా..

"అదేందయ్యా.. నేను కొత్త రాజాధాని చూడాలని ఉందంటే.. ఎల్‌ఈడీ బల్బ్‌ల గురించి.. గన్నవరం రోడ్లగురించి.. సామాన్యుడు మడతేసి చెప్తారేంది.. నాకోరిక తీరుద్దా లేదా.. సెప్పండి.. కాదంటే..ఈడ్నుంచి ఎల్లిపోతా.." ఖరాకండీగా అడిగేసరికి

"ఏం పిచ్చపిచ్చగా ఉందా.. తమాషాగా ఉందా.. ఏం.. నాకే ఎదురు చెప్తావా.. అయ్.. ఇంకోసారి ఇట్టా మాటాడేవనుకో.. పట్టిసీమ ప్రాజెక్టులో మంచేత్తా జాగ్రత్త.. అయ్.." అని కోపంతో ఊగిపోతూ హెచ్చరిక చేస్తారు రాజావారు

"ఏంటి..రాజావారూ?! పట్టిసీమలో ముంచెత్తారా.. అందులో నీళ్ళెక్కడున్నాయి.. అంతా వరదనీరేగా.. వాన నీళ్ళు చూపించి.. పట్టిసీమ నీళ్ళంటే నమ్మేయడానికి.. నేనేమీ.. పప్పు సుద్దను కాదు... " అని సామాన్య అనగానే

"ఏం.. పిచ్చ పిచ్చగా ఉందా.. తమాషాగా ఉందా.. పప్పు సుద్దంటూ.. చినరాజావార్ని యెటకారం చేస్తావా.. ఏం తమాషాగా ఉందా?! పిచ్చపిచ్చగా " అని రాజావారు కోపోద్రికులయ్యేసరికి

"నాకోరిక ఎలాగూ తీరదని అర్థమైపోనాదిగానీ.. ఇంక ఉంటానయ్యా.. వత్తా.." అంటూ మారుమాట్లాడకుండా అక్కడ్నుంచి బయటపడతాడు సామాన్యుడు.

- గంగాధర్ వీర్ల.



కాకర పేరు చెప్పగానే.. అయిష్టంగా.. ఏంటీ కాకరా?! అంటూ ముప్పై ఆరు ప్రశ్నలతో.. నొసలు చిట్లించే వారుంటారు. అదే కాకర పేరు చెప్పగానే నాలుక.. నాలుగింతలు చేసుకుని చప్పరించే వాళ్లూ ఉంటారు. చేదుగల కాకరను సరిగ్గా వండితే ఆ రుచే వేరు. ఒక్క రుచే కాదు.. కాకరలో చిన్నా, పెద్దలకు కావల్సిన పోషకాలూ ఎక్కువే. అందుకే కాకరతో 'వెరైటీ' రుచులను ట్రై చేద్దాం.!

కాకరతో కమ్మని రుచులు

ఆలు-కాకరకాయ ఫ్రై



కావల్సిన పదార్థాలు: కాకరకాయలు– నాలుగు, ఆలుగడ్డలు– మూడు, ఉప్పు, కారం –తగినంత, నిమ్మరసం– నాలుగు టేబుల్ స్పూనులు, ఉల్లిపాయలు– రెండు, అల్లం, వెల్లుల్లి– తగినంత, జీలకర్ర– టేబుల్ స్పూన్, పసుపు– తగినంత, పోపు గింజలు – తగినంత, గరంమసాలా– తగినంత.

తయారు చేసే విధానం: ముందుగా ఆలుగడ్డలను ఉడకబెట్టి పొట్టు తీసి మెత్తగా చేసుకోవాలి. గిన్నెలో నూనె పోసుకుని ఉల్లిపాయ ముక్కలను వేయాలి. జీలకర్ర, పోపుగింజలు, అల్లం వెల్లుల్లి, పసుపు వేయాలి. బాగా వేగిన తర్వాత మెత్తగా చేసిన ఆలును వేయాలి. కారం, ఉప్పు వేసి ఫ్రై చేయాలి. కాసేపయ్యాక గరంమసాలా వేయాలి. తర్వాత చిన్నగా తరిగిన కాకరకాయ ముక్కలను నూనెలో వేసి వేగించాలి. ఈ ముక్కల్లోకి ఆలు ముద్దలను చేర్చాలి. తిరిగి నూనెలో ఈ ఆలును చేర్చిన కాకరకాయ ముక్కలను వేసి డీప్ ఫ్రైచేయాలి. తర్వాత కొంచెం నిమ్మరసం, మసాల పొడి చల్లుకోవాలి.

పప్పు



కావల్సిన పదార్థాలు: కాకరకాయలు – రెండు (పండినవి), శనగలు – గుప్పెడు, మినపప్పు, ధనియాలు – టేబుల్ స్పూను చొప్పున, శనగపప్పు – అర టేబుల్ స్పూను, ఎండు మిర్చి – నాలుగు, ఉడికించిన కందిపప్పు – కప్పు, ఇంగువ – చిటికెడు, కొబ్బరి తురుము – రెండు టేబుల్ స్పూన్లు, చింతపండు – నిమ్మకాయంత, పసుపు – పావు టీ స్పూను, సాంబారు పొడి, నూనె, ఆవాలు – టీ స్పూను చొప్పున. ఉప్పు – రుచికి తగినంత.

తయారుచేసే విధానం: శనగలను రాత్రంతా నానబెట్టుకోవాలి. కాకరకాయల్ని చక్రాల్లా తరిగి చిటికెడు పసుపు, ఉప్పు కలిపి శనగలతో పాటు కుక్కర్లో ఉడికించాలి. ఎండుమిర్చి (3), శనగపప్పు, మినపప్పు, ధనియాలు వేగించి కొబ్బరి తురుముతో పాటు మెత్తగా రుబ్బుకోవాలి. నూనెలో ఆవాలు, ఎండుమిర్చి వేగించాక చింతపండు గుజ్జు, సాంబారు పొడి, ఇంగువ, పసుపు, ఉప్పు ఒకటి తర్వాత ఒకటి కలపాలి. ఐదు నిమిషాల తర్వాత ఉడికించిన శనగలు, కాకరముక్కలు, పప్పుతో పాటు కొబ్బరి మిశ్రమం కలిపి చిక్కబడ్డాక కరివేపాకు వేసి దించేయాలి.

కళ్లకు మంచిది!



కాకరకాయలో విటమిన్- ఎ సమృద్ధిగా ఉంటుంది. అందువల్ల చర్మానికి, కళ్లకు చాలా మంచిది. ఇది రోగనిరోధక శక్తిని కూడా బాగా పెంచుతుంది. డయాబెటిస్‌ను అదుపులో ఉంచుతుంది. దీనిలో ఫైబర్ శాతం ఎక్కువగా ఉండటం వల్ల మలబద్ధకాన్ని నివారిస్తుంది.

జానకి బడుగు, పోషకాహార నిపుణులు.

కాకర రైస్



కావల్సిన పదార్థాలు: కాకరకాయలు – మూడు, నూనె – రెండు లేదా మూడు పెద్ద స్పూన్లు, జీలకర్ర – అరచెంచా, కారం – పావుచెంచా, ధనియాలపొడి – పావుచెంచా, గరంమసాలా – అరచెంచా, కొత్తిమీర – పావుకప్పు, ఆమ్‌చూర్‌పొడి – అరచెంచా, అన్నం – రెండు కప్పులు, ఉప్పు – తగినంత.

తయారుచేసే విధానం: కాకరకాయ ముక్కల్ని పొడుగ్గా తరిగి కాస్త ఉప్పు చల్లి పక్కన ఉంచాలి. పాన్‌లో నూనె వేడిచేసి జీలకర్ర వేయించాలి. అందులో నీరంతా పిండేసిన కాకరకాయ ముక్కల్ని వేసి మూతపెట్టేయాలి. కాసేపటికి అవి మగ్గుతాయి. అప్పుడు తగినంత ఉప్పు, కారం, ధనియాలపొడి, గరంమసాలా, ఆమ్‌చూర్‌పొడి, కొత్తిమీర వేయాలి. ఆ తరవాత అన్నం కూడా వేసి బాగా వేయించి ఐదారు నిమిషాలయ్యాక దింపేయాలి. నోరూరించే కాకర రైస్‌ని రైతాతో కలిపి తీసుకుంటే బాగుంటుంది.

మసాల కూర



కావల్సిన పదార్థాలు: సన్నని కాకరకాయలు – నాలుగు, మజ్జిగ – పావుకప్పు, నూనె – అరకప్పు, ఉప్పు – తగినంత, ఆవకాయలోని పిండి – కప్పు, పసుపు – పావుచెంచా.

తయారుచేసే విధానం: కాకరకాయల్ని నిలువుగా గాట్లుపెట్టి వాటిలోని గింజల్ని తీసేయాలి. ఈ కాయల్ని కుక్కర్‌లో తీసుకుని మజ్జిగా, కొద్దిగా ఉప్పు వేసి సగం ఉడికించి తీసుకోవాలి. తరవాత కాసేపు ఎండలో ఆరబెడితే.. వాటిలోని తడి పూర్తిగా పోతుంది. వాటిలో ఆవకాయ పిండిని కూరాలి. ఇప్పుడు పాన్‌లో నూనె వేడిచేసి కాకరకాయ ముక్కల్ని అందులో జాగ్రత్తగా ఉంచి, పసుపు వేసి వేయించాలి. మంట తగ్గించి మధ్యమధ్య కలుపుతూ ఉంటే కాసేపటికి ఎర్రగా వేగుతాయి. కావాలనుకుంటే ఆవకాయ పిండిలోనే దంచిన వెల్లుల్లి రెబ్బలు, కొద్దిగా జీలకర్రపొడి, వేయించిన నువ్వులపొడి కూడా కలిపి కాకరకాయల్లో కూరొచ్చు.

ఉల్లికారం



కావల్సిన పదార్థాలు: కాకరకాయలు – పావు కిలో, ఉల్లి కారం – రెండు టేబుల్‌స్పూన్లు, ఉప్పు – తగినంత, జీలకర్ర – టీస్పూను, నూనె – రెండు టేబుల్ స్పూన్లు, కరివేపాకు – రెండు రెమ్మలు, కొత్తిమీర – కట్ట.

తయారుచేసే విధానం: కాకరకాయలు తొక్కుతీసి కడిగి మధ్యకు కట్ చేసుకోవాలి. ఈ ముక్కలకు గాట్లు పెట్టి పక్కనుంచాలి. ఉల్లికారం, ఉప్పు కలుపుకోవాలి. ఈ ముద్దను గాట్లు పెట్టిన కాకరకాయల్లో కూరి పక్కనుంచాలి. పాన్‌లో నూనె పోసి జీలకర్ర, కరివేపాకు వేయించి కాకరకాయ ముక్కలు వేసి మూత పెట్టి చిన్నమంట మీద ఉడికించాలి. తరచుగా ముక్కల్ని గరిటెతో తిప్పుతూ అన్ని వైపులా సమంగా ఉడికించాలి. ముక్కలు బాగా ఉడికాక కొత్తిమీర చల్లి దింపాలి.

అరటిపండుతో ఆరోగ్యం

అరటిపండు అంటే ఇష్టపడని వారు దాదాపు ఉండరు. రోజు అరటిపండు తినటం వలన ఆరోగ్యానికి కలిగే ప్రయోజనాలు చాలానే ఉన్నాయని నిపుణులు సూచిస్తున్నారు.

- అరటిపండు సుక్రోజ్, ఫ్రక్టోజ్, గ్లూకోస్ వంటి సహాయ చక్కెరలతో పాటు, ఫైబర్లని కూడా కలిగి ఉంటుంది.
- అరటిపండు తక్షణ శక్తిని అందించటమే కాకుండా, శక్తి స్థాయిలను గణనీయంగా పెంచుతుంది.
- ఒక అరటిపండు నుంచి వచ్చే శక్తి ద్వారా నిరంతరంగా 90 నిమిషాల పాటు కఠినమైన వ్యాయామాలను చేయవచ్చని పరిశోధనలలో తేలింది.
- అరటిపండులో అధికంగా పొటాషియం, తక్కువ ఉప్పు ఉంటుంది. దీనిని రక్తపోటుకు సరైన ఔషదంగా పేర్కొనవచ్చు. స్ట్రోక్, రక్తపోటును ఆరోగ్యకరంగా అరటి పండు పర్యవేక్షిస్తుంది.
- ఉదయం వేళ అల్పాహారంగా, మద్యాహ్న భోజనం తరువాత అరటిపండును పిల్లలకు ఇవ్వడం మంచిది. పొటాషియం అధికంగా ఉండే ఈ పండు నేర్చుకోవటంపై ఆసక్తిని పెంచుతుంది.
- అధికంగా ఫైబర్ ను కలిగి ఉండే అరటిపండును రోజూ తినడం వల్ల జీర్ణవ్యవస్థలోని పేగు కదలికలు సక్రమంగా ఉంటాయి. ఇది మలబద్ధకాన్ని దూరంగా ఉంచుతుంది. ఈ సమస్య ఉండే వారు రోజూ ఒక అరటిపండు తప్పక తినాలి.
- హ్యాంగోవర్ సమస్య నుంచి త్వరగా ఉపశమనం పొందాలంటే అందుబాటులో ఉన్న మంచి మార్గం



అరటిపండే. • తేనె కలిపిన బనానా మిల్క్ షేక్. అరటిపండు జీర్ణాశయాన్ని శాంతింపజేస్తుంది. తేనె క్షీణించిన చక్కెర స్థాయిలను తిరిగి పెంపొందిస్తుంది. పాలు శరీర వ్యవస్థలను తిరిగి హైడ్రేట్ అయ్యేలా చేస్తుంది

అల్లం టీ తాగుతున్నారా?!



అల్లం టీ వలన కొన్ని ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నప్పటికీ అనర్థాలు కూడా ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. అవేమిటో తెలుసుకుందాం!

- రోజులో 4 గ్రాముల కంటే ఎక్కువ అల్లం టీ తాగకూడదు. అంతకు మించి దీనిని తీసుకోవటం వలన శరీరంలో బైల్ అధిక మొత్తంలో విడుదలౌతుంది. ఇది ఆరోగ్యానికి అంత మంచిది కాదు.
- కొంతమందిలో అల్లంటీ హృదయ స్పందనలో మార్పులతో పాటు, పొట్టలో అలజడికి గురి చేస్తుంది. మొదటగా అల్లంను సుగంధ ద్రవ్యాల పట్టికలో చేర్చారు. కారం, మసాలా దినుసులు విధంగానే ఇది కూడా మంటను కలిగిస్తుంది.
- ఒకవేళ అలర్జీ ఉంటే, అల్లంటీ తాగటం వలన స్కిన్ రాషెస్ నోట్లో లేదా కడుపులో చికాకులను కలిగిస్తుంది.
- అల్లంటీ రక్తపోటును బాగా తగ్గిస్తుంది. దీనివల్ల మైకానికి గురయ్యే అవకాశం కూడా ఉంటుంది.
- అల్లం సాలిసిలేట్లను కలిగి ఉంటుంది. ఇవి రక్తాన్ని పలుచగా చేస్తాయి. అందువల్ల బ్లీడింగ్ సమస్యలున్న వారు అల్లంటీ కి దూరంగా ఉండాలి.



మీ కోసం

సూర్యరశ్మి వల్ల చర్మంపై ఉన్న మచ్చలు పోవాలంటే స్నానానికి ముందు శరీరానికి కొబ్బరినూనెను రాసుకుని, సున్నితంగా మర్దనా చేసుకుని తరువాత గోరువెచ్చని నీటితో స్నానం చేయాలి. ఇలా కొన్నిరోజులపాటు చేస్తే ఫలితం ఉటుంది.

జీవన సౌరభం

తన చుట్టూ ఏం జరుగుతుందో తెలుసుకోగలిగినప్పడే నాయకులు బృందాన్ని స్వేచ్ఛగా నడిపించగలరు. నాయకత్వమంటే నిరంతర అభ్యాసనం.

గ్రూప్స్, ఇతర పోటీపరీక్షల ప్రత్యేకం

థర్మామీటర్‌ను ఎందుకు ఉపయోగిస్తారు?



ఎస్.పి. మనోహర్ కుమార్,
టీచర్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
నున్న, కృష్ణాజిల్లా.
సెల్ : 9490300637

ఉష్ణం

ఘర్షణ, అభిఘాతాలవలన ఉష్ణం ఉత్పత్తి అవుతుంది. ఇది పదార్థంలోని అణువుల కంపన శక్తి రూపంలో ఉంటుంది. వేడి వస్తువునుంచి చల్లని వస్తువుకు ప్రవహించే శక్తిస్వరూపం ఉష్ణం. ఇది జీవులకు స్పర్శజ్ఞానాన్ని కలిగిస్తుంది.

దీనికి ప్రమాణాలు సిజిఎస్ విధానంలో కెలోరి, ఎంకెఎస్ విధానంలో కిలోకెలోరీ మరియు ఎస్ఐ పద్ధతిలో జౌల్.

ఉష్ణోగ్రత : ఉష్ణశక్తియొక్క తీవ్రతనే 'ఉష్ణోగ్రత' అంటారు.ఇది వస్తువుల వేడి తీవ్రతను గాని, చల్లదనం యొక్క తీవ్రతను తెలియజేస్తుంది. ఒక వస్తువు ఉష్ణశక్తి పెరిగితే ఉష్ణోగ్రత పెరుగుతుంది. ఉష్ణశక్తి కోల్పోతే ఉష్ణోగ్రత తగ్గుతుంది. ఉష్ణోగ్రతను కొలిచే పరికరం 'ఉష్ణమాపకం'. ఈ ఉష్ణమాపకం వేడిచేస్తే పదార్థాలు వ్యాకోచిస్తాయి అనే సూత్రంపై పనిచేస్తుంది. ఉష్ణోగ్రతలను డిగ్రీ సెల్సియస్ లేదా డిగ్రీ ఫారన్‌హీట్ లేదా కెల్విన్ లేదా డిగ్రీ రాయమర్‌లలో కొలుస్తారు. సాధారణ వాతావరణ పీడనం వద్ద మంచు కరిగే ఉష్ణోగ్రతను అథోస్థిర బిందువుగా గుర్తిస్తారు. మరిగే నీటి ఉష్ణోగ్రతను ఊర్ధ్వస్థిర బిందువుగా గుర్తిస్తారు. దీనిద్వారా ఉష్ణమాపకాన్ని క్రమాంకణం చేస్తారు.

సెల్సియస్ ఉష్ణోగ్రతా మానంలో అథోస్థిర బిందువు 00C. ఊర్ధ్వస్థిరబిందువు 1000C

ఫారన్‌హీట్ ఉష్ణోగ్రతా మానంలో అథోస్థిర బిందువు 320F. ఊర్ధ్వస్థిరబిందువు 2120F

కెల్విన్ ఉష్ణోగ్రతా మానంలో అథోస్థిర బిందువు 2720K. ఊర్ధ్వస్థిరబిందువు 3730K

రాయమర్ ఉష్ణోగ్రతా మానంలో అథోస్థిర బిందువు 00R. ఊర్ధ్వస్థిరబిందువు 800R

వివిధ ఉష్ణోగ్రతా మానాల మధ్య సంబంధాన్ని క్రిందిఫార్ములా ద్వారా చూపవచ్చు.

C/100RF–32/180R K - 273/100R R/80

సెల్సియస్‌లో ఉన్న ఉష్ణోగ్రతా విలువను ఫారన్‌హీట్‌లోకి మార్చడానికి ఉపయోగించే సూత్రంR FR(CG32)5/9

సెల్సియస్‌లో ఉన్న ఉష్ణోగ్రతా విలువను కెల్విన్‌లోకి మార్చడానికి ఉపయోగించే సూత్రంR KRCG273

కెల్విన్‌లో ఉన్న ఉష్ణోగ్రతా విలువను సెల్సియస్‌లోకి మార్చడానికి ఉపయోగించే సూత్రంR CRK - 273

ఫారన్‌హీట్‌లో ఉన్న ఉష్ణోగ్రతా విలువను సెల్సియస్‌లోకి మార్చడానికి ఉపయోగించే సూత్రంR CR(F-32)9/5

సెల్సియస్, ఫారన్‌హీట్ మానాలు –400వద్ద సమానంగా ఉంటాయి.

కెల్విన్‌మానాన్ని 'పరమ ఉష్ణోగ్రత మానం' అని అంటారు. దీనిలో వస్తువు ఉష్ణోగ్రత 0 నుంచి ధనాత్మక విలువలను మాత్రమే కలిగి ఉంటాయి.

మానవ శరీర ఉష్ణోగ్రత: సెల్సియస్ మానంలో 36.90C ఫారన్‌హీట్ మానంలో 98.40F కెల్విన్‌మానంలో 310K

వివిధరకాల ఉష్ణోగ్రతా మాపకాలు :

1.థర్మామీటర్ : మొట్టమొదట గెలిలియో 1593లో కనుగొన్నాడు.

2.పైరోమీటర్ : 3500 సెంటిగ్రేడ్‌కంటే ఎక్కువ ఉష్ణోగ్రతను కొలవడానికి పైరోమీటర్‌ను ఉపయోగిస్తారు.

3.ఆప్టికల్ పైరోమీటర్ : సూర్యుడు మరియు నక్షత్రాలలోని ఉష్ణోగ్రతలను కొలవడానికి దీనిని ఉపయోగిస్తారు.


4.బెక్‌మెన్ ఉష్ణమాపకం : దీనిని నీటి ఆవిరి ఉష్ణోగ్రతను కొలవడానికి ఉపయోగిస్తారు.

5. పాదరస ఉష్ణమాపకం : 300C నుంచి 3500C మధ్య ఉష్ణోగ్రతలను కొలవడానికి ఉపయోగిస్తారు. దీనిలో పాదరసాన్ని ఉపయోగించుట వలన దీనికి పాదరస ఉష్ణమాపకం అంటారు.పాదరసం ఘనీభవన ఉష్ణోగ్రత–390C, భాష్పీభవన ఉష్ణోగ్రత 3570C

6.థర్మోకపుల్ : సూక్ష్మక్రిముల శరీర ఉష్ణోగ్రతను కొలవడానికి ఉపయోగిస్తారు.దీనిని ఉష్ణవిద్యుత్ ఉష్ణమాపకంగా పిలుస్తారు.

7. క్రయోథర్మోమీటర్ : అతితక్కువ ఉష్ణోగ్రతలను కొలిచే పరికరం.

8.అయస్కాంత థర్మోమీటర్ : పరమశూన్య ఉష్ణోగ్రతను




కొలవడానికి ఉపయోగిస్తారు.

9.ప్రయోగశాల థర్మోమీటర్ : పదార్థాల ఉష్ణోగ్రతలను కొలవడానికి ఉపయోగిస్తారు.

10.థర్మిష్టర్ థర్మామీటర్ : పసిపిల్లల, కీటకాల శరీర ఉష్ణోగ్రతలను కొలవడానికి ఉపయోగిస్తారు.

11.ఆల్కహాల్ థర్మామీటర్ : అతిశీతల ఉష్ణోగ్రతలను కొలవడానికి ఉపయోగిస్తారు. దీనిలో ఆల్కహాల్‌ను ఉపయోగించుట వలన దీనికి ఆల్కహాల్ థర్మామీటర్ అని పేరు. దీని ఘనీభవన ఉష్ణోగ్రత –1190C. దీని వ్యాకోచం పాదరసం కంటే ఎక్కువ. ఆల్కహాల్‌కు రంగులు కలిపి



వాడటం వలన స్పష్టత ఎక్కువగా ఉంటుంది.

12.సిక్స్ గరిష్ట కనిష్ట ఉష్ణమాపకం : ఒక రోజులో నమోదు అయ్యే అత్యధిక, అత్యల్ప ఉష్ణోగ్రతను కొలవడానికి ఉపయోగిస్తారు.దీనిలో ఉష్ణమాపక ద్రవాలుగా ఆల్కహాల్, పాదరసం ఉపయోగిస్తారు.రోజువారీ ఉష్ణోగ్రతలను సిక్స్ గరిష్ట కనిష్ట ఉష్ణమాపకం ద్వారా తెలుసుకొంటారు. ప్రపంచంలో అత్యధిక ఉష్ణోగ్రత 580జ 1922వ సంవత్సరంలో ఆఫ్రికాలోని లిబియాలో నమోదయ్యింది.

13.జ్వరమానిని : మానవుల శరీర ఉష్ణోగ్రతను తెలుసుకోవడానికి జ్వరమానినిని ఉపయోగిస్తారు.ఇందులో విలువలు సెంటిగ్రేడ్‌లో 350C - 430C వరకూ మరియు ఫారన్‌హీట్‌లో 950F - 1100F గుర్తించబడి ఉంటాయి.దీనిలో పాదరసం ఉపయోగిస్తారు.

పాదరసం పర్యావరణానికి హానికరమైనది కావడంతో జపాన్, అమెరికా వంటి దేశాలలో థర్మామీటర్‌లలో పాదరసాన్ని నిషేదించడం జరిగింది. పాదరసం వలన ఆ ప్రాంతాలలోని ప్రజలకు 'మినిమేటా' అనే వ్యాధి వస్తుంది. పాదరస థర్మామీటర్ కంటే ఆల్కహాల్ థర్మామీటర్ శ్రేష్ఠమైంది. అతి తక్కువ ఉష్ణోగ్రతలను నమోదు చేయడానికి ఆల్కహాల్ థర్మామీటర్‌ను ఉపయోగిస్తారు.

పాదరసం ఉత్తమ ఉష్ణవాహకం, మెరిసే గుణం వలన తేలికగా గుర్తించవచ్చు, వ్యాకోచ గుణం గాజుకంటే ఏడురెట్లు ఎక్కువ. ఇది గాజుకు అంటుకోకుండా ఉంటుంది. ఇది అధికసాంద్రత 13.6గ్రాములు/సిసి కలిగిఉంటుంది. అందుకే దీనిని వివిధ ఉష్ణమాపకాలలో ఉపయోగిస్తున్నారు. కానీ పాదరసం అతితక్కువ, అతి ఎక్కువ ఉష్ణోగ్రతల వద్ద ఉపయోగపడదు ఇది పర్యావరణానికి హానికరమైనది.

నీటి అసంగత వ్యాకోచం : నీటి ఉష్ణోగ్రతను 40సెంటీగ్రేడ్ నుంచి 00 సెంటీగ్రేడ్ వరకు తగ్గిస్తే అది సంకోచించకుండా వ్యాకోచిస్తుంది. దీనిని నీటి అసంగత వ్యాకోచం అంటారు. స్వచ్ఛమైన నీటికి 40సెంటీగ్రేడ్‌వద్ద కనిష్టమైన ఘనపరిమాణం, గరిష్టమైన సాంద్రత ఉంటుంది. అందువలన మంచు సాంద్రత కంటే నీటి సాంద్రత ఎక్కువ. నీటి అసంగత వ్యాకోచం వలన చలికాలంలో వాహనాల్లోని రేడియేటర్లు పగిలిపోతాయి. దీనిని నివారించడానికి పైపుల ఉపరితలంపై నల్లని పూతపూస్తారు. దీని నివారణకు 'ఇథైల్ గ్లైకాల్' qఅను ద్రావణాన్ని ఉపయోగిస్తారు. శీతాకాలంలో సముద్రాలు, సరస్సులపైభాగం గడ్డకట్టినప్పటికీ అడుగు భాగంలలో నీరు 40 సెంటీగ్రేడు వద్ద ఉంటుంది. దీని వలన శీతల ప్రదేశాలలో జలచరాలు జీవించగలుగుతున్నాయి. ★

ఉద్యోగాలు

సీఈఈఆర్‌ఐలో 20 'సైంటిస్ట్' పోస్టులు

సెంట్రల్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లోసైంటిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను కోరుతోంది.

పోస్టుల పేరు-ఖాళీలు : సైంటిస్ట్–16బీ సీనియర్ సైంటిస్ట్–2బీ ప్రిన్సిపల్ సైంటిస్ట్–2.

వేతనం : సైంటిస్ట్ పోస్టులకు రూ.77,178బీ సీనియర్ సైంటిస్ట్‌కు–రూ.89,832బీ ప్రిన్సిపల్ సైంటిస్ట్‌కు–రూ.1,35,090.

అర్హతలు : సంబంధిత పోస్టులను అనుసరించి బీఈ/బీటెక్ ం ఎంబీఏ/ ఎంఈ/ఎంటెక్/ఎంబీఏ/ఎంఎస్సీ. దీంతోపాటు నిబంధనల మేర ఉద్యోగానుభవం, సంబంధిత విభాగాల్లోని ప్రత్యేకాంశాలపై నైపుణ్యం.

వయోపరిమితి : 2017 సెప్టెంబర్ 11 నాటికి సైంటిస్ట్ పోస్టులకు 32 ఏళ్లు, సీనియర్ సైంటిస్ట్–37 ఏళ్లు, ప్రిన్సిపల్ సైంటిస్ట్‌కు 45 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్ కేటగిరీ అభ్యర్థులకు నిబంధనలు అనుసరించి వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

ఎంపిక విధానం : ఎగ్జామినేషన్/ఇంటర్వ్యూ.

దరఖాస్తు ఫీజు : రూ.100బీ ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూడీ/మహిళ/సీఎస్ఐఆర్ ఉద్యోగులు/విదేశీ అభ్యర్థులకు ఫీజు లేదు.

దరఖాస్తు విధానం : ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

దరఖాస్తు పంపాల్సిన చిరునామా : కంట్రోలర్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్, సీఎస్ఐఆర్–సెంట్రల్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, పిలానీ–333031, రాజస్థాన్.

దరఖాస్తులు చేరడానికి చివరి తేదీ : సెప్టెంబర్ 11, 2017.

వెబ్‌సైట్ : www.ceeri.res.in

జేఎన్‌టీబీజీఆర్‌ఐలో 46 పోస్టులు

జవహర్ లాల్ నెహ్రూ ట్రాపికల్ బొటానిక్ గార్డెన్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (జేఎన్‌టీబీజీఆర్ఐ)లో జూనియర్ ప్రాజెక్ట్ ఫెలోషిప్స్ కు దరఖాస్తులను కోరుతోంది.

ఖాళీలు : జూనియర్ ప్రాజెక్ట్ ఫెలో(జేపీఎఫ్): బోటనీ–21; బయోటెక్నాలజీ/బయో ఇన్ఫర్మేటిక్స్–2, కెమిస్ట్రీ/బయోకెమిస్ట్రీ/అనలిటికల్ కెమిస్ట్రీ–4, మైక్రోబయాలజీ/ఇంటిగ్రేటెడ్ బయోలజీ–2, జువాలజీ/వైల్డ్ లైఫ్ బయాలజీ–1బీ ప్రాజెక్ట్ అసిస్టెంట్ (పీఏ): బోటనీ/అగ్రికల్చర్/హార్టికల్చర్–13బీ కంప్యూటర్ అసిస్టెంట్ (బోటనీ)–2బీ సిస్టం అడ్మినిస్ట్రేటర్–1.

విద్యార్హత : జేపీఎఫ్‌కి ఫస్ట్ క్లాస్ పీజీ. పీఏకి ఫస్ట్ క్లాస్ బీఎస్సీ. కంప్యూటర్ అసిస్టెంట్ (బోటనీ)కి ఫస్ట్ క్లాస్ బీఎస్సీతోపాటు పీజీడీసీఏ/డీసీఏ. సిస్టం అడ్మినిస్ట్రేటర్‌కి ఫస్ట్ క్లాస్ బీటెక్(కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్). అన్ని పోస్టులకూ ఉద్యోగానుభవం ఉండాలి.

స్టైపెండ్ : జేపీఎఫ్‌కి రూ.22,000; పీఏ, కంప్యూటర్ అసిస్టెంట్‌కి రూ.19,000; సిస్టం అడ్మినిస్ట్రేటర్‌కి రూ.25,000.

వయసు : 2017 జనవరి 1 నాటికి 36 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్ అభ్యర్థులకు సడలింపు ఉంటుంది.

ఎంపిక విధానం : ఇంటర్వ్యూ.

దరఖాస్తు విధానం : నిర్దేశిత నమూనాలో దరఖాస్తు పూర్తిచేసిబీ విద్యార్హత తదితర ధ్రువీకరణ పత్రాల నకళ్లను జతచేసి ఇంటర్వ్యూ రోజు ఇవ్వాలి.

ఇంటర్వ్యూ తేదీలు : ఆగస్టు 22, 23, 24.

వెబ్‌సైట్ : www.jntbgri.res.in ★

సెన్సెక్స్ 259 32,014 | నిఫ్టీ 79 9,978 | రూపాయి 18 పైసలు ఒక అమెరికా డాలరుకు రూ. 63.63

మైలాన్ నుంచి 'హెచ్‌ఐవి' ఔషధం

ప్రజాశక్తి – బిజినెస్ బ్యూరో

మైలాన్ ఫార్మాస్యూటికల్ ప్రయివేటు లిమిటెడ్‌కు చెందిన సబ్సిడరీ కంపెనీ మైలాన్ ఎన్‌వి హెచ్‌ఐవి నివారణకు అంటిరెట్రోవైరల్ (ఎఆర్‌వి) ఔషదం అవొంజాను అభివృద్ధి చేసింది. దీనికి డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా (డిసిజిఐ) గుర్తింపునిచ్చినట్లు ఆ కంపెనీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది.

స్వల్పంగా తగ్గిన బంగారం


న్యూఢిల్లీ : అంతర్జాతీయ పరిణామాలకు తోడు స్థానిక వర్తకుల నుంచి డిమాండ్ తగ్గడంతో మంగళవారం పసిడి ధరల్లో స్వల్ప తగ్గుదల చోటు చేసుకుంది. న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం, 99.5 శాతం స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.70 తగ్గి వరుసగా రూ.29,350, రూ.29,200గా పలికింది. మరోవైపు కిలో వెండిపై రూ.45 పెరిగి రూ.38,370 వద్ద ముగిసింది. 100 వెండి నాణేల ధర యథాతథంగా రూ.72,000గా నమోదయ్యింది.

మార్కెట్లపై 'డొల్ల' దెబ్బ

- సెన్సెక్స్ 259 పాయింట్ల పతనం
- 10 వేల దిగువన నిఫ్టీ

ముంబయి : కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన డొల్ల కంపెనీల జాబితా మంగళవారం నాడు మార్కెట్లను కుదిపేసింది. ఈ కంపెనీల లావాదేవీలను నెల పాటు నిలిపి వేయాలని సెబీ స్టాక్ ఎక్స్చేంజీలకు ఆదేశాలు జారీ చేయడంతో సూచీలు దిగజారిపోయాయి. దీనికి తోడు ఆయిల్ అండ్ గ్యాస్, బ్యాంకింగ్ రంగాల్లో మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో మార్కెట్లు మరింత నష్టాల పాలయ్యాయి. ఈ నేపథ్యంలోనే మంగళవారం బిఎస్ఇ సెన్సెక్స్ 300 పాయింట్ల మేర పతనమయ్యింది. మరోవైపు బ్యాంకింగ్ సూచీల్లో మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపారు. దీంతో నిఫ్టీ ఏకంగా 10వేల దిగువకు జారింది. సెబీ చర్య మార్కెట్లకు మింగుడు పడలేదని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. ఈ పరిణామాల మధ్య బిఎస్ఇ సెన్సెక్స్ 259.48 పాయింట్లు లేదా 0.8 శాతం కోల్పోయి 32,014.19కు పడిపోయింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 78.85 పాయింట్లు లేదా 0.78 శాతం పతనమై 9,978.55 వద్ద ముగిసింది. బిఎస్ఇలో రంగాల వారిగా రియాల్టీ సూచీ అత్యధికంగా 4.53 శాతం నష్టపోయింది. ఇదే క్రమంలో ఆయిల్ అండ్ గ్యాస్ 2.16 శాతం, పిఎస్‌యు 2.08 శాతం, విద్యుత్ 1.88 శాతం చొప్పున పతనమై మార్కెట్లపై ఒత్తిడిని పెంచాయి. కాగా ఒక్క లోహ సూచీ మాత్రమే 1.63 శాతం పెరిగింది. సెన్సెక్స్‌లో డాక్టర్ రెడ్డీస్ 4.91 శాతం, కోల్ ఇండియా 2.67 శాతం, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా 2.33 శాతం, ఐటిసి 2.07 శాతం, ఐసిఐసిఐ బ్యాంకు 1.7 శాతం చొప్పున అధిక నష్టాలు చవి చూసిన వాటిలో టాప్‌లో ఉన్నాయి. మరోవైపు టాటా స్టీల్ 2.63 శాతం, సిప్లా 2.32 శాతం, బజాజ్ ఆటో 0.82 శాతం, భారతీ ఎయిర్‌టెల్ 0.31 శాతం, హెచ్‌యుఎల్ 0.17 శాతం చొప్పున అధిక లాభాలు సాధించిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. ఇంతక్రితం సెషన్‌లో విదేశీ సంస్థాగత మదుపర్లు రూ.199.21 కోట్ల ఈక్విటీలు కొనుగోలు చేశారు. దేశీయ మదుపర్లు రూ.308.15 కోట్ల విలువ చేసే ఈక్విటీలు కొనుగోలు చేశారు. గత కొద్ది రోజులుగా వరుసగా పెరిగిన బ్యాంకింగ్ సూచీల్లో మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపారు. ప్రస్తుత ఏడాదిలో ఇప్పటి వరకు బ్యాంకింగ్ సూచీ 23 శాతం పెరిగింది. ఈ క్రమంలోనే అమ్మకాల ఒత్తిడితో యస్ బ్యాంకు, ఎస్‌బిఐ, పిఎన్‌బి, బ్యాంకు ఆఫ్ బరోడా సూచీలు రెండు శాతం పైగా విలువ కోల్పోయాయి. యాక్సిస్ బ్యాంకు, కెనరా బ్యాంకు, ఫెడరల్ బ్యాంకు, ఐసిఐసిఐ బ్యాంకు కొటాక్ మహీంద్రా బ్యాంక్ సూచీలు ఒక్క శాతం పైగా నష్టపోయాయి.

331 కంపెనీలపై సెబీ కొరడా



ముంబయి : మార్కెట్ నియంత్రణ సంస్థ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్చేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) 331 లిస్టెడ్ కంపెనీల లావాదేవీలను నెల రోజుల పాటు నిలిపియాలని నిర్ణయించింది. ఈ మేరకు బిఎస్ఇ సెన్సెక్స్, ఎన్ఎస్ఇ నిఫ్టీ, మెట్రపాలిటన్ స్టాక్ ఎక్స్చేంజ్‌లకు సెబీ ఆదేశాలు జారీ చేసింది. కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈ కంపెనీలను డొల్ల కంపెనీలుగా అనుమానిస్తూ ఒక జాబితాను రూపొందించింది. నెలకు ఒక్క రోజు మాత్రమే ట్రేడింగ్‌కు అవకాశం ఉండే స్టేజ్–4 గ్రేడెడ్ సర్వీలెన్స్ మెజర్ (జిఎస్ఎం)లో ఈ కంపెనీలను చేర్చాలని సూచించింది. దీంతో ప్రతి నెలలో తొలి సోమవారం మాత్రమే వీటిని ట్రేడింగ్‌కు అనుమతివ్వనున్నారు. అవసరమైతే ఆయా కంపెనీలపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలని కూడా సెబీ ఆదేశించింది. అదే విధంగా మోసపూరిత కంపెనీలకు సహకరిస్తున్న 26 మంది చార్టర్డ్ ఎకౌంటెంట్లపై విచారణ చేపడుతున్నట్లు ఓ అధికారి తెలిపారు.

20 వేల హైదరాబాద్ కంపెనీలపై వేటు

న్యూఢిల్లీ : దీర్ఘకాలికంగా ఎలాంటి కార్యకలాపాలు నిర్వర్తించకుండా హవాలా లావాదేవీలు నడుపుతున్న కంపెనీలపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మెఘ్వాల్ తెలిపారు. దేశ వ్యాప్తంగా 1.62 లక్షలకు పైగా కంపెనీలను డీరిజిస్ట్రర్ చేసినట్టు వెల్లడించారు. ఇలాంటివి అత్యధికంగా ముంబయి, ఢిల్లీ, హైదరాబాద్ కేంద్రాలుగా పని చేస్తున్నాయని మంగళవారం రాజ్యసభకు ఆయన లిఖితపూర్వకంగా తెలిపారు. కాగా ఇందులో హైదరాబాద్‌లో 20,588 కంపెనీలు ఉన్నట్లు తెలిపారు. ముంబయిలో 33,000, ఢిల్లీలో 22,863 కంపెనీలను రద్దు చేశామన్నారు. ఈ కంపెనీలు ఎలాంటి వ్యాపార కార్యకలాపాలు నిర్వర్తించడం లేదన్నారు. ఆర్‌ఒసికి కంపెనీస్ యాక్ట్ 2013 సెక్షన్ 248కి కల్పించిన అధికారాల కింద వివిధ అంశాలను పరిగణలోకి తీసుకొని రిజిస్ట్రర్ నుంచి కంపెనీ పేరును తొలగించే హక్కు ఉంటుందన్నారు.

పోలీస్ పహారాలో 'వంశధార' పనులు

కొనసాగుతున్న పోలీస్ పికెట్లు

ప్రజాశక్తి- హిరమండలం, శ్రీకాకుళం సిటీ

శ్రీకాకుళం జిల్లా హిరమండలంలో వంశధార జలాశయం నిర్మాణ పనులు పోలీసుల పహారాలో మంగళవారం పునఃప్రారంభమయ్యాయి. జలాశయం గట్టు నిర్మాణానికి 'వై' ప్రాంతంలో తులగాం గెడ్డ గట్టును కలిపేందుకు మట్టి పూడ్చే పనులను అధికారులు చేపట్టారు. తులగాం నిర్వాసిత గ్రామం సమీప భూముల్లో మట్టి తవ్వకాలు జరిపి నిర్మాణ పనుల కోసం వినియోగిస్తున్నారు. మరోపక్క నిర్వాసిత గ్రామాల రహదారుల్లో పోలీస్ పికెట్లు కొనసాగుతున్నాయి. సమస్యలు పరిష్కరించకుండా పనులు చేపడుతుండడాన్ని నిర్వాసితులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ నేపథ్యంలో నిర్వాసితుల నుంచి పనులకు ఆటకం కలగకుండా ఉండేందుకు రహదారులను ఇనుప ముళ్ల కంచెతో పోలీసులు నిర్బంధం చేశారు. గ్రామాల పొలిమేరల్లో పహారా కాస్తున్నారు. డ్రోన్ కెమెరాలతో నిర్వాసిత గ్రామాల్లో నిర్వాసితుల కదలికలపై నిఘా ఏర్పాటు చేశారు.

నిర్వాసితులకు న్యాయం చేయాలి

వంశధార నిర్వాసితుల సమస్యలు పరిష్కరించి, వారికి న్యాయం చేయాలని అఖిలపక్ష పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిర్వాసిత గ్రామాల్లో మోహరించిన పోలీస్ బలగాలను ఉపసంహరించుకోవాలన్నారు. వంశధార నిర్వాసితులపై పోలీసు నిర్బంధాన్ని ఖండిస్తూ అఖిలపక్ష పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యాన శ్రీకాకుళం నగరంలోని ఎన్‌జిఒ హోంలో మంగళవారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు పనులు ప్రారంభమై 13 ఏళ్లు పూర్తయినా, 15 శాతమైనా పునరావాసం పూర్తి కాలేదని తెలిపారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం కొత్తగా నోటిఫికేషన్ ఇచ్చి, పునరావాసం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పునరావాస కల్పనలో ప్రభుత్వ యంత్రాంగం విఫలమైందన్నారు. న్యాయస్థానాలను తప్పుదోవ పట్టిస్తూ పోలీసు నిర్బంధంతో



పోలీస్ పహారాలో చేపడుతున్న పనులు

నిర్వాసితులను గ్రామాల నుంచి ఖాళీ చేయించే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి భవిరి కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వైసిపి జిల్లా అధ్యక్షులు రెడ్డి శాంతి, పిసిసి అధికార ప్రతినిధి ఆర్.నరసింహమూర్తి, సిపిఎం సీనియర్ నాయకులు చౌదరి తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు

దేవరపల్లి ఆదర్శం

పర్చూరు సంఘీభావ సదస్సులో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు

ప్రజాశక్తి-ఒంగోలు టౌన్

దళితుల భూములను ఆక్రమించుకోవాలనుకునే వారి ఆటలను ఇకమీదట సాగనీవ్వబోమనీ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు హెచ్చరించారు. దేవరపల్లి ఉద్యమాన్ని భూములు కోల్పోతున్న దళితులు ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. దేవరపల్లి దళితుల భూ సాధన సంఘీభావ సదస్సు మంగళవారం పర్చూరులోని కళ్యాణ మండపంలో జరిగింది. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పెంట్యాల హనుమంతరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో పి.మధు ముఖ్యవక్తగా పాల్గొని మాట్లాడారు. సుదీర్ఘ పోరాటానికి ఫలితం దక్కిందన్నారు. దేవరపల్లి దళితులపై దాడి ప్రారంభమైనపుడు వారి ఉద్యమానికి అఖిలపక్షం, ప్రజాసంఘాలు మద్దతుగా నిలిచాయన్నారు. వచ్చే నాలుగు రోజులలో కుంటను పూడ్చే బాధ్యత కూడా మంత్రి ఆనందబాబు తీసుకోవాలన్నారు. ఈ నియోజకవర్గంలో మరో ఏడు గ్రామాలల్లో దళితుల భూములను నీరు-కుంట పేరుతో ఆక్రమించారనీ, ఆ గ్రామాల్లో కూడా దళితుల పోరాటం మొదలవ్వాలనీ పిలుపునిచ్చారు. ఈ పోరాటం కోసం ముందుగా ఈ గ్రామాలలో అఖిలపక్షం పాదయాత్రలు చేపడతుందన్నారు. అధికారులు, పోలీసులు ప్రభుత్వం పక్షాన కాకుండా దళితుల పక్షాన నిలబడాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కె అరుణ కోరారు. అభివృద్ధికి కొలమానం దోచుకోవడమేనంటూ అర్థాన్ని ఈ పాలకులు మార్చేశారని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి చిటిపాటి వెంకటేశ్వర్లు విమర్శించారు. దేవరపల్లి దళితుల భూమిలో కుంట తవ్వడం పై తప్పు ఎవ్వరిదో మంత్రి ఆనంద్‌బాబు చెప్పాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు శింగరాజు వెంకట్రావు డిమాండ్ చేశారు. దేవరపల్లి దళితులు సాధించిన విజయం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు ఓ గుణపాఠం కావాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఈదా సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పూనాటి ఆంజనేయుల, దేవరపల్లి దళితుల భూసాధన సంఘీభావకమిటి అధ్యక్షులు షంషేర్ అహ్మద్, వివిధ ప్రజా సంఘాల, దళిత సంఘాల నాయకులు మాట్లాడారు.

సిపిఎంలో 52 కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి-విఆర్ పురం (తూర్పుగోదావరి)

విఆర్‌పురం మండలంలోని విఆర్ పురం, వడ్డిగూడెం, వడ్డిగూడెం కాలనీ గ్రామాల్లోని టిడిపి, కాంగ్రెస్ పార్టీలకు చెందిన 52 కుటుంబాల వారు సోమవారం భద్రాచలం ఎంఎల్‌ఎ సున్నం రాజయ్య సమక్షంలో సిపిఎంలో చేరారు. వీరంతా ఆయా పార్టీల వైఖరిపై విసిగిపోయినట్లు తెలిపారు. సిపిఎం పేద ప్రజల పక్షాన సాగిస్తున్న పోరాటాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వారందరికీ ఎంఎల్ఎ సున్నం రాజయ్య వారికి సిపిఎం కండువాను కప్పి సాదరంగా ఆహ్వానించారు. సిపిఎంపై ఎంతో నమ్మకంతో పార్టీలో చేరిన కుటుంబాల వారందరికీ పార్టీ ఎల్లవేళలా వెన్నంటి ఉంటుందని రాజయ్య హామీ ఇచ్చారు. పోలవరం ప్రాజెక్టు విషయంలో చంద్రబాబు ప్రభుత్వం విలీన మండలాల ప్రజలకు తీవ్ర అన్యాయం చేయడానికి చూస్తోందని రాజయ్య తెలిపారు. బాధితులందరికీ పరిహారం వచ్చే వరకూ గ్రామాలను ఖాళీ చేసి వెళ్లే ప్రసక్తే లేదని, బాధితుల వెన్నంటే సిపిఎం ఉంటుందని రాజయ్య తెలిపారు.

డిటెన్షన్ విధానానికి వ్యతిరేకంగా ఉద్యమం

ప్రజాశక్తి- బొబ్బిలి (విజయనగరం జిల్లా)

విద్యా రంగంలో డిటెన్షన్ విధానానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తామని యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.విజయగౌరి తెలిపారు. 'విద్యారంగం-డిటెన్షన్ విధానం-తీవ్ర ప్రభావం' అనే అంశంపై విజయనగరం జిల్లా బొబ్బిలిలోని ఎన్‌జిఒ హోమ్‌లో యుటిఎఫ్ ఆధ్వర్యాన మంగళవారం సదస్సు జరిగింది. ఇందులో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ నూతన విద్యా విధానం-2016 పేరుతో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ముసాయిదాలో డిటెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని ప్రకటించడం అన్యాయమన్నారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పి.మధుసూదనరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో యూనియన్ నాయకులు వి.ప్రసన్న కుమార్ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సిపిఐ (ఎంఎల్) ధర్నా

ప్రజాశక్తి- నర్సీపట్నం, విశాఖపట్నం

బడుగు, బలహీన వర్గాల ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం విశాఖజిల్లా నర్సీపట్నం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్సు నుంచి ఆర్‌డిఒ కార్యాలయం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ(ఎంఎల్) రాష్ట్రకార్యదర్శి బుగత బంగార్రాజు మాట్లాడుతూ దళితులు, గిరిజనుల స్వాధీనంలో ఉన్న భూములు, ఇళ్లకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీలో జ్వరమరణాలపై ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని, ప్రకటనకే పరిమితమైన హెల్త్‌ఎమర్జెన్సీని పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు మెరుగైన సేవలందిచాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో పార్టీ జిల్లా కార్యదర్శి కె.జనార్ధన్, గిరిజన సంఘం నాయకులు చంటిబాబు, కండిపల్లి నాగేశ్వరరావు, అప్పారావు, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి హైర్ బస్ డ్రైవర్ల నిరాహార దీక్ష

ప్రజాశక్తి-మద్దిలపాలెం, విశాఖ

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపిఎస్‌ఆర్‌టిసి హైర్ బస్ డ్రైవర్లు మంగళవారం మద్దిలపాలెం డిపో ఎదురుగా రిలే నిరాహార దీక్షను ప్రారంభించారు. ఈ దీక్షను సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైర్ బస్ డ్రైవర్లకు కనీస వేతనాలు అందజేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, పిఎఫ్, ఇఎస్ఐ, కనీస పనిగంటలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. హైర్ బస్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు ఎన్.రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, నర్సీపట్నం డిపోలో అక్రమంగా తొలగించిన డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలని, ఆర్‌టిసి నియామకాల్లో హైర్ బస్ డ్రైవర్లకు అవకాశం కల్పించాలని, బోనస్, యూనిఫాం అందించాలని డిమాండ్ చేశారు.

కొనసాగుతున్న వ్యవసాయ విద్యార్థుల ఆందోళన

ప్రజాశక్తి-బాపట్ల

గుంటూరు జిల్లా బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆందోళన ఉధృతమవుతోంది. విద్యార్థులు చేస్తున్న ఆందోళన ఆరో రోజుకు చేరుకొంది. మంగళవారం కళాశాల ప్రధాన ద్వారం వద్ద విద్యార్థులు అధ్యాపకులను కళాశాల లోనికి వెళ్లనివ్వకుండా అడ్డుకున్నారు. వ్యవసాయ విద్యలో అర్హులు కానివారికి ఉద్యోగాలివ్వడమే గాక వారి ఉద్యోగన్నతుల కోసం ఇచ్చిన జీవో 64ను రద్దుచేయాలని నినదించారు. వ్యవసాయ విశ్వ విద్యాలయం డీన్ టి.రమేష్ బాబుతో చర్చలు జరిపినా ప్రయోజనం లేకుండాపోయిందని పలువురు విద్యార్థులు చెప్పారు. గత 11 రోజులుగా నిరసన తెలుపుతున్నప్పటికీ కళాశాల అధికారులు పట్టించుకోక పోవడంతో ఆరు రోజులుగా తరగతులను బహిష్కరిస్తున్నామన్నారు.

ప్రజ్ఞ

జవాబులు

1. అసోం
2. పశ్చిమబెంగాల్
3. ఆగస్టు 7, 4. అపర్ణ
5. రాజీవ్ కుమార్

గరగపర్రులో 173 కుటుంబాలకు పరిహారం

• అందజేసిన కలెక్టర్ • అందరికీ న్యాయం చేయాలని దళితుల డిమాండ్

ప్రజాశక్తి-పాలకోడేరు

సాంఘిక బహిష్కరణకు గురైన పశ్చిమగోదావరి జిల్లా గరగపర్రు దళితుల్లో 173 కుటుంబాలకు ఎట్టకేలకు ప్రభుత్వం పరిహారం అందజేసింది. 230 కుటుంబాలకు రూ.2.30 కోట్లు పరిహారంగా ఎస్‌సి కార్పొరేషన్ నిధులు విడుదల చేసింది. దీనిలో భాగంగా 173 కుటుంబాలకు రూ.కోటీ 73 లక్షలు జిల్లా కలెక్టర్ కాటంనేని భాస్కర్, స్థానిక ఎంఎల్‌ఎ వేటుకూరి వెంకట శివరామరాజు ఆధ్వర్యాన మంగళవారం పంపిణీ చేశారు. దళితుల్లో చీలిక రావడంతో పరిహారం పంపిణీ గందరగోళంగా తయారైంది. గరగపర్రులోని చినపేటలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఒక గ్రూపునకు పరిహార చెక్కులను కలెక్టర్, ఎంఎల్‌ఎ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ భాస్కర్ మాట్లాడుతూ.. సుమారు 50 కుటుంబాలు బిసి-సి సర్టిఫికెట్ కలిగి ఉన్నారని, వీరు ఎస్‌సిలుగా ఆధారం చూపిస్తే పరిహారం అందిస్తామని చెప్పారు. రేషన్‌కార్డులు లేకపోతే పరిహారం ఇవ్వడం కుదరదని స్పష్టం చేశారు. స్థానిక దళితుడు సిరింగుల రత్నం అన్ని కుటుంబాలకూ నష్టపరిహారం చెలించాలని కోరారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ తాను రాజకీయ నాయకుడిని కాదని, చేసేదే చెబుతానని వ్యాఖ్యానించారు. స్థానికంగా జరిగిన ఘటనను అడ్డుపెట్టుకుని కొంతమంది డబ్బులు వసూలు చేస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని, అంతా కలిసిమెలిసి ఉండాలని కోరారు. ఎంఎల్‌ఎ శివరామరాజు మాట్లాడుతూ ప్రభుత్వం అండంగా ఉందని, లేనిపోని అపోహలు పెంచుకోవద్దని అన్నారు.

కలెక్టర్ కారు అడ్డగింత

చెక్కుల పంపిణీ అనంతరం కలెక్టర్ వెనుదిరిగారు. ఆయన కారును అంబేద్కర్ కాలనీ దళితులు వంతెనపై



దళితులకు చెక్కులు అందిస్తున్న కలెక్టర్ భాస్కర్

బైఠాయించి అడ్డుకున్నారు. తమకు పూర్తి న్యాయం చేయాలని నినదించారు. పోలీసులు కలెక్టర్ కారును యనమదుర్రు కాలువ గట్టుపై నుంచి యండగండి పంపారు. కలెక్టర్ భాస్కర్ సబ్ కలెక్టర్ కారులో తాడేపల్లిగూడెం రోడ్డు మీదుగా యండగండి చేరుకున్నారు. దళితుల ఆందోళనకు కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గొర్ల రామకృష్ణ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి సంఘం నాయకులు ఎ.రాజు సంఘీభావం తెలిపి ఆందోళనలో పాల్గొన్నారు. ఎంఎల్‌ఎ శివరామరాజు, ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సభ్యులు దాసరి ఆంజనేయులు దళితులతో మాట్లాడి సర్దిచెప్పారు.

అంబేద్కర్ కాలనీ దళితులకు చెక్కుల పంపిణీ

అనంతరం గరగపర్రులోని చర్చిలో అంబేద్కర్ కాలనీ దళితులకు పరిహారం చెక్కులను అధికారులు అందజేశారు. కొంతమంది దళితులకు పరిహారం రాకపోవడంతో గందరగోళం నెలకొంది. అధికారులు వారికి నచ్చజెపి పరిహారం రాని కుటుంబాల పేర్లను సేకరించారు.

కేంద్ర ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్తా: హర్షకుమార్

రాష్ట్రప్రభుత్వం గరగపర్రు దళితులకు తీవ్ర అన్యాయం చేసిందని, నష్టపరిహారాన్ని అందరికీ ఇవ్వకుండా కొంత మందికే ఇవ్వడం దుర్మార్గమని మాజీ ఎంపీ హర్షకుమార్ అన్నారు. గరగపర్రులో పర్యటించిన ఆయన దళితులతో మాట్లాడారు.

పునరావాసం తరువాతే పోలవరం పనులు

అవగాహనా సదస్సులో భద్రాచలం ఎంఎల్‌ఎ సున్నం రాజయ్య

ప్రజాశక్తి-కూనవరం (తూర్పుగోదావరి)

గిరిజనులకు పునరావాసం కల్పించాకే పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పనులను చేపట్టాలని భద్రాచలం ఎంఎల్‌ఎ సున్నం రాజయ్య డిమాండ్ చేశారు. తూర్పుగోదావరి జిల్లా కూనవరంలోని రాజ్యలక్ష్మి కళ్యాణ మండపంలో పోలవరం నిర్వాసితులకు మంగళవారం అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సదస్సుకు జెసి మల్లికార్జునరావు, రంపచోడవరం, చింతూరు ఐటిడిఎ పిఒలు దినేష్‌కుమార్, చినబాబు హాజరయ్యారు. సదస్సులో ఎంఎల్‌ఎ రాజయ్య మాట్లాడుతూ నిర్వాసితులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలన్నారు. గిరిజన, గిరిజనేతరుల మధ్య తేడాలు చొపొద్దని, వారిద్దరికీ సమానంగా పునరావాస కేంద్రాలు ఒకేచోట ఏర్పాటు చేయాలని కోరారు. గతంలో ఎకరానికి రూ.1.15 లక్షలు ఇచ్చిన భూములకు కూడా కొత్తచట్టం ప్రకారం పరిహారం చెల్లించాలన్నారు. ఆర్ అండ్ ఆర్ పేరుతో ప్రభుత్వం తప్పుడు సర్వేలు చేయిస్తోందని, కచ్చితమైన సర్వేలు చేయించాలని కోరారు. ముందుగా



సదస్సులో మాట్లాడుతున్న సున్నం రాజయ్య

మునిగే గ్రామం బొజ్జరాయి గూడెం అని చెబుతున్నారని, అంతకుముందు 20 గ్రామాలకుపైగా మునుగుతాయని తెలిపారు. 2019 నాటికి ప్రాజెక్టు పూర్తిచేస్తామని చెబుతున్న ప్రభుత్వం, నేటికీ ఎక్కడా పునరావాసం కల్పించలేదన్నారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని రాజయ్య జెసికి అందజేశారు. ఎంపిపి కొమరం పెంటయ్య మాట్లాడుతూ.. నిర్వాసితులకు పునరావాసం కల్పించడంలో ప్రభుత్వం తీవ్రజాప్యం చేస్తోందన్నారు. సారవంతమైన భూములు కోల్పోయామని, రాళ్ల భూమి అంటగట్టాలని ప్రభుత్వం చూస్తోందని చెప్పారు. జెసి మల్లికార్జునరావు మాట్లాడుతూ.. పోలవరం ప్రాజెక్టు కింద మునిగిపోయే ప్రాంతాల నిర్వాసితులను అన్ని విధాలా ఆదుకుంటామన్నారు.

టిటిడి కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఈనెల 15తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి నిరసన తెలియజేస్తామని ఎంఎల్‌సి యండపల్లి శ్రీనివాసులురెడ్డి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళిలు పేర్కొన్నారు. తమను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ తిరుపతిలోని టిటిడి పరిపాలన భవనం వద్ద కార్మికులు చేపట్టిన దీక్షలు మంగళవారంతో 36 వ రోజుకి చేరుకుంది. కార్మికుల కుటుంబ సభ్యులు, పిల్లలు ప్లకార్డులతో 'టిటిడి ఈవో అంకుల్...కాంట్రాక్టర్ భాస్కర్‌నాయుడు తాతయ్యా... మానాన్నకు ఉద్యోగం తొలగించవద్దు- మాకు అన్నం లేకుండా చేయొద్దు' అంటూ నిరసన తెలిపారు.

ప్రజాశక్తి-తిరుపతిటౌన్

సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం

ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్

ప్రజాశక్తి - సత్యనారాయణపురం (విజయవాడ)

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి రావులపల్లి రవీంద్రనాథ్ అన్నారు. విజయవాడ గాంధీనగర్‌లోని ధర్నా చౌక్ వద్ద మంగళవారం జెఎసి ఆధ్వర్యంలో జరిగిన రెండో రోజు ధర్నాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శాంతియుత ఆందోళనతో ప్రభుత్వం స్పందించనందున ఇక నుంచి ఉధృతమైన ఆందోళనలకు రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు సమాయత్తం కావాలన్నారు. జిఒ279 వల్ల కార్మికులకు ప్రయోజనం లేదని, మున్సిపాల్టీలు, కార్పొరేషన్ల పైనే ఆర్థిక భారం పడుతోందని, కౌన్సిల్ పరిధిలో పారిశుధ్య పనుల పరిశీలనలో ఉండవని చెప్పారు. కేవలం రాష్ట్ర వ్యాప్తంగా ముగ్గురు కాంట్రాక్టర్ల ప్రయోజనాల కోసమే జిఒ 279 ఉపయోగపడుతుందని చెప్పారు. ధర్నాకు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సీనియర్ నాయకులు నెక్కంటి సుబ్బారావు, బి.సోమయ్య అధ్యక్షత వహించగా కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు కె.ఉమామహేశ్వరరావు, ఎ.రంగనాయకులు, ఎం.డేవిడ్, కిలారి మల్లేశ్వరరావు,సోమురాజు తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్మికుల ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న రవీంద్రనాథ్

నిధులొచ్చేలా చూడండి

గవర్నర్‌ను కోరిన చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్రం నుంచి రావాల్సిన నిధులొచ్చేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్‌ను కోరారు. రెండురోజుల పర్యటనలో భాగంగా విజయవాడ చేరుకున్న గవర్నర్‌తో చంద్రబాబు మంగళవారం రాత్రి మాట్లాడారు. ముఖ్యంగా విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి రావాల్సిన నిధులు వెంటనే ఇప్పించేలా చూడాలని కోరారు. అలాగే షెడ్యూల్ సంస్థల సమస్యనూ పరిష్కరించాలని కోరారు. రాష్ట్రంలో నెలకొన్న ఆర్థిక పరిస్థితి, తదితర అంశాలపై గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందిగా ఉందని, ఇదే సమయంలో కేంద్రం నుండి నిధులొస్తే కొంత వెసులుబాటు ఉంటుందని పేర్కొన్నారు. అలాగే పోలవరం విషయంలోనూ కేంద్రం మరింత చొరవ తీసుకోవాలని, రోడ్డు ప్రాజెక్టులు వెంటనే పూర్తయ్యేలా కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని కోరినట్లు తెలిసింది.రాజధాని విషయంలోనూ కేంద్రం ఇవ్వాల్సిన నిధులిస్తే సమస్య చాలా వరకూ పరిష్కారం అవుతుందని కోరారు

మద్యం దుకాణం ఏర్పాటుపై మహిళల ఆందోళన

తొలగిస్తామని ఎక్సైజ్ ఎస్ఐ హామీ

ప్రజాశక్తి-ఏలూరు అర్బన్

ప్రభుత్వ స్థలంలో మద్యం దుకాణం పెట్టడమే కాకుండా బెల్టుషాపు నిర్వహించడాన్ని నిరసిస్తూ పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు రూరల్ మండలం వెంకటాపురం పంచాయతీ పరిధి హనుమాన్‌నగర్‌లో మహిళలు మంగళవారం ఆందోళన చేశారు. నివాస ప్రాంతాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేసేందుకు ఎరకల సూరిబాబు గత మూడు నెలల్లో మూడుసార్లు ప్రయత్నించగా మహిళలు అడ్డుకున్నారు. మూడు రోజుల క్రితం మొదటిసారి దుకాణం ఏర్పాటు చేసేందుకు సిద్ధమైన ప్రాంతానికి కొన్ని అడుగుల దూరంలోనే సూరిబాబు దుకాణం ఏర్పాటు చేశాడు. మహిళలు మంగళవారం ఆ దుకాణం వద్ద బైఠాయించి నినాదాలు చేశారు. ఎక్సైజ్ ఎస్ఐ కె.కాత్యాయిని అక్కడకు చేరుకుని నిబంధనలకు అనుగుణంగానే దుకాణం కేటాయించామని చెప్పగా, మహిళలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్యం నిల్వ ఉంచిన రెండు ఇళ్లను, మరో బెల్టుషాపును ఎస్ఐకు మహిళలు చూపించారు. సిబ్బందిని పిలిపించి వాటిని తెరిచి చూడగా మద్యం నిల్వలు ఉన్నాయి. ఎస్ఐ కాత్యాయిని వాటిని దుకాణంలోకి మార్పించారు. మద్యం నిల్వలు అక్రమంగా ఉన్నప్పటికీ కేసు ఎందుకు నమోదు చేయడం లేదని ఎస్ఐను మహిళలు నిలదీశారు. దీనిపై ఎస్ఐ కాత్యాయిని ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. అనంతరం ఈ ప్రాంతంలో మద్యం దుకాణం తొలగిస్తామని ఆమె హామీ ఇచ్చారు.

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా
దీపక్‌మిశ్రా

జస్టిస్ జెఎస్ ఖేహార్ సిఫార్సుకు కేంద్రం ఆమోదం



న్యూఢిల్లీ: దేశ సర్వోన్నత న్యాయస్థానానికి తదుపరి ప్రధాన న్యాయమూర్తి(సిజెఐ)గా జస్టిస్ దీపక్ మిశ్రా(63) నియమితుల య్యారు. ఈ పదవికి దీపక్ మిశ్రా సమర్థుడని ప్రస్తుత చీఫ్ జస్టిస్ జగదీశ్ సింగ్ ఖేహార్ చేసిన ప్రతిపాదనకు కేంద్ర న్యాయమంత్రిత్వ శాఖ మంగళవారం ఆమోదం తెలిపింది. ఖేహార్ పదవీకాలం ఈనెల 27తో ముగియనున్నది. అదే రోజున రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతులమీదుగా దీపక్ మిశ్రా ప్రమాణస్వీకారం చేస్తారు. 14 నెలల పాటు(2018 అక్టోబర్ 2 వరకు) ఆయన ఈ బాధ్యతలు నిర్వర్తిస్తారు. ఒడిశా రాష్ట్రం నుంచి సిజెఐగా నియమితులైన మూడో వ్యక్తి దీపక్ మిశ్రా కావడం విశేషం. ఇంతకుముందు రంగనాథ్ మిశ్రా, గోపాల్ వల్లబ్ పట్నాయక్‌లు ప్రధాన న్యాయమూర్తిగా పని చేశారు. నిర్భయ కేసులో నిందితులకు కింది కోర్టు విధించిన మరణశిక్షను సమర్థించిన సుప్రీంకోర్టు బెంచ్‌కు దీపక్‌మిశ్రా నేతృత్వం వహించారు. అంతేకాక, 1993 ముంబయి పేలుళ్ల కేసుల్లో తనకు వేసిన ఉరి శిక్షపై స్టే విధించాలని యాకూబ్ మెమన్ చేసిన అభ్యర్థనను తోసిపుచ్చిన ధర్మాసనానికీ ఆయనే నేతృత్వం వహించారు.



పోలీసులు విడుదల చేసిన సిసిటివి ఫుటేజ్

కిడ్నాప్ కేసుపై తొందరపడం!

కర్ణిక వేధింపుల కేసులో పోలీసులు

చండీగఢ్ : హర్యానా బిజెపి అధ్యక్షుడు సుభాష్ బరాల కుమారుడు వికాస్ బరాలపై నమోదైన వేధింపుల కేసు ఎఫ్ఐఆర్‌లో 'కిడ్నాప్' అభియోగాలు చేర్చే విషయమై తొందర పడటం లేదని సీనియర్ పోలీసు సూపరింటెండెంట్ ఈష్ సింఘాల్ తెలిపారు. వికాస్ బరాలా అతని స్నేహితునితో కలిసి తనను వేధింపులకు గురిచేసినట్లు ఐఎఎస్ అధికారి కుమార్తె కర్ణిక కుందు పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. కర్ణిక ఫిర్యాదు మేరకు పోలీసులు వికాస్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ ఘటన దర్యాప్తు విషయమై పోలీసులు అనేక విమర్శలు ఎదుర్కొంటున్నప్పటికీ కిడ్నాప్ అభియోగాలు నమోదు చేయడంలో తొందరపడమని తెలిపారు.

సిసిటివి ఫుటేజ్‌లపై పోలీసుల భిన్న కథనాలు

హర్యానా కేడర్‌కు చెందిన సీనియర్ ఐఎఎస్ అధికారి వి.ఎస్. కుందు కుమార్తె కర్ణిక కుందు వేధింపుల కేసులో సిసిటివిల ఫుటేజ్‌లపై పోలీసులు రెండు రోజుల్లో భిన్న కథనాలు వినిపించారు. ఈ కేసు దర్యాప్తు విషయమై పోలీసులు తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఈ ఘటనపై డిజిపి తేజిందర్ సింగ్ లూథ్రా మీడియాతో మాట్లాడుతూ నిందితులు బాధితురాలి వెంటపడినట్లు సిసిటివి ఫుటేజ్‌ల నుంచి సమాచారం సేకరించామన్నారు. టాటా సఫారీలో బాధితురాలిని వేధిస్తున్నట్లున్న సిసిటివి ఫుటేజ్‌లు తమ వద్ద ఉన్నాయని చెప్పారు. పోలీసులు ఏర్పాటు చేసిన సిసిటివిల నుంచి సమాచారం సేకరిం చారా?లేక ప్రైవేటు సిసిటివిల నుంచి సమాచారం సేకరిం చారా? అనే అంశంపై స్పష్టత ఇచ్చేందుకు ఆయన నిరాకరించారు. ఆ మార్గంలో ఏర్పాటు చేసిన సిసిటివి ఫుటేజ్‌లు సేకరించేందుకు తాము ప్రయత్నించామని, అయితే అవి ఆగస్టు 1 నుంచి పనిచేయడం లేదని సోమవారం డిఎస్‌పి సతీష్ కుమార్ మీడియాకు తెలిపారు.

కప్పి పుచ్చే యత్నం : పంజాబ్ సిఎం అమరిందర్ సింగ్

ఈ ఘటనలో వికాస్ బరాలపై నమోదు చేసిన అభియోగాలను నీరుగార్చే యత్నాలు జరుగుతున్నాయని పంజాబ్ ముఖ్యమంత్రి అమరిందర్ సింగ్ ఆరోపించారు. మంగళవారం మాట్లాడుతూ ఈ కేసులో బిజెపి నేతలను కాపాడేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, నిందితులను ఎవరూ రక్షించలేరని వ్యాఖ్యానించారు.

గుజరాత్ రాజ్యసభ ఎన్నికల కౌంటింగ్‌లో ప్రతిష్టంభన

(మొదటి పేజీ తరువాయి)

ఈ డిమాండ్‌ను తోసిపుచ్చుతూ వివాదాస్పదమైన రెండు ఓట్లను సక్రమమైనవిగానే భావించాలని ఎన్నికల అధికారులను డిమాండ్ చేసింది. బిజెపి తరుపున ఆ పార్టీ అధ్యక్షులు అమిత్ షా, కేంద్ర మంత్రి స్మృతి ఇరానీతో పాటు కాంగ్రెస్ నుండి రాజీనామా చేసి బిజెపిలో చేరిన బల్వంత్ సిన్హా రాజ్‌పుట్ బరిలో ఉండగా, కాంగ్రెస్ తరుపున సోనియా గాంధీ రాజకీయ సలహాదారు అహ్మద్ పటేల్ పోటీలో ఉన్నారు. గుజరాత్ అసెంబ్లీకి మొత్తం 176 స్థానాలున్నాయి. అందులో బిజెపి 122 స్థానాలు కలిగి ఉంది. అందువల్ల అమిత్ షా, ఇరానీల గెలుపు ఖాయమైనట్లే. రాజ్యసభ ఎన్నికల్లో బిజెపికి అనుకూలంగా క్రాస్ ఓటింగ్ జరగడం కాంగ్రెస్, కాషాయ పార్టీల మధ్య ఘర్షణకు దారితీసింది. ఈ విషయమై పార్టీలు రెండు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశాయి. కాంగ్రెస్ నేతలు రణదీప్ సూర్జేవాల, ఆర్‌పిఎన్ సింగ్‌లు ఎన్నికల కమిషన్‌ను కలుసుకుని తమ పార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేల ఓట్లను రద్దు చేయాలని కోరారు. క్రాస్ ఓటింగ్ జరిగిందన్న కాంగ్రెస్ ఆరోపణలు ఏ మాత్రం వాస్తవం కాదని బిజెపి తెలిపింది.కేంద్ర మంత్రులు ఎంఎ నఖ్వీ, పియూష్ గోయల్, అరుణ్ జైట్లీ, రవి శంకర్, నిర్మల సీతారామన్, ధర్మేంద్ర ప్రధాన్‌లతో కూడిన ప్రతినిధి బృందం ఎన్నికల కమిషన్ అధికారులను కలుసుకుంది. ఓట్ల లెక్కింపును త్వరగా ప్రారంభించాలని కోరింది. కాగా కాంగ్రెస్‌కు చెందిన ఎమ్మెల్యేలు ఇద్దరూ తమ బాలెట్ పేపర్లను వారి అధీకృత ఏజెంట్‌కు చూపడానికి బదులు బిజెపి అధ్యక్షులు అమిత్ షా, కేంద్ర మంత్రి స్మృతి ఇరానీలకు చూపించారు. ఇది 1961 నాటి ఎన్నికల నిర్వహణ నిబంధనల చట్టంలోని 39వ నిబంధనను ఉల్లంఘించినట్లయ్యింది.ఈ వ్యవహారంపై సూర్జేవాలా మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు భోలా భాయ్ ఘోలి, రాఘవ్ జి భాయ్ పటేల్‌ల ఓట్లను చట్ట ప్రకారం తిరస్కారానికి గురవుతాయన్నారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన వీడియోను కూడా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కమిషన్‌కు సమర్పించింది. ఎన్నికల కమిషన్ తనకున్న రాజ్యాంగపరమైన బాధ్యతను నిర్వర్తిస్తూ వారిద్దరి ఓట్లను లెక్కింపులోకి తీసుకోకుండా తిరస్కరించాలని సూర్జేవాల అన్నారు.మరోవైపు బిజెపి నేతలు ఓట్ల లెక్కింపు ప్రారంభించి ఫలితాలు వెల్లడించాలని ఎన్నికల కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు. పోలింగ్ విషయంలో ప్రిసైడింగ్ అధికారుల నిర్ణయమే తుది నిర్ణయమని, వారు గాని, ఎన్నికల పరిశీలకులు గాని దానిపై ఎటువంటి అభ్యంతరాలు వ్యక్తం చేయనప్పుడు దానిని ఎలా ప్రశ్నిస్తారని పీయూష్ గోయల్ ఎన్నికల కమిషన్‌తో మాట్లాడిన తరువాత ప్రశ్నించారు. ఓట్ల లెక్కింపును తక్షణమే ప్రారంభించి ఫలితాలు వెల్లడిస్తారని చెప్పారు. ఎన్నికల్లో ఓడిపోతామన్న భయంతోనే కాంగ్రెస్ తీవ్రంగా స్పందిస్తుందని రవిశంకర్ ప్రసాద్ అన్నారు. రాజ్యసభ ఎన్నికల్లో గెలుపొందేందుకు ఒక్కొక్క అభ్యర్థికి 45 ఓట్లు అవసరమవుతాయి. కాంగ్రెస్ అభ్యర్థికి 44 మంది ఎమ్మెల్యేల మద్దతు స్పష్టంగా ఉంది.ఇదిలా ఉండగా మరో ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాఘవ్జీ పటేల్, ధర్మేంద్ర సిన్హా జడేజాలు కూడా బిజెపికి అనుకూలంగా ఓటు వేసినట్లు తెలిసిందే. దీంతో అహ్మద్ పటేల్‌కు తన సొంత పార్టీ నుంచి 42 ఓట్లు మిగిలాయి. శరద్ పవార్‌కు చెందిన నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీకి ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్నారు. వారిలో ఒకరు అహ్మద్ పటేల్‌కు ఓటేయనని స్పష్టంగా ప్రకటించారు. మరో ఎన్‌సిపి నేత ఎవరికి ఓటు చేస్తారో తెలియలేదు. గుజరాత్‌లో పదేళ్ల విరామం తరువాత రాజ్యసభ ఎన్నికలు జరగడం విశేషం.

ఈ శతాబ్దంలో అతి పెద్ద స్కామ్

- రెండు రూపాల్లో రూ.500 నోట్లు
- కాంగ్రెస్ ఆరోపణతో దద్ధరిల్లిన రాజ్యసభ
- మద్దతు తెలిపిన ప్రతిపక్ష పార్టీలు
- తోసిపుచ్చిన ప్రభుత్వం




న్యూఢిల్లీ: నోట్లరద్దు అనంతరం ప్రభుత్వం ముద్రించిన పెద్ద నోట్లలో ఒకటైన రూ. 500 నోటును రెండు వేర్వేరు రూపాల్లో ముద్రించినట్లుగా ప్రతిపక్ష పార్టీలో రాజ్యసభలో తీవ్ర ఆందోళన చేశాయి. ఈ శతాబ్దంలోనే అతిపెద్ద స్కామ్ ఇదని కాంగ్రెస్ మంగళవారం విమర్శించింది. దీంతో సభలో పాలక, ప్రతిపక్షాల మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. వేర్వేరు పరిమాణం, రూపాల్లో వున్న రెండు రూ.500 నోట్ల ప్రింట్‌లతో కూడిన ప్లకార్డును కాంగ్రెస్ ఎంపీ కపిల్ సిబల్ సభలో ప్రదర్శించారు. ఆదరాబాదరాగా ప్రభుత్వం నోట్లను ఎందుకు రద్దు చేసిందో తమకు ఇప్పుడు అర్థమైందని సిబల్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ సీనియర్ నేత గులాం నబీ ఆజాద్ మాట్లాడుతూ బిజెపి కోసం ఒక డిజైన్, ప్రభుత్వానికి ఒక డిజైన్‌లో రూపొందించారని విమర్శించారు. అధికారంలో ఉండగా తామెప్పుడూ ఇలా చేయలేదని ఎద్దేవా చేశారు. జెడి(యు) నేత శరద్‌యాదవ్, తృణమూల్ ఎంపీ డెరెక్ ఒబ్రియేన్ కాంగ్రెస్‌కు మద్దతుగా నిలిచారు. అయితే కాంగ్రెస్ ఆరోపణలను ప్రభుత్వం తోసిపుచ్చింది. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ వివరణ ఇస్తూ రెండు డిజైన్లతో రూ.500 నోట్లు ప్రింట్ చేయాలని ఆర్‌బిఐకి ఆదేశించలేదని పేర్కొన్నారు. ఇలా ప్లకార్డు, పత్రాలు ప్రదర్శించి 'దీనిపై చర్చ జరపాలి' అని చెప్పే నిబంధన ఎక్కడా లేదని, బాధ్యతారహిత వ్యాఖ్యలు చేసి జీరో అవర్‌ను వృధా చేస్తున్నారని జైట్లీ అన్నారు. దీంతో ప్రతిపక్ష సభ్యులు సభ మధ్యలోకి వెళ్లి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వం దీనికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దీంతో సభను పది నిమిషాలు వాయిదా వేశారు. మధ్యాహ్న భోజనం తరువాత రెండు గంటల ప్రాంతంలో సభ సమావేశమైంది. అప్పుడు కూడా రూ. 500 నోట్లపై చర్చకు కపిల్ సిబల్ డిమాండ్ చేయడంతో సభను అరగంటపాటు వాయిదా వేస్తున్నట్లు రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ పిజె కురియన్ ప్రకటించారు. అనంతరం ఛైర్మన్ పోడియం చుట్టూ చేరి ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేశారు. వారితో పాటే బిజెపి ఎంపీలు కూడా వెనుక నించొని ప్రతిపక్ష సభ్యులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో సభ మొత్తంగా ఆరుసార్లు వాయిదా పడింది. ప్లకార్డుపై ఉన్న నోట్లు ఎక్కడ లభించాయో తెలిపాలని సిబల్‌ను కేంద్ర మంత్రి ముక్తార్ అబ్బాస్ నఖ్వీ ప్రశ్నించారు. దీనిపై చర్చ జరపాలనుకుంటే ముందుగా నోటీసు ఇవ్వాల్సి ఉంది కదా అని అడిగారు. సభ ముగిసిన అనంతరం మీడియాతో జైట్లీ మాట్లాడుతూ "వేర్వేరు ప్రాంతాల్లోని ముద్రణా యంత్రాలపై నోట్లు ప్రింట్ చేయడం వల్ల పరిమాణం, డిజైన్‌లో స్వల్పంగా తేడాలు ఉంటే ఉండొచ్చుగానీ, రెండు రకాల నోట్లు ప్రింట్ చేశామన్న ఆరోపణల్లో నిజం లేదు" అని పేర్కొన్నారు.

చైనాలో భారీ భూకంపం

ఐదుగురి మృతి - 65 మందికి పైగా గాయాలు

బీజింగ్ : చైనాలోని సిచుయాన్ రాష్ట్రంలో భారీ భూకంపం సంభవించింది. మంగళవారం రాత్రి 9.19 గంటల ప్రాంతంలో సంభవించిన ఈ భూకంపంతో పెద్ద ఎత్తున నష్టం సంభవించినట్టు సమాచారం. రిక్టర్ స్కేల్‌పై భూకంప తీవ్రత 7.0గా నమోదైనట్లు భూ కంప నెట్‌వర్క్స్ సెంటర్ తెలిపింది. ఈ సంఘటనలో ఐదు గురు మృతి చెందారని. 65 మందికిపైగా గాయపడ్డారని చైనా మీడియా పేర్కొంది. సుచావన్ ప్రావిన్స్ పర్యాటకంగా కీలకమైన ప్రాంతం. ఈ ప్రాంతంలో ప్రకృతి అందాలను పర్యాటకులను పెద్ద ఎత్తున ఆకట్టుకుంటాయి. మంగళవారం రాత్రి భూ కంపం వచ్చినసమయంలో వందల సంఖ్యలో పర్యాటకులు ఉన్నారు. భూ కంపం అనంతరం వీరిలో పలువురి ఆచూకీ తెలియలేదు. దీంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. భద్రతా సిబ్బంది తక్షణం రంగంలోకి దిగి సహాయ కార్యక్రమాలు చేపట్టారు. గాయపడిన వారిని ఆస్పత్రులకు తరలించారు. భారీ భూ కంపానికి ముందు భూమి పలుసార్లు కంపించినట్లు స్థానికులు తెలిపారు.



సహాయక చర్యల్లో నిమగ్నమైన భద్రతా సిబ్బంది

కేరళ పై అసత్య ఆరోపణలు తగవు

- లెఫ్ట్ ఫ్రంట్‌పై బురద జల్లడం మానుకోవాలి
- కేంద్ర ప్రభుత్వ తీరుపై మండిపడ్డ కేరళ వాసులు
- పార్లమెంట్ ఎదుట నిరసన



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలోనే అత్యుత్తమ రీతిలో ప్రజా సంక్షేమ చర్యలతో పురోగమిస్తున్న కేరళ లోని లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వం పైనా, సిపిఎం పైనా అసత్య ఆరోపణలతో బురదజల్లుడు ప్రచారాన్ని తక్షణం నిలిపివేయాలని ఢిల్లీలో నివసిస్తున్న కేరళ వాసులు డిమాండ్ చేశారు. ఇటీవలి కాలంలో కేంద్ర మంత్రులు, బిజెపి నేతలు అనుచిత వ్యాఖ్యలకు దిగుతున్నా రని ఆగ్రహం వ్యక్తం చేస్తూ, వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు. హింసాత్మక ఘటనలు, నేరాల చిట్టాలో బిజెపి పాలిత రాష్ట్రాలే ముందున్నాయని, అందుకు నేషనల్ క్రైం రికార్డ్సు బ్యూరో(ఎన్సీఆర్బీ) రిపోర్టులే సాక్ష్యమని వారు వ్యాఖ్యానించారు.కేరళలో శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పేందుకు లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని కేరళవాసులు పేర్కొన్నారు. కేంద్ర హోం సహాయ మంత్రి కిరణ్ రిజుజూ లోక్‌సభలో చేసిన అవాస్తవ ప్రకటనను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వ్యాఖ్యలను లోక్‌సభ రికార్డుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. మంగళవారం నాడిక్కడ స్థానిక విబి హౌస్ నుంచి పార్లమెంట్ భవనం వరకు రాజధానిలో నివసిస్తున్న కేరళ వాసులు భారీ ర్యాలీ నిర్వహించారు. కేరళ పట్ల కేంద్ర ప్రభుత్వం, బిజెపి అనుసరిస్తున్న దుర్మార్గపూరితమైన వైఖరికి వ్యతిరేకంగా దారి పొడవునా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రైల్ భవన్ వద్దకు ర్యాలీ చేరుకోగానే పోలీసులు బారికేడ్లు అడ్డుపెట్టి ప్రదర్శనను అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులకు, ప్రదర్శకులకు మధ్య వాగ్వివాదం చోటు చేసుకొంది. ర్యాలీకి అనుమతి లేదని పోలీసులు అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. విద్యా, వైద్యం, మానవ హక్కుల రక్షణ, మహిళ రక్షణ, ఉపాధి వంటి రంగాల్లో ముందంజలో వున్న, అవినీతి రహిత రాష్ట్రంగా గుర్తింపు సాధించిన కేరళపై బిజెపి చేస్తున్న దుష్ప్రచారాన్ని ఎంత మాత్రం సహించేది లేదని నిరసనకారులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అనీ రాజా మీడియాతో మాట్లాడుతూ "లోక్‌సభలో జూలై 31న గోరక్షక్ దాడులపై చర్చ జరిగింది. ఆ సమయంలో కేంద్ర హోం సహాయ మంత్రి కిరణ్ రిజుజూ చేసిన ప్రకటనలో దేశంలోనే కేరళలో క్రైం ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. ఇది అవాస్తవం. ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో క్రైం ఎక్కువగా ఉందని ఎన్సీఆర్బీ రిపోర్టు చెబుతోంది. ఒక కేంద్ర మంత్రి నిండు సభలో ఇలాంటి తప్పుడు ప్రకటనలు చేయడం దారుణం. వెంటనే ఆయన తన ప్రకటనను వెనక్కి తీసుకోవాలి. లోక్‌సభ రికార్డుల నుంచి కూడా ఆయన వ్యాఖ్యలను తొలగించాలని డిమాండ్ చేస్తున్నామని" అన్నారు.

బీహార్ ప్యాకేజీపై కేంద్రం దృష్టి

న్యూఢిల్లీ : మహా కూటమిని వీడి బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ బిజెపి చేతులు కలిపిన నేపథ్యంలో ఆ రాష్ట్రానికి రూ. 1.25 లక్షల కోట్ల ప్రత్యేక ప్యాకేజీపై కేంద్రం దృష్టి పెట్టింది. ఈ ప్రత్యేక ప్యాకేజీని 2015 బీహార్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ వాగ్ధానం చేసిన సంగతి తెలిసిందే. అయితే ఆ ఎన్నికల్లో బిజెపి పరాజయం చెందడంతో దానిని ప్రక్కన పెట్టారు. తాజా సమాచారం ప్రకారం ఈ ప్యాకేజీని త్వరితిగతిన అమలుచేయడంపై ఈ నెల 3న వివిధ శాఖలతో కేంద్రం సమాశమైనట్లు తెలుస్తోంది. మౌలిక రంగాలు, విద్యుత్, నీటిపారుదల, జల నిర్వహణ, రహదారులు తదితర అంశాల ప్రాజెక్టులను ఈ ప్రత్యేక ప్యాకేజీ కింద చేపడతారు. ఆర్థిక మంత్రిత్వ శాఖ త్వరలోనే ఈ ప్రాజెక్టులకు నిధులను మంజూరు చేయనుంది. 'మేం సమయానికి నిధులను మంజూరు చేస్తాం. అయితే నూతన కూటమి ఉనికిలోకి రావాలి. అప్పుడే బీహార్‌కు, ఈ ప్రాజెక్టులకు సహాయం చేయడానికి కేంద్రం ఆసక్తిగా వుంటుంది' అని కేంద్ర మంత్రులు చెప్పినట్లు ఈ సమావేశంలో పాల్గొన్న ఉన్నతాధికారి తెలిపారు.రూ. 1.25 లక్షల కోట్ల ప్రత్యేక ప్యాకేజీని ఆరాలో ఆగష్టు 2015న ఎన్నిక ర్యాలీలో మోడీ ప్రకటించారు. అదనంగా మౌలిక వసతుల ప్రాజెక్టుల కోసం ముందుగా రూ.40 వేల కోట్లు విడుదల చేస్తా నని కూడా మోడీ తెలిపారు. అయితే ఈ ఏడా ది మార్చిలో కేంద్రం నుంచి కేవలం రూ. 28,117.23 కోట్ల నిధులు మాత్రమే అందుబాటులో వున్నాయని బీహార్ ప్రభుత్వం తెలిపింది.

బెంగళూరులో లాండ్ మాఫియా కొత్త ఆయుధం

పావుగా గుడ్లగూబ

బెంగళూరు: సిలికాన్ సిటీగా పేరుగాంచిన బెంగళూరులో లాండ్ మాఫియా కొత్త తరహా ఆయుధాన్ని ఉపయోగిస్తోంది. ప్రజల మూఢ నమ్మకాలను ఆసరాగా చేసుకుని వారిని దోచుకోవాలని చూస్తోంది. ఇటీవల సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు కూడా వున్న ఒక లాండ్ మాఫియా గ్యాంగ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఈ గ్యాంగ్ గుడ్లగూబను ఉపయోగించి భవనాలు, నివాసాలను కొనుగోలు చేస్తున్నది. వీరు ఒక శిక్షణ పొందిన గుడ్లగూబను ఇళ్లపై వాలేటట్లు చేస్తారు. తరువాత ఆయా ఇళ్ల యాజమాలను వద్దకు వెళ్లి, ఇంటిపై గుడ్లగూబ వాలితే అరిష్టమని, దాన్ని వెంటనే అమ్మేయమని సలహా ఇస్తారు. తరువాత గ్యాంగ్‌లోని వారే తక్కువ రేటుకు ఆ భవనాలను కొనుగోలు చేస్తారు. ఈ గ్యాంగ్ వద్ద నుంచి మూడు గుడ్లగూబలను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మలేషియాలో శిక్షణ తీసుకున్న ఈ గుడ్లగూబలను గ్యాంగ్ సభ్యులే మన దేశానికి తీసుకునివచ్చారు. హైదరాబాద్, ముంబయిల్లో కూడా ఈ గ్యాంగ్ కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

మరింత మందికి ఉద్వాసన

నీతిఆయోగ్ ఉపాధ్యక్షుడు రాజీవ్ కుమార్



న్యూఢిల్లీ: ప్రణాళికా సంఘాన్ని రద్దు చేసి, దాని స్థానంలో తీసుకొచ్చిన నీతి ఆయోగ్‌లో మరింత మందికి ఉద్వాసన పలికే అవకాశమున్నట్లు ఆ సంస్థకు నూతన ఉపాధ్యక్షునిగా నియమితులైన రాజీవ్ కుమార్ అన్నారు. ఓ హిందీ దినపత్రికకు రాసిన వ్యాసంలో ఆయన కంటే ముందు ఉపాధ్యక్ష స్థానంలోవున్న అరవింద్ పనగరియా, ఆర్‌బిఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్‌ల నిష్క్రమణతో పాటు పలు అంశాలను రాజీవ్ చర్చించారు. త్వరలో నీతిఆయోగ్ నుంచి మరింత మందికి ఉద్వాసన పలికే అవకాశ ముందని చెప్పారు. భారతీయ ఆర్థిక విధానంపై ఆంగ్లో-అమెరికన్ ఆర్థిక వేత్తల ప్రభావాన్ని తగ్గించే ప్రయత్నం జరుగుతోందన్నారు. భారతీయ వాస్తవిక పరిస్థితులపై అవగాహన ఉన్న నిపుణులకు, పూర్తికాలం పదవీ బాధ్యతలు చేపట్టగలిగేవారికి అవకాశమిచ్చేందుకు ప్రభుత్వం యోచిస్తోందని పేర్కొన్నారు. మనదేశంలోకి తొలిసారిగా సంస్క రణలు అమల్లోకి వచ్చిన తరువాత క్రమంగా విదేశీ వస్తువులపై మోజు తగ్గిందని, అయితే 'మెకాలే విధానాల' మనస్తత్వాన్ని చెరిపేసేందుకు తగిన ప్రయత్నాలు జరగలేదని చెప్పారు.

రాహుల్‌పై రాళ్లదాడికి పాల్పడిందెవరు ?

- శాంతి భద్రతలు కాపాడటంలో గుజరాత్ ప్రభుత్వం విఫలం
- ప్రజాస్వామ్యంలో హింస సరైన మార్గం కాదు
- లోక్‌సభలో ప్రతిపక్షనేత ఖర్గే
- విచారణ జరుగుతోంది: హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్
- వెల్‌లో కాంగ్రెస్ సభ్యుల ఆందోళన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

'గుజరాత్‌లో రాహుల్ గాంధీపై రాళ్ల దాడికి పాల్పడిందెవరు? వారికి దన్నుగా నిలిచిన టెర్రరిస్టు శక్తులేవి' అంటూ లోక్‌సభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ప్రభుత్వాన్ని నిలదీశారు. జమ్ముకాశ్మీర్‌లో రాళ్ల రువ్విన వారిని టెర్రరిసులంటున్నారు,. టెర్రరిస్టులకు మద్దతిచ్చే వాళ్లే రాళ్లు రువ్వుతున్నారని పేర్కొంటున్నారు. కానీ ప్రస్తుతం గుజరాత్‌లో జరిగిందేమిటి ? కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు గుజరాత్ వరద బాధితుల్ని పరామర్శించేందుకు వెళ్తే రాళ్లతో దాడి చేస్తారా? ఇదెక్కడి న్యాయం. దేశంలో ఎవరు ఎక్కడికైనా వెళ్లే హక్కు పౌరులకుంది. అలాంటి పౌరుల ప్రాథమిక హక్కుకు భంగం వాటిల్లే ఘటనలు గుజరాత్‌లో జరిగాయి. దీనికి బిజెపి ప్రభుత్వం బాధ్యత వహించాలి. శాంతి భద్రతలు కాపాడటంలో గుజరాత్ ప్రభుత్వం విఫలమైంది. ఒక వ్యక్తికే భద్రత కల్పించలేకపోతే, సమస్త ప్రజా జీవనానికి రక్షణ ఎలా కల్పించగలరు?" అంటూ ప్రభుత్వాన్ని నిలదీశారు.

గుజరాత్‌లో రాహుల్ గాంధీపై జరిగిన రాళ్ళ దాడిని మంగళవారం లోక్‌సభలో కాంగ్రెస్ లేవనెత్తింది. కాంగ్రెస్‌కు సిపిఎం, ఆర్జేడీ, టిఎంసి తదితర పార్టీలు మద్దతుగా నిలిచాయి. తొలుత స్పీకర్ సుమిత్రా మహాజన్ ప్రశ్నోత్తరాలు కార్యక్రమాన్ని చేపట్టారు. వెంటనే కాంగ్రెస్ ఎంపిలు లేచి గుజరాత్‌లో రాహుల్ గాంధీపై జరిగిన రాళ్ల దాడిపై ప్రభుత్వం సమాధానమివ్వాలని ఆందోళన చేశారు. దీనికి సంబంధించి ప్రతిపక్షనేత ఖర్గే వాయిదా తీర్మానం కూడా ఇచ్చారు. కానీ స్పీకర్ సుమిత్రా మహాజన్ వాయిదా తీర్మానాన్ని తిరస్కరించారు. అయితే మల్లికార్జున ఖర్గేకు మాట్లాడే అవకాశమిచ్చారు. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ "జమ్ము కాశ్మీర్‌లో రాళ్ల రువ్వితే అందరం ఖండించాం. అది అవసరం కూడా. అయితే గుజరాత్‌లో ఏ టెరరిస్టులున్నారు? అక్కడ రాహుల్‌పై రాళ్లు రువ్విన వారు ఏ టెరరిస్టులకు మద్దతుగా ఈ హింసకు వడిగట్టారు? ప్రభుత్వం సమాధానం ఇవ్వాలి. రాహుల్ గాంధీపై జరిగిన దాడిలో కారు ధ్వంసమైంది. భద్రతా సిబ్బందికి తీవ్ర గాయాలయ్యాయి. రక్షణ కల్పించడంలో ప్రభుత్వం విఫలమైంది. ఇటీవల సంభవించిన వరదల్లో దాదాపు 270 మంది చనిపోయారు. వరద ప్రాంతాలను సందర్శించేందుకు రాహుల్ గాంధీ వెళ్లారు. ఈ సందర్భంలో ఆయన పై దాడి జరిగింది. ఇది సమంజసం కాదు. ప్రజాస్వామ్యంలో హింస సరైన మార్గం కాదు. హింసకు వ్యతిరేకంగా ఉద్యమిస్తామని మహాత్మా గాంధీని పదేపదే తలుచుకుంటాం. కానీ ఆచరణలో విఫలమయ్యాం,1947 క్విట్ ఇండియా ఉద్యమంలో గాంధీ దేశంలో పౌరులు ఎక్కడైన తిరగొచ్చని సందేశం ఇచ్చారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం ఏం మేసేజ్ ఇస్తోంది. తిరిగితే దాడులు చేస్తామంటుంది" అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

దీనిపై హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సమాధానమిస్తూ, రాహుల్ గాంధీ సెక్యూరిటీ ప్రోటోకాల్స్ పాటించనందునే ఈ ఘటన జరిగిందని అన్నారు.. రాహుల్ గాంధీ పర్యటన నేపథ్యంలో భారీ భద్రతా ఏర్పాట్లు జరిగాయి. చాలా మంది సెక్యూరిటీ సిబ్బంది ఆయన వెంట ఉన్నారు. పోలీసులు ఏర్పాటు చేసిన బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని రాహుల్ తిరస్కరించారు. పదే పదే వాహనాలు మారుస్తూ వెళ్లారు. భద్రతా సిబ్బంది సూచనలు అనుసరించి ఉంటే ఇలా జరిగేదికాదు. ఆయనకు ఎస్పీజి భద్రత ఉన్నప్పటికీ పక్కన బెట్టడానికి కారణమేమిటీ? గత రెండేళ్లలో రాహుల్ గాంధీ 72 రోజుల పాటు ఆరు సార్లు విదేశీ యాత్రలకు వెళ్లారు. కాని ఎస్పీజీ సిబ్బందిని మాత్రం తీసుకెళ్ల లేదు. ఆయన ఎక్కడికెళ్లారో మాకు తెలియాలి. ఎస్పీజీ సిబ్బందిని ఎందుకు తిరస్కరిస్తున్నారో చెప్పాలి. రాహుల్‌పై రాళ్ల దాడి చేసిన ఘటనలో ఒకరిని అరెస్టు చేశాం. విచారణ జరుగుతోంది. దీన్ని తీవ్రంగా పరిగిణిస్తాం" అని అన్నారు. మంత్రి సమాధానంపై ఆగ్రహం వ్యక్తం చేసిన కాంగ్రెస్ ఎంపిలు వెల్‌లోకెళ్లి ఆందోళన చేశారు. వారికి సిపిఎం, ఆర్జేడి, తృణముల్ కాంగ్రెస్ మద్దతుగా నిలిచాయి. స్పీకర్ పోడియంను చుట్టుముట్టిన కాంగ్రెస్ సభ్యులు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అధికార బిజెపి సభ్యులు దీనికి ప్రతిగా నినాదాలు చేశారు. దీంతో సభలో గందరగోళం నెలకొంది. వెంటనే స్పీకర్ సుమిత్రా మహాజన్ సభను వాయిదా వేశారు. అనంతరం ప్రారంభమైన సభలో అధికార, ప్రతిపక్ష సభ్యుల నినాదాలతో హోరెత్తింది. దీంతో సభను స్పీకర్ బుధవారం నాటికి వాయిదా వేశారు.

రాజ్‌నాథ్ తప్పుదోవ పట్టిస్తున్నారు: శశిథరూర్

కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ గుజరాత్ పర్యటన సందర్భంగా ఆయన కాన్వాయ్‌పై జరిగిన రాళ్ల దాడిపై కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఇచ్చిన వివరణపై కాంగ్రెస్ పెదవి విరిచింది. సెక్యూరిటీ ప్రోటోకాల్స్‌ను రాహుల్ పట్టించుకోలేదంటూ రాజ్‌నాథ్ అసలు సమస్యను పక్కదోవ పట్టించే ప్రయత్నం చేశారని, ఆయన సమాధానంలో జవాబుదారీతనం లోపించిందని కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ అన్నారు. సభ వాయిదా అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ "మేము సూటిగా ప్రశ్న అడిగాం. మాకు సరైన సమాధానం రాలేదు. సెక్యూరిటీ నిబంధనలు, ఎస్పీజీ చట్టాలను రాహుల్ పట్టించుకోలేదంటూ ఏవేవో సంబంధం లేని మాటలు మాట్లాడారు. ఇప్పుడు మాట్లాడాల్సిన విషయాలా ఇవి? భద్రతా చర్యలు కట్టుదిట్టంగా ఉండి ఉంటే రాహుల్ గాంధీపై బిజెపి కార్యకర్తలు ఎలా దాడి చేశారు?" అని శశిథరూర్ ప్రశ్నించారు. దాడికి రాహులే బాధ్యడంటూ సభలో మంత్రి మాట్లాడటం ఏమాత్రం జవాబుదారీతనాన్ని సూచించదన్నారు. "రాహుల్‌కు భద్రతా ముప్పే లేకపోతే దేశ ప్రజల పన్ను సొమ్మును ఎందుకు ఎస్పీజీ ప్రొవిజన్స్ కోసం ఖర్చు చేస్తున్నారు? ఒక రాజకీయనాయకుడిగా ప్రజలతో ఆయన మాట్లాడాల్సి ఉంటుంది. అన్ని సందర్భాల్లోనూ బుల్లెట్ ప్రూఫ్ కార్లలోనే ప్రయాణించాలనుకోవడం సరికాదు" అని శశిథరూర్ అన్నారు.

డెంగ్యూ నివారణపై వైద్య నిపుణులకు క్యూబాలో పునశ్చరణ

హవానా: డెంగ్యూ, ఇతర ఆర్బోవైరల్ వ్యాధుల నివారణపై క్యూబాలో గుర్తింపు పొందిన వైద్యులు, అంతర్జాతీయ వైద్య నిపుణులకు నగరంలోని పెడ్రోకౌరీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెడిసన్‌లో పునశ్చరణ తరగతులు ప్రారంభమయ్యాయి. ప్రపంచ వ్యాప్తంగా వున్న ప్రముఖ వైద్య నిపుణులు, వైరాలజిస్టులు, ఇమ్యునాలజిస్టులు, సోషియాలజిస్టులు, ఎపిడమాలజిస్టులు, ఎంటమాలజిస్టులు, ఆస్పత్రి నిర్వాహకులు, విద్యావేత్తల వంటి వారు పాల్గొంటున్న ఈ పునశ్చరణ తరగతుల్లో అడెస్ అజెప్టి దోమ ద్వారా వ్యాపించే డెంగ్యూ, జైకా, చికున్ గున్యా, ఎల్లో ఫీవర్ వంటి వ్యాధుల నివారణకు సంబంధించి చర్చలు జరగనున్నాయి. పాన్ అమెరికన్, ప్రపంచ ఆరోగ్య సంస్థలతో పాటు సిల్వెయిన్ అల్డిఘిరి , మాథ్యూ బాంగెర్ట్, హారోల్డో బెసెర్రా, మార్కోస్ ఎస్పినాల్ ఫ్లోరెన్ ఫార్క్స్, లెటిషియా ఫ్రాంకో, గమాలియెల్ గుటెరెజ్ వంటి ప్రముఖ వైద్య సంస్థల నుండి నిపుణులు పాల్గొంటున్నారని ఈ పునశ్చరణ తరగతుల నిర్వాహణా సంస్థ ఐపికె వెల్లడించింది. వీరితో పాటు కెనడా, కొలంబియా, అర్జెంటీనా, అమెరికా, ఐర్లండ్, జర్మనీ, బెల్జియం, మెక్సికో, పోర్టారికో, జపాన్, వెనిజులా, బ్రెజిల్, స్విజర్లాండ్ వంటి దేశాల ప్రతినిధులు సైతం ఈ తరగతులకు హాజరవుతున్నారని ఐపికె ప్రతినిధులు వివరించారు.

ఆఫ్ఘన్‌లో షియా మసీదుపై మిలిటెంట్ల దాడి

29 మందికి పైగా మృతి

హేరత్: ఆఫ్ఘనిస్థాన్ పశ్చిమ ప్రాంతంలోని హేరత్ నగరంలోని ఒక షియా మసీదుపై మంగళవారం జరిగిన ఆత్మాహుతి దాడిలో కనీసం 29 మందికి పైగా మరణించినట్లు అధికారులు చెప్పారు. ఈ దాడిలో మరో 64 మంది తీవ్రంగా గాయపడ్డారన్నారు. ఆత్మాహుతి దాడికి పాల్పడిన ఇద్దరు వ్యక్తుల్లో ఒకరు తన దుస్తుల్లో వున్న పేలుడు పదార్ధాలను పేల్చివేసుకోగా, మరొకరు అక్కడ ప్రార్ధనల కోసం వచ్చిన వారిపై గ్రెనేడ్‌లు విసిరాడని స్థానిక పోలీసు ప్రతినిధి అబ్దుల్లాహై వలీజాదా చెప్పారు. ఇద్దరు వ్యక్తులు మసీదులోకి ప్రవేశించి విచక్షణా రహితంగా కాల్పులు జరుపుతూ అక్కడి వారిపై గ్రెనేడ్‌లు విసిరారని ఈ దాడిలో గాయపడిన వారిలో ఒకడైన మహ్మద్ అది వివరించాడు. ఆయన ఇప్పుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ దాడిలో 29 మంది మరణించారని, మరో 64 మంది తీవ్రంగా గాయపడ్డారని హేరత్ గవర్నర్ మహ్మద్ ఆసిఫ్ రహిమి ధృవీకరించారు. హేరత్ నగరంలో వున్న 12వ శతాబ్ది కాలం నాటి జామా మసీదుపై దాడి జరిగిన రెండు నెలలకే తాజా దాడి జరగటం విశేషం. ఈ దాడికి తామే బాధ్యులమని ఇప్పటి వరకూ ఎవరూ ప్రకటించలేదు.

జుమా సర్కారుపై అవిశ్వాస తీర్మానం



దక్షిణాఫ్రికాలో రాజకీయ అనిశ్చితి

జోహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికా ప్రభుత్వంపై ఒక సభ్యుడు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి పార్లమెంట్ స్పీకర్ అనుమతించటంతో అధ్యక్షుడు జాకబ్ జుమా నేతృత్వంలోని సర్కారు తీవ్ర అనిశ్చితిలో పడింది. ఈ అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ నిర్వహించాలని స్పీకర్ అనూహ్యంగా తీసుకున్న ఈ నిర్ణయం దాదాపు అన్ని పక్షాలనూ తీవ్ర విస్మయానికి గురి చేసింది. అవిశ్వాస తీర్మానంపై రహస్య ఓటింగ్ నిర్వహిస్తే అది జుమా ఉద్వాసనను కోరుకుంటున్న ఎఎన్‌సి పార్లమెంట్ సభ్యులకు రక్షణగా వుంటుందని విమర్శకులు అభిప్రాయపడుతున్నారు. అత్యంత తీవ్ర స్థాయిలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధ్యక్షుడు జాకబ్ జుమా రహస్య బ్యాలట్ అవాంఛనీయమంటూ గత జూన్‌లో ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఇందుకు విరుద్ధంగా స్పీకర్ తీసుకున్న నిర్ణయం దక్షిణాఫ్రికా రాజకీయ ముఖచిత్రాన్నే మార్చివేయనుంది. అవిశ్వాస తీర్మానంపై రహస్య ఓటింగ్ నిర్వహించాలన్న స్పీకర్ నిర్ణయంపై మార్కెట సానుకూలంగా స్పందించింది. బ్యాంకింగ్ షేర్లు దూసుకుపోయాయి.. గత ఏడాది ఆర్థిక మంత్రి ప్రవీణ్ గోవర్ధన్‌ను పదవి నుండి తొలగించటం, జుమాపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తటం వంటి అంశాల నేపథ్యంలో టాప్ త్రీ క్రెడిట్ సంస్థలు దక్షిణాఫ్రికా పరపతి రేటింగ్‌ను కుదించివేశాయి. ఆర్థిక వ్యవస్థ తీవ్ర మాంద్యంలో కొనసాగుతున్న ప్రస్తుత సమయంలో దేశంలో నిరుద్యోగిత 14 ఏళ్ల గరిష్ట స్థాయికి చేరి 27.7 శాతంగా నమోదయింది.

మహిళల జాడే లేని రొహానీ కేబినెట్

ఇరాన్ సంస్కరణ వాదుల ఆగ్రహం

టెహ్రాన్: ఇరాన్ అధ్యక్షుడు హసన్ రొహానీ కొత్తగా ఏర్పాటు చేసిన మంత్రివర్గంలో మహిళలకు, యువతకు ప్రాతినిధ్యం లేకపోవటంపై ఆ దేశ సంస్కరణ వాదులు మండిపడుతున్నారు. అధ్యక్షుడు రొహానీ ఏర్పాటు చేసిన మంత్రివర్గానికి పార్లమెంట్ ఆమోదం పొందాల్సి వుంటుంది. రొహానీ మొదటి కేబినెట్‌తో పోల్చుకుంటే ప్రస్తుత కేబినెట్‌లో మైనార్టీలకు తగిన ప్రాతినిధ్యం లభించలేదు. మంత్రివర్గ సభ్యుల సగటు వయస్సు కూడా పెరిగింది. కొత్త కేబినెట్‌లో మహిళా మంత్రులకు స్థానం లేకపోవటం తమ ఆశలపై నీళ్లు చల్లినట్లయిందని పదవీ విరమణ చేస్తున్న మహిళా వ్యవహారాల మంత్రి షహీన్‌దోక్త్ మౌలావెర్ది వ్యాఖ్యానించారు. గత నెలలో జరిగిన ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అధ్యక్షుడు రొహానీ విస్మరించారని సోషల్ మీడియాలో పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. గత రెండు ఎన్నికల్లో ప్రజలిచ్చిన సందేశం కొత్త కేబినెట్‌లో నామమాత్రంగా కూడా ప్రతిఫలించటం లేదని ప్రతిపక్ష నేత మెహదీ కర్రోబీ కుమారుడు మహ్మద్ కర్రోబీ ట్విట్టర్‌లో విమర్శించారు. గత మంత్రివర్గంలో ముగ్గురు మహిళలకు ప్రాతినిధ్యం కల్పించిన రొహానీ తాజా కేబినెట్‌లో వారిని దూరంగా వుంచటం విశేషం. పశ్చిమ దేశాలతో సంబంధాలను బలోపేతం చేసుకునే లక్ష్యంతో రూపొందించిన కొత్త కేబినెట్‌లో కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. విదేశాంగ మంత్రి జావాద్ జరీఫ్, చమురు శాఖ మంత్రి బిజన్ నామ్‌దర్ జన్గ్నేలను యధాతథంగా కొనసాగిస్తుండగా, టెలికమ్యూనికేషన్ల మంత్రిగా 35 ఏళ్ల ఇంజనీర్ మహ్మద్ జావాద్ అజారీ జరోమీని నియమించటం పలువురిని ఆశ్చర్యంలో ముంచెత్తింది. అయితే జరోమీ నియామకం తరువాత సైతం మంత్రివర్గ సభ్యుల సగటు వయస్సు 58గానే కొనసాగుతుండటం విశేషం. దేశంలో దాదాపు పదిశాతం మేర వున్న సున్నీలకు సైతం కొత్త మంత్రివర్గంలో స్థానం దక్కలేదు. తాజా మంత్రివర్గంలో రక్షణ మంత్రిగా తన డిప్యూటీ జనరల్ అమీర్ హతామీని నియమించిన రహాని ఇప్పటి వరకూ ఆ బాధ్యతలు నిర్వహించిన మేజర్ జనరల్ హుస్సేన్ దెహ్ఘాన్‌కు ఉద్వాసన పలికారు. దేశ రక్షణ దళాలలో అత్యున్నత స్థానంలో వున్న రివల్యూషనరీ గార్డ్స్‌ను పక్కన పెట్టి సాధారణ సైన్యం నుండి ఈ పదవిని భర్తీ చేయటం గత రెండు దశాబ్దాల కాలంలో ఇదే తొలిసారి. ఆర్థికశాఖ ఉప మంత్రిగా వున్న మసూద్ కర్బాసియన్‌కు కేబినెట్ హోదా లభించింది.



అరుణగ్రహ తొలి సిమ్యులేషన్ బేస్

నిర్మించేందుకు సిద్ధమవుతున్న చైనా

బీజింగ్: అరుణగ్రహ యానానికి సంబం ధించిన శిక్షణకు ఉద్దేశించిన తొలి సిమ్యులేషన్ బేస్‌ను నిర్మించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని చైనా ప్రభుత్వ అధికారి ఒకరు చెప్పారు. ఈ స్థావరాన్ని మంగోలియన్ టిబెటన్ ప్రిఫెక్చెర్‌లోని డా కైడమ్ జిల్లాలో రెడ్‌క్లిఫ్ ప్రాంతంలో నిర్మించనున్నారని ఆ అధికారిని ఉటంకిస్తూ చైనా అధికార వార్తాసంస్థ సిన్హువా వెల్లడించింది. ఈ ప్రాంతంలో అరుణగ్రహ వాతావరణ ఛాయలు, భూమి పొరలు వుండటంతో ఈ ప్రాంతాన్ని ఎంపిక చేశారని ప్రిఫెక్చర్ పార్టీ డిప్యూటీ చీఫ్ వాంగ్ జింగ్‌జై చెప్పారు. ఈ బేస్ నిర్మాణానికి సంబంధించి హైజీ ప్రభుత్వం, చైనా అకాడమీ ఆఫ్ సైన్స్ మధ్య గత నవంబర్‌లో ఒప్పందం కుదిరిందని ఆయన వివరించారు. దాదాపు అరుణగ్రహ వాతావరణ ఛాయలతో ఏర్పాటు చేసే ఈ కేంద్రాన్ని రోదసీ, ఖగోళ విద్యకు సంబంధించిన తొలి సాంస్కృతిక, పర్యాటక కేంద్రంగానూ, శాస్త్రపరిశోధనలు, చిత్ర నిర్మాణ కేంద్రంగానూ తీర్చి దిద్దనున్నట్లు జింగ్‌జై వెల్లడించారు.

సహకార విస్తృతిపై చైనా, ఆసియాన్ దేశాల అంగీకారం

బీజింగ్: చైనాతో సహకారాన్ని మరింత విస్తరించుకోవటం ద్వారా పరస్పరం విస్తృత ప్రయోజనాలను అందుబాటులోకి తెచ్చుకోవాలని ఆగ్నేయాసియా దేశాల (ఆసియాన్) కూటమి విదేశాంగ మంత్రులు నిర్ణయించారు. దీనితో పాటు చైనాతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు సిద్ధంగా వున్నట్లు ఆదివారం విడుదల చేసిన ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ ప్రాంతంలో పెరుగుతున్న చైనా ప్రాభవాన్ని ప్రశంసించిన ఆసియాన్ విదేశాంగ మంత్రులు చైనాతో ఉన్నత స్థాయి ఆర్థిక సహకారానికి, ఉన్నత స్థాయి చర్చలకు అవకాశం ఏర్పడుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఆసియాన్, చైనా మధ్య సమగ్ర ఆర్థిక సహకారానికి సంబంధించిన కొన్ని ఒప్పందాలకు సంబంధించిన ప్రోటోకాల్ ఫ్రేమ్‌వర్క్‌ను సవరించటాన్ని వారు స్వాగతించారు. ఈ సవరించిన ప్రోటోకాల్ ఫ్రేమ్‌వర్క్‌ను ఇతర దేశాలు కూడా సాధ్యమైనంత త్వరగా ఆమోదిస్తాయని ఆశిస్తున్నట్లు వారు సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఇరువైపులా ద్వైపాక్షిక వాణిజ్య విస్తరణతో పాటు 2020 నాటికి లక్ష కోట్ల డాలర్ల పెట్టుబడి లక్ష్యాన్ని సాధించేందుకు ఈ ప్రోటోకాల్ ఫ్రేమ్‌వర్క్ సహకరిస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. 2018 నాటికి చైనా–ఆసియాన్ వ్యూహాత్మక భాగస్వామ్యం ఏర్పడి 15 ఏళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో 2018ని ఆసియాన్–చైనా వినూత్న సహకార సంవత్సరంగా కొనసాగించాలని నిర్ణయించినట్లు తెలిపారు. అదే విధంగా చైనా–ఆసియాన్ వ్యూహాత్మక భాగస్వామ్యంపై విజన్ 2030ని రూపొందించి భావి సంబంధాలకు మార్గదర్శకంగా ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు.

ఇయు డిమాండ్‌ను గుర్తించం

బ్రిటన్ ప్రధాని స్పష్టీకరణ

లండన్: ఐరోపా కూటమి నుండి నిష్క్రమించటానికి ముందు తమకు 4 వేల కోట్ల డాలర్ల పరిహారం చెల్లించాలంటూ ఐరోపా కూటమి (ఇయు) చేసిన డిమాండ్‌ను బ్రిటన్ తోసిపుచ్చింది. ఇయు జారీ చేసిన బిల్లును తాము గుర్తించటంలేదని బ్రిటన్ ప్రధాని థెరెస్సా మే ప్రతినిధి ఒకరు స్పష్టం చేశారు. ఇయు డిమాండ్ మేరకు పరిహారం చెల్లించేందుకు బ్రిటన్ సిద్ధమవుతున్నదన్న వార్తలను ఆయన ఖండించారు. మీడియాలో వచ్చిన వార్తలను తాము గుర్తించటం లేదని ఆయన పునరుద్ఘాటించారు. బ్రెగ్జిట్ ప్రక్రియకు సంబంధించిన ఆర్టికల్ 50పై సమగ్రంగా చర్చించటంతో పాటు ఇరువైపులా సామరస్యపూర్వకమైన పరిష్కారం కుదరాలని, ముఖ్యంగా ఇయు సభ్యదేశంగా తమ హక్కులు, బాధ్యతలకు సంబంధించిన పరిష్కారంపై చర్చించాల్సిన అవసరం వుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇయు నుండి నిష్క్రమించే ప్రక్రియకు సంబంధించి విధి విధానాలపై చర్చించేందుకు బ్రిటన్‌కు రెండేళ్ల గడువున్న విషయం తెలిసిందే. దీనిపై తొలి దశ చర్చల్లో బ్రిటన్ ఏం కోరుకుంటోందో స్పష్టంగా చెప్పాలంటూ ఇయు బృందం డిమాండ్ చేయటంతో ఇవి అర్థంతరంగా ముగిశాయి. పరిహారంపై ఖచ్చితమైన సంఖ్యతో ఇరుపక్షాలు ముందుకు వచ్చే అవకాశం వుందా? అన్న ప్రశ్నకు ఆయన బదులిస్తూ ప్రస్తుత చర్చల దశలో పరిహారం లెక్కింపునకు తగిన నియమ నిబంధనల మేరకు అంగీకారం కుదరాల్సి వుందన్నారు. అయితే చర్చల ప్రస్తుత దశపై తన వద్ద సమాచారం లేదని ఆయన వివరించారు.

లాహోర్‌లో శక్తివంతమైన పేలుడు

22 మందికి గాయాలు

లాహోర్: పాకిస్తాన్ తూర్పు ప్రాంతంలో వున్న లాహోర్ నగరంలో సోమవారం సంభవించిన శక్తివంతమైన పేలుడులో కనీసం 22 మందికి పైగా గాయపడ్డారని అధికారులు చెప్పారు. అయితే ఈ పేలుడుకు తామే బాధ్యత వహిస్తున్నట్లు ఇప్పటి వర కూ ఏ ఉగ్రవాద సంస్థా ప్రకటించలేదు. గత రెండేళ్ల కాలంలో పంజాబ్ ప్రావిన్స్ రాజధాని లాహోర్ నగరంపై ఉగ్రవాద దాడులు తగ్గినప్పటికీ కొన్ని ఇస్లామిస్ట్ గ్రూపులు ఇప్పటికీ అక్కడ క్రియాశీలకంగా వ్యవహరిస్తూ దాడులు కొనసాగిస్తున్నాయి. ఒక పండ్ల ట్రక్కులో వున్న బాంబు పేలిన ఈ ఘటనలో 22 మంది గాయపడ్డారని పంజాబ్ ప్రావిన్షియల్ ప్రభుత్వ ప్రతినిధి మాలిక్ మహ్మద్ అహ్మద్ ఖాన్ చెప్పారు. ట్రక్కు నిండుగా పేలుడు పదార్థాలు అమర్చి పైన పండ్లు పేర్చినట్లు నిపుణులు చెబుతున్నారని లాహోర్ డిఐజి హైదర్ అష్రఫ్ వివరించారు.

మొదటి పేజీ తరువాయి

అంతర్ రాష్ట్ర బదిలీలకు గ్రీన్ సిగ్నల్

జిల్లా.. ఈ మూడు విభాగాల్లో అంతర్‌రాష్ట్ర బదిలీలకు ఆస్కారం కల్పించనున్నారు. దంపతుల కేసుల్లో ఒకరికి దరఖాస్తు చేసుకునే అవకాశమిచ్చారు. ఇద్దరిలో ఒకరు తప్పనిసరిగా వారు కోరుకునే రాష్ట్రంలో స్థానికత కలిగి ఉండాలని నిర్దేశించారు. పరస్పర అంగీకార బదిలీలు, మల్టీ జోన్, జోన్, జిల్లా స్థాయి బదిలీలకు కూడా అనుమతించాలని నిర్ణయించారు. అయితే వారిని బదిలీ చేసే సమయంలో వారు కోరుకున్న రాష్ట్రంలో స్పష్టమైన పోస్టు ఖాళీగా ఉండాలని స్పష్టం చేశారు. అలాగే రాష్ట్ర కాడర్‌కు సంబంధించి ఇప్పటికే రెండు రాష్ట్రాల్లో పని చేస్తున్న వారు సొంత రాష్ట్రానికి వెళ్లాలంటే పరస్పరాంగీకారం ఉండాలని పేర్కొన్నారు.

రెండు నెలల్లో ప్రక్రియ

అంతర్ రాష్ట్ర బదిలీ కోరుకునే వారు నెల రోజుల్లోగా తమ తమ ప్రధాన కార్యాలయాలకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆ దరఖాస్తులను సంబంధిత అధికారులు పరిశీలించి రెండు నెలల్లోగా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఆరోగ్యం, వ్యక్తిగత కారణాల వంటి వాటిని తాజా అంతర్‌రాష్ట్ర బదిలీల్లో పరిగణించరాదని నిర్ణయించారు. ఈ బదిలీలను కూడా ఉద్యోగుల సర్వీసులో ఒక్కసారి మాత్రమే అంగీకరించనున్నట్లు స్పష్టం చేశారు. ఒక రాష్ట్రం నుంచి ఇంకొక రాష్ట్రానికి వెళ్లే ఉద్యోగి, కొత్త రాష్ట్రంలో చివరి సర్వీసు స్థానం మాత్రమే పొందుతారు. ఆ రాష్ట్రంలో పనిచేస్తున్న సంబంధిత క్యాడర్ ఉద్యోగుల్లో చివరి సర్వీసు స్థానంలో ఉన్న వారి తరువాత ఇంకొక రాష్ట్రం నుంచి వచ్చే వారికి సర్వీసు కేటాయించాలని నిర్ణయించారు. స్థానిక సంస్థల్లో పనిచేస్తున్న వారికి కూడా ఇవే మార్గదర్శకాలను అమలు చేయనున్నామని, ఈ బదిలీల్లో వెళ్లే వారికి ఎటువంటి రవాణా భృతీ, ఇతర అలవెన్సులు చెల్లించరని స్పష్టం చేశారు.

ప్రత్యేక నమూనాలో అర్జీ

ఈ బదిలీల కోసం ప్రత్యేకంగా ఒక దరఖాస్తు నమూనా కూడా సిద్ధం చేశారు. ఇందులో ఉద్యోగి వివరాలు సహా కులం, ప్రస్తుతం పనిచేస్తున్న పోస్టు, క్యాడర్, జోనల్, జిల్లా వివరాలు, అతను/ఆమె కోరుకున్న చోట స్పష్టమైన ఖాళీ ఉందా అన్న వివరాలు కూడా ఉద్యోగి వెల్లడించాల్సి ఉంటుంది. దంపతుల కేసుల్లో స్థానికతను ధ్రువీకరించే పత్రాలను కూడా జత చేయాల్సి ఉంటుంది. బదిలీ కోరుకునే ఉద్యోగులు వారిపై శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలకు సంబంధించిన కేసులుంటే వాటినీ ప్రకటించాల్సి ఉంటుంది. ఇటువంటి వారి బదిలీలపై ఆలోచన చేయాల్సి ఉంటుందని, వారిని బదిలీ చేయాలంటే, వారిపై కేసులను కూడా అధ్యయనం చేయాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

వేలిముద్రలు పడకున్నా రేషన్

రేషన్ షాపులుగా విభజించాలని ఫోరం ప్రతినిధులు కోరగా, మంత్రి స్పందిస్తూ ఈ విషయంపై అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. జనరిక్ మందులను షాపుల్లో కొనుగోలు చేసి గ్రామాల్లో ఆర్‌ఎంపి వైద్యులు అధిక ధరలకు విక్రయిస్తున్నారని వారు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. రైల్వేస్టేషన్లో మాదిరిగా బస్ స్టాండ్లలో రాయితీతో కూడిన మంచినీళ్ల బాటిల్‌ను రూ.15కు విక్రయింపజేయాలని కోరారు. రేషన్ షాపులున్న ప్రతి ప్రాంతంలో వినియోగదారుల ఇన్ఫర్మేషన్ సెంటర్లను, ప్రతి జిల్లాలో ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయాలని ప్రతినిధులు కోరారు. ఈ విషయాలను సిఎం దృష్టికి తీసుకెళ్తానని మంత్రి హామీ ఇచ్చారు.

సదావర్తి భూములకు మళ్లీ వేలం : హైకోర్టు

వేలం ప్రక్రియ వివరాలు సమర్పించాలని సూచించింది. తొలుత వేలంలో రూ.22.44 కోట్లకు భూములు దక్కించుకున్న వారి తరపు న్యాయవాది బి.చంద్రసేన్‌రెడ్డి వాదిస్తూ.. గతంలోని పిల్‌లోని అంశాల్నే ఆళ్ల రిట్‌లో పేర్కొన్నారని, రిట్ వెనుక సరైన ఉద్దేశం లేదన్నారు. రిట్ వేసి భూమిని కొట్టేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. పిటిషనర్ ఉద్దేశం తెలుసుకునేందుకే రూ.5 కోట్లు అదనంగా చెల్లించమని పిటిషనర్‌ను కోరామని, రూ. 27.44 కోట్లు చెల్లించి సదుద్దేశాన్ని వెల్లడించుకున్నారని బెంచ్ వివరించింది. మళ్లీ వేలం వేలం వేస్తే ప్రభుత్వానికి ఎక్కువ డబ్బు వస్తుందని కూడా పేర్కొంది. ఈ దశలో ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది డి.రమేశ్ కల్పించుకుని నెల రోజుల గడువు సరిపోదన్నారు.దీంతో ఆరు వారాల్లో ప్రక్రియ పూర్తి చేయాలని బెంచ్ ఆదేశిస్తూ తదుపరి విచారణ వచ్చే నెల 21కి వాయిదా వేసింది.

శ్రామిక సమర భేరి

మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వ ధోరణికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా కార్మికలోకం పలు ఆందోళనలు, సమ్మెల వంటి రూపాలలో ఉద్యమిస్తున్నప్పటికీ కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం కార్మికుల హక్కులను, జీవనాన్ని కాలరాస్తోందని ఈ సమావేశం విమర్శించింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా నిరుద్యోగిత రోజు రోజుకూ పెరిగిపోతుండగా మరోవైపు శ్రమశక్తి ఆధారిత అనేక రంగాలలో ఉపాధి కల్పన తిరోగమన దిశలో కొనసాగుతోందని ఈ సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ పరిస్థితులను ఏ మాత్రం ఖాతరు చేయని కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్ట సంస్కరణల పేరిట యాజమాన్య అనుకూల చర్యలు కొనసాగిస్తోందని సమావేశం అభిప్రాయపడింది. తాజగా కార్మికులకు ఎంతో కొంత సామాజిక భద్రత కల్పించే చట్టపరమైన వ్యవస్థలను నిర్వీర్యం చేసేందుకు పూనుకుంటోందని విమర్శించింది. రక్షణ ఉత్పత్తులు, బీమా, ప్రభుత్వ రంగ బ్యాంకుల వంటి వ్యూహాత్మకమైన ప్రభుత్వ వ్యవస్థలను ప్రైవేటీకరించటంతో పాటు ప్రభుత్వ రంగ వ్యవస్థల్లో తన వాటాలను ఉపసంహరించుకుంటూ, కొన్నింటిని తెగనమ్ముతూ, కొన్నింటిలో ప్రైవేటు రంగానికి అనుకూలంగా పొరుగు సేవల విధానాన్ని అనుమతిస్తూ కొనసాగిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు నానాటికీ పెరిగిపోతున్నాయని కార్మిక సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. పార్లమెంట్ ప్రస్తుత సమావేశాలలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2017 మోటారు వాహనాల చట్ట(సవరణ) బిల్లుకు అధికార కూటమి తనకున్న మందబలంతో ఆమోదం



న్యూఢిల్లీలో జరిగిన కేంద్ర కార్మిక సంఘాల సదస్సులో ప్రసంగిస్తున్న సిఐటియు అఖిల భారత ప్రధానకార్యదర్శి తపన్ సేన్

పొందటం ఇందుకు తాజా ఉదాహరణ అని ఈ సమావేశం పేర్కొంది. జాతీయ రైతు సంఘాల సమాఖ్య ఆధ్వరంయంలో వివిధ రాష్ట్రాల్లో రైతులు కొనసాగిస్తున్న పోరాటాలకు సమావేశం సంఘీభావం ప్రకటించింది. ప్రస్తుత రాజకీయ నాయకత్వంలో ప్రభుత్వ యంత్రాంగాన్ని మతోన్మాద, విభజన చర్యలకు అనుకూలంగా ఉపయోగించుకోవటాన్ని ఈ సమావేశం తీవ్రంగా ఖండించింది. కార్మికలోకం, బడుగు వర్గాల హక్కులు, జీవన విధానాలపై కొనసాగుతున్న దాడులు నానాటికీ తీవ్రమవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం ప్రైవేటు, కార్పొరేట్ అనుకూల విధానాలు అమలు చేస్తుండటంపై పోరాటాలు కొనసాగించాలని సమావేశం పిలుపునిచ్చింది. ఆర్థిక రంగంలోని అన్ని విభాగాలలో కార్మికులు, ఉద్యోగుల డిమాండ్లను సాధించుకునేందుకు ఐక్యపోరాటాలను ఉధృతం చేయాలని సమావేశం నిర్ణయించింది. దీనితో పాటు బ్లాక్, జిల్లా, రాష్ట్రట స్థాయిలో విస్తృత ప్రచారం జరిపి ఆందోళనలకు కార్మికలోకాన్ని సమీకరించాలని, నవంబర్ 9,10,11 తేదీల్లో న్యూఢిల్లీలో జరిగే మహాధర్నాకు దేశవ్యాప్తంగా లక్షలాది మంది కార్మికులను సమీకరించాలని సమావేశం నిర్ణయించింది. ప్రభుత్వ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసనగా నిరవధిక దేశవ్యాప్త సమ్మెకు సంసిద్ధం కావాలని ఈ సమావేశం ప్రజలకు పిలుపునిచ్చింది.

జమ్మూ కాశ్మీర్ ప్రత్యేక హోదాపై స్పందించండి

కేంద్రాన్ని కోరిన సుప్రీం

న్యూఢిల్లీ : జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించడంపై సుప్రీం కోర్టు మంగళవారం కేంద్ర ప్రభుత్వ వివరణను కోరింది. అంతకుముందు జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పిస్తున్న ఆర్టికల్ 370ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిపేందుకు ఢిల్లీ హై కోర్టు తిరస్కరించింది. ఢిల్లీ హై కోర్టు ఈ పిటిషన్ తిరస్కరించడంతో పిటిషనర్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన సుప్రీం కోర్టు జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక హోదాకు సంబంధించిన ఆర్టికల్ 370పై కేంద్ర ప్రభుత్వం వివరణను కోరింది. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జె.ఎస్. ఖేహార్ నేతృత్వంలోని ధర్మాసనం కేంద్ర ప్రభుత్వానికి నోటీసు జారీ చేస్తూ నాలుగు వారాలలోగా సమాధానమివ్వాలని కోరింది. ఆర్టికల్ 370 చట్టబద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను ఈ ఏడాది ఏప్రిల్ 11న ఢిల్లీ హై కోర్టు తిరస్కరించింది. ఇదే విషయమై 2014 జులైలో దాఖలైన పిటిషన్‌ను సుప్రీం కోర్టు ఇప్పటికే డిస్మిస్ చేసినందును దీనిపై విచారించాల్సిన అవసరం లేదని ఢిల్లీ హైకోర్టు పేర్కొంది. అయితే గతంలో సుప్రీం కోర్టు ఎదుటకు వచ్చిన పిటిషన్‌లోని అంశాలు, తాను దాఖలు చేసిన పిటిషన్‌లోని అంశాలు రెండూ భిన్నమైనవని పిటిషనర్ కుమారి విజయలక్ష్మి ఝా హై కోర్టుకు తెలిపారు.

రేపు విద్యా సంస్థల బంద్

విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. నారాయణ, శ్రీచైతన్య జూనియర్ కళాశాలల్లో ఏటా సుమారు 60 మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, ఇందుకు ప్రధానంగా ఆ కళాశాలల యాజమాన్యాలు ర్యాంకుల కోసం చేసే వేధింపులు భరించలేకపోవడమే కారణమని పేర్కొంటూ విద్యార్థి సంఘాలు పూర్తి స్థాయి విచారణకు డిమాండ్ చేస్తున్నాయి. ఇంటర్మీడియేట్ చదువుకు నీరజారెడ్డి కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని, ప్రభుత్వ, ఎయిడెడ్ డిగ్రీ కళాశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని, కళాశాల హాస్టళ్లకు సొంత భవనాలను నిర్మించాలని, యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న 1800 పోస్టులకు వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, పిడిఎస్‌యు, పిడిఎస్ఒ, పిడిఎస్‌యు నాయకులు తెలిపారు.

నంద్యాలలో సామాజిక సమీక 'రణం'

మొదటి పేజీ తరువాయి

కట్టబెట్టింది. మాజీ మంత్రి ఎన్ఎండి ఫరూఖ్‌కు ఎమ్మెల్సీ పదవిని, మాజీ మున్సిపల్ చైర్మన్ నౌమాన్‌కు ఉర్దూ అకాడమీ చైర్మన్ పదవిని కట్టబెట్టారు. ఇక వైసిపి రాష్ట్ర వ్యాప్తంగా ఉండే ముస్లిం నాయకులను ప్రచారంలోకి దింపి 2018లో జరిగే శాసనమండలి ఎన్నికల్లో ఒక సీటు తమ పార్టీకి వస్తుందని, దానిని నంద్యాలలోని ముస్లింలకు ఇస్తామని జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభలో వాగ్దానం చేశారు. అలాగే 40 వేల ఓట్లు ఉండే కాపుల మెప్పు కోసం ముఖ్యమంత్రి యుద్ధప్రాతిపదికన రూ. 3 కోట్లు వెచ్చించి కళ్యాణ మండపం నిర్మించేందుకు అనుమతులు మంజూరు చేశారు. మంత్రులను రంగంలోకి దింపారు. వైసిపి నుంచి బొత్స సత్యనారాయణ, అంబటి రాంబాబులు మకాం వేసి కాపుల సమీకరణ చేస్తున్న పరిస్థితి ఉంది. ఆర్థికంగా బలంగా ఉండే ఆర్యవైశ్యుల ఓట్లు కూడా దాదాపు 25 వేల దాకా ఉన్నాయి. వీటి కోసం రాజ్యసభ సభ్యులు టిజి వెంకటేష్‌ను, సోమిశెట్టి వెంకటేశ్వర్లును టిడిపి రంగంలోకి దింపింది. వైసిపి విజయనగరం జిల్లా ఎమ్మెల్సీ కొలగట్ల వీరభద్ర స్వామితో ప్రచారాన్ని ముమ్మరం చేసింది.

ఎస్సీ, క్రైస్తవ ఓట్ల కోసం మంత్రులు నక్కా ఆనంద్‌బాబు, ఎస్‌కె జవహర్‌లతో పాటు ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవర ప్రసాద్, జూపూడి ప్రభాకర్‌లను రంగంలోకి దింపింది. మాజీమంత్రి మారెప్పతో దళిత వాడల్లో ప్రచారం చేయించుకుంటోంది. వైసిపి చర్చి పాస్టర్‌లను వినియోగించుకుంటోంది.15 వేల ఓట్లున్న ఉన్న రెడ్డి ఓట్ల కోసం టిడిపి మంత్రి ఆదినారాయణ రెడ్డి, అమరనాథరెడ్డిని రంగంలోకి దింపింది. వైసిపి నుంచి రోజా, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రచారం చేస్తున్నారు.బిసి ఓట్లు 45 వేల దాకా ఉన్నాయి. వీటి కోసం బిసి సంఘాలను ఏకతాటిపైకి తెచ్చి మద్దతును కూడగట్టేందుకు మాజీమంత్రి కెఇ ప్రభాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నాగేశ్వరరావు యాదవ్‌లు పని చేసున్నారు. వైసిపి తరపున బివై రామయ్యను నంద్యాలలోనే మకాం వేయించారు.

టిడిపి, వైసిపి బిజెపి వైపు ఉన్నందున మైనార్టీల ఓట్ల ద్వారా గణనీయమైన ఓటింగ్‌ను పెంచుకుని రాష్ట్రంలో కాంగ్రెస్‌కు పునరుజ్జీవనం సాధించాలన్న లక్ష్యంతో కాంగ్రెస్ ముస్లిం అభ్యర్థి అబ్దుల్ ఖాదర్‌ను రంగంలోకి దింపింది. ఎన్నికల నిబంధనల ప్రకారం కులం, మతం ఆధారంగా ఓట్లడగడం విరుద్ధం. అయినప్పటికీ చాపకింద నీరులా ఆయా పార్టీలు కులం, మతం ఆధారంగానే ఓట్లను రాబట్టుకునేందుకు ప్రణాళికలు తయారు చేస్తుండడం చర్చనీయాంశమైంది.

ప్రజల్లోకి సంక్షేమం

మొదటి పేజీ తరువాయి

సూచించారు. టిడిపి నాయకులు చేసే తప్పులు ప్రతిపక్షాలకు మేలు కాకూడదనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుపెట్టుకోవాలన్నారు. నిద్రించే సమయం తప్ప మిగిలిన సమయమంతా పార్టీ కోసం పనిచేస్తున్నానని, మేనిఫెస్టోలో పేర్కొన్న పథకాల్లో 90 శాతానికి పైగా మూడేళ్లలో అమలు చేసేశానని పేర్కొన్నారు. గతంలో పార్టీకి దూరమైన వర్గాలు కూడా ఈ మూడేళ్లలో పనితీరుతో మళ్లీ దగ్గరయ్యాయన్నారు. పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సెప్టెంబర్ 1 నుండి చేస్తున్న ఇంటింటికీ టిడిపి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

నేనేం తప్పు చేశానని..

'నేనేం తప్పు చేశానని ప్రతిపక్షనేత జగన్ నడిరోడ్డుపై కాల్చమని చెబుతాడు, గతంలోనూ చెప్పుతో కొట్టమన్నాడు. కలెక్టర్‌ను జైలుకు పంపిస్తానంటున్నాడు. జగన్ ఇప్పుడే శాడిస్టుగా వ్యవహరిస్తున్నాడు. అధికారంలోకొస్తే ఇంకెలా వ్యవహరిస్తాడో తెలియడం లేదు' అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ సందర్భంగా అన్నారు.

నీళ్లే లేనప్పుడు అమరావతి మునకేమిటి?

రాజేంద్రసింగ్ అమరావతి మునిగిపోతుందని ఏదో చెబుతున్నారని, దానిలో వాస్తవం లేదని చంద్రబాబు అన్నారు. మంగళవారం ఉదయం ఆయన మీడియా ప్రతినిధులతో మాటామంతీ జరిపారు. కృష్ణానదికి పైనుండి నీరిచ్చే విషయంలో కర్నాటక ప్రభుత్వం మూర్ఖంగా వ్యవహరిస్తోందన్నారు. ముందు ముందు ఈ సమస్య తీవ్రమవుతుందని, పట్టిసీమ ఉండటం వల్ల ప్రస్తుతం నదిలో నీరు కనిపిస్తోందని, అదిలేకపోతే భూములిచ్చిన రైతులు కూడా విమర్శించేవారన్నారు. రాజేంద్రసింగ్‌ను తాను పరిచయం చేశానని, అటువంటి వ్యక్తి మరలా ఇప్పుడు నాకు కబుర్లు చెబుతున్నాడన్నారు. తనపై బాంబుదాడి జరిగిన సమయంలో వైఎస్ రాజశేఖరరెడ్డి దొంగ దీక్ష చేశారని, తనపై ప్రేమతో కాదని తెలిపారు. వైఎస్ సిఎంగా ఉన్నంతకాలం జగన్‌ను హైదరాబాద్ రానీయలేదని, అమెరికా పంపినా ఏడాదిలో తిరిగొచ్చాడని పేర్కొన్నారు. అటువంటి వ్యక్తి నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని చంద్రబాబు పేర్కొన్నారు. తన రాజకీయ జీవితంలో ఎన్ని ఇబ్బందులెదురైనా ఎక్కడా నోరు జారలేదన్నారు. రాష్ట్రంలో అర్హులైన జర్నలిస్టులకు ఇళ్లు కట్టించాలనే ఆలోచన ఉందన్నారు. దీనికోసం అవసరమైతే జర్నలిస్టులతోనే కమిటీ వేస్తానన్నారు. దీనికి ప్రభుత్వం వైపు నుండి సమాచార సలహాదారు పరకాల ప్రభాకర్, కమిషనర్ వెంకటేశ్వర్, టి.డి.జనార్ధన్ మరో నలుగురు జర్నలిస్టులతో కమిటీ వేయాలని సూచించారు.

సిఎంకు జర్నలిస్టుల అభినందన

రాష్ట్రంలో జర్నలిస్టులకు మూడు బెడ్‌రూముల ఇళ్లు నిర్మించి ఇస్తానని ప్రకటించడంపై పలువురు జర్నలిస్టులు సిఎంను కలిసి అభినందనలు తెలిపారు. అభినందనలు తెలిపిన వారిలో సీనియర్ జర్నలిస్టులు భార్గవ, శ్రీనివాస్, సురేష్, వంశీ, గోపి, రామారావు, జయరాజు, రవి, నాగరాజు, పృథ్వీరాజు, రమేష్ తదితరులున్నారు.

సినిమా వాళ్ళు ప్రతి శుక్రవారం పార్టీ మార్చేస్తారు

దశాబ్దంపైగా దర్శకుడిగా సరైన విజయాలు లేని తేజ ప్రస్తుతం దగ్గుబాటి రానా హీరోగా కాజల్ అగర్వాల్ నాయికగా చేసిన చిత్రం 'నేనే రాజు నేనే మంత్రి'. డి. సురేష్‌బాబు నిర్మాణపర్యవేక్షణలో రూపొందిన ఈ చిత్రం ఈనెల 11న విడుదలకాబోతుంది. ఈ సందర్భంగా తేజ విలేకరులతో మాట్లాడారు.



రానాకు కథ ఎలా సరిపోతుందని భావించారు?

నేను ఓ కథను రెడీ చేసుకుని 'అహం' పేరుతో రాజశేఖర్‌కు చెప్పాను. అది సాధ్యపడలేదు. ఆ తర్వాత సురేష్‌బాబుకు ఈ కథ చెప్పాను. ఆయనతో చర్చించాక కొన్ని మార్పులు చేశాం. రానా ఆహార్యాన్ని దృష్టిలో వుంచుకుని కొన్ని మార్పులు చేశాం. అప్పుడు తను 'బాహుబలి2' చేస్తున్నాడు. అది అయ్యాక చేద్దామన్నాడు. అనుకోకుండా రెండూ ఒకేసారి సెట్‌పైకి రావడంతో కొంత ఆలస్యమైంది.

తేజ పనైపోయిందనే వారిపై మీరెలా స్పందిస్తారు?

పనిలేనివారు అలా అంటుంటారు. మనిషికి స్విమ్మిగ్, సైకిలింగ్ నాచురల్‌గా వచ్చినట్లే దర్శకత్వం కూడా నాకూ అలా వచ్చింది. అన్ని సినిమాలు ఆడాలనే తీస్తాం. కొన్నిసార్లు తీర్పు మారొచ్చు. నేను ప్రతిదీ సక్సెస్ అవుతుందనుకుంటా. ఒక్కోసారి అనుకున్న దానికంటే తక్కువ ఫలితం వస్తుంది. 'జయం', 'చిత్రం', 'నువ్వునేను' అనుకున్నదానికంటే ఎక్కువగా ఆడాయి. మహేష్‌తో చేసిన 'నిజం' చేసేటప్పుడు బాగా ఆడుతుందనుకన్నా. కొత్తగా ప్రజెంట్ చేశాననే ఫీలింగ్‌తో వున్నా. అప్పటికే 'ఒక్కడు' రావడంతో.. 'నిజం'లోని రియాల్టీ ప్రేక్షకులకు నచ్చలేదు.

ట్రైలర్‌లో రానాలో నెగెటివ్ షేడ్స్ కన్పిస్తున్నాయి?

ప్రతి మనిషిలో నెగెటివ్, పాజిటివ్ వుంటాయి. నాలోనూ రెండూ వున్నాయి. అయితే సినిమా హీరోకు అన్ని పాజిటివ్‌లే చెబుతారు. చరిత్రలోని పేరున్నవారి నెగెటివ్స్ గురించి పెద్దగా చెప్పరు. ఈ కథ జోగేంద్రది. ఐదేళ్ళలో జరిగిన కథ. అందులో మంచి, చెడు, దరిద్రం, దేశానికి ఉపయోగపడేవి, నష్టపర్చేవీ వుంటాయి. ఇది కమర్షియల్ సినిమా. థియేటర్‌లో చూస్తున్నవాడిని ఎట్రాక్ట్ చేస్తుంది.

ఇది పొలిటికల్ సినిమానా?

పొలిటికల్ సినిమా తీయను. కానీ కథలో అన్ని వుంటాయి. ట్రైలర్‌లో రెండు, మూడు డైలాగ్స్ అలా అనిపించాయి. రాజకీయం కేవలం 10శాతం మాత్రమే వుంటుంది. ఇది భార్యభర్తల కథ. 'పాతాళభైరవి' నుంచి తీసుకున్నా అన్ని కథల్లో ప్రేమ, భార్యాభర్తల మధ్య అనుబంధాలుంటాయి. కాలాన్ని బట్టి నేపథ్యం మారిపోతుంది. నా కథ పొలిటికల్ బ్యాక్‌డ్రాప్.. స్క్రీన్‌పై కొత్తగా వుంటుంది. ఇలాంటివి రియల్‌లైఫ్‌లో చూసేవుంటాం.

ఆర్టిస్టుల్ని హింసించారా?

ఎవ్వరినీ హింసించలేదు. కాజల్ అగర్వాల్ మొదటి సినిమా నాతోనే చేసింది. ఆమెన నటన బాగా నేర్చుకుంది. కొంతమంది చెప్పగానే అర్థం చేసుకుంటారు. మరి కొంతమందికి చెప్పినా అర్థంకాదు. తప్పనిసరి తిట్టాలి. ఎందుకంటే మనకంటే ఎక్కువకాలం బతికేది సినిమానే. 'మాయాబజార్' చేసిన వారెవ్వరూ బతికిలేరు. సినిమానే బతికింది. సినిమా జనాల్ని ఉత్తేజపరుస్తుంది. డిప్రెస్ చేస్తుంది. సినిమాకోసం అందరం కష్టపడి పని చేయాలి.

రానా ఎలా చేశాడు?

రానాకు ముందే ఎలా చేయాలో చెప్పేవాడిని.. తను థింకింగ్ యాక్టర్. రాత్రి నుంచి అదే మూడ్‌లో వుండి.. తెల్లారి జోగేంద్రగా ఫీలయి చేసేవాడు. కొంతమంది నేను సూపర్‌స్టార్‌ననే ఫీల్‌తో వచ్చి చేస్తారు. రానా అలాకాదు. తెలివైన నటుడు.

మీకు బాగా ఆనందం కలిగేది ఎప్పుడు?

లైట్లు ఆపేసి వున్న థియేటర్లలో ప్రేక్షకులు సినిమా చూస్తుండగా దానికి స్పందించి ప్రేక్షకులు చప్పట్లు కొడట్టం.. దాన్ని వారి వెనకనుంచి చూసి ఆనందించడంలో వున్న కిక్ ఎక్కడికి వెళ్ళినా రాదు. ఊటీ, కొడైకెనాల్ వెళ్ళినదానికంటే ఇదే ఆనందానిస్తుంది.

హిట్, ఫ్లాప్ అనేది ముందే తెలుస్తుందా?

ఆశ, రియాలిటీ అనేవి మనిషిలో వుంటాయి. ఒక్కోసారి ఒక్కోటి డామినేట్ చేస్తాయి. ఒక్కోసారి పోతుందని లోపలవుండే రియాల్టీ చెబుతుంది. కానీ ఆశతో దేవుడ్ని ప్రార్థిస్తాం. సురేష్‌బాబు ఎక్కువ రియాల్టీలో వుంటారు. నాకు ఫర్‌ఫెక్ట్ నిర్మాత సురేష్‌బాబు. సినిమాను ఆయన ప్రేక్షకుడిగా చూస్తారు. ప్లాన్‌గల నిర్మాత. సెట్‌కు వెళ్ళేముందు ప్రతివిషయంలో జాగ్రత్త తీసుకుంటారు. కాస్ట్యూమ్స్ అందరికీ సరిపోతున్నాయా? లేదా? అనేది ముందుగానే తొడిగి చూడమంటారు. సెట్‌కు వెళ్ళాక తేడా వస్తే ఆరోజు వేస్టు అవుతుంది.

క్యాథరిన్‌చేత సిగరెట్ తాగించారే?

పాత్ర అలాంటిది. నేను తీసే సినిమాలన్నీ హీరోయిన్ బేస్డ్ చిత్రాలే. చిత్రం, నువ్వునేను.లో ఉమెన్ పాత్ర స్ట్రాంగ్‌గా వుంటుంది.

ఇంటిలిజెంట్ సినిమా అనుకోవచ్చా?

ఈమధ్య ఇంటిలిజెంట్ సినిమా తీయాలని ట్రై చేశాను. క్యారెక్టర్, స్క్రీన్‌ప్లే ఇంటిలిజెంట్‌గా తీయాలంటే కొన్నిసార్లు ప్రేక్షకులకు అందదు. అందుకే వారికి అర్థమయ్యేట్లుగా చెప్పేట్లుగా వుండాలని గ్రహించాను. ఇందులో ఏడుగురు మేధావులు.. తెలివైన మైండ్ గేమ్ ఆడతారు. చూసేవారికి థ్రిల్ కలుగుతుంది.

మీలో సినిమాటోగ్రాఫర్, దర్శకుడు వున్నారు. ఎవరు డామినేట్ చేస్తారు?

ఏ పని చెప్పినా.. సిన్సియర్‌గా చేయడమే.. బయటకు వెళితే దర్శకుడిగా నేను బిహేవ్ చేయను. తేజ అనే విషయాన్ని మర్చిపోతాను. ఎలా వుండాలనిపిస్తే అలా వుంటాను. దర్శకుడిగా చేశాక దానిపైనే దృష్టిపడతాను.

తర్వాత ఏ సినిమా చేయనున్నారు?

ఇక్కడ ఓ విషయం చెప్పాలనుంది. రాజకీయనాయకులు ఐదేళ్ళకోసారి పార్టీ మారతారు. సినిమా వాళ్ళు ప్రతి శుక్రవారం పార్టీ మార్చేస్తారు. మార్నింగ్‌షో బాగుందనగానే సూట్‌కేసులు పట్టుకుని వచ్చేస్తారు. లేదంటే.. అస్సలు పలుకరించరు. ఈ సినిమా ట్రైలర్ విడుదలయ్యాక కొంతమంది సూట్‌కేసులు పట్టుకుని వచ్చారు. ఇంకా ఏ సినిమా అనుకోలేదు.

సినిమా క్రిటిక్స్‌పై మీరెలా స్పందిస్తారు?

సినిమా చూస్తుండగానే.. సెల్‌ఫోన్‌లో.. ఇంగ్లీషు అక్షరాల్లో టైప్ చేసేసి వాట్సప్‌లో పెట్టేస్తుంటారు. ఒకపక్క సినిమా రన్ అవుతుంది. దాన్ని చూసి టైప్ చేస్తూ.. ఇలా రెండు పనులు చేయడం.. నిజంగా వారికి హ్యాట్సాఫ్ చెప్పాల్సిందే. నా దృష్టిలో బిల్‌గేట్స్‌కంటే మేధావులని అర్థం. వారు ఇక్కడ వుండాల్సినవారు కాదు.

ఛాంబర్ లెటర్‌పై వర్మ స్పందించారు. మీ గురువుగా మీరెలా భావిస్తారు?

ఆ విషయాలు మనకొద్దు. ఎవరో చేశారు. దాన్ని వారే అనుభవిస్తారు. ఇదేదో దేశసమస్య అయినట్లు తెగ చూపించేశారు. వారందరికీ 40ఏళ్ళు దాటాయి. వారేమీ చిన్న పిల్లలు కాదు. దేశానికి భావిభారతపౌరులు డ్రగ్స్‌కు అలవాటుపడ్డారని తెలిసి.. వారికి ఎవరు? ఎలా సప్లయి చేశారనేది వదిలేసి... ఈజీగా వున్నారరనే సినిమా వాళ్ళపై పడడం కరెక్ట్‌కాదు.

అవి సినిమాలపై ప్రభావం చూపుతాయంటారా?

పర్సనల్ క్యారెక్టర్లు సినిమాకు వర్తించదు.. ఏదైనా ఒక్కరోజు న్యూసే. విజయం వచ్చినా, పద్మ అవార్డు వచ్చినా, చనిపోయినా.. అన్నీ ఒక్కరోజు మాత్రమే. లెజెండ్ దాసరిగారు చనిపోతే.. ఇప్పుడు అంతా మర్చిపోయారు. ఫాస్ట్ యుగంలో అన్నీ మర్చిపోతారు. కానీ మేం దాసరిని మా సినిమాలో తలచుకున్నాం.

పుట్టినరోజున 'స్పైడర్' టీజర్



'బుధవారంనాడు మహేష్ పుట్టినరోజు సందర్భంగా ఉదయం 9 గంటలకు 'స్పైడర్' కొత్త టీజర్‌ను విడుదల చేస్తున్నామని' చిత్ర నిర్మాత ఎన్.వి.ప్రసాద్ వెల్లడించారు. మహేష్, ఎ.ఆర్.మురుగదాస్ కాంబినేషన్‌లో ఠాగూర్ మధు సమర్పణలో ఎన్.వి.ఆర్. సినిమా ఎల్ఎల్‌పి, రిలయన్స్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకాలపై ఎన్.వి.ప్రసాద్ నిర్మిస్తున్న చిత్రం 'స్పైడర్'. ఈ చిత్రానికి సంబంధించి ఇటీవల విడుదలైన టీజర్‌కి ప్రేక్షకుల నుంచి, అభిమానుల నుంచి అనూహ్య స్పందన వస్తోంది. కాగా, ఈనెల 9 మహేష్ పుట్టినరోజు. నిర్మాతలు ఠాగూర్ మధు, ఎన్.వి.ప్రసాద్, దర్శకుడు ఎ.ఆర్. మురుగదాస్ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ 'స్పైడర్' కొత్త టీజర్‌ను విడుదల చేస్తున్నారు.

ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ... ఒక్క పాట మినహా షూటింగ్ పూర్తయింది. ఈ పాట చిత్రీకరణ ఈనెల 23 వరకు జరుగుతుంది. దీంతో చిత్రీకరణ పూర్తవుతుంది. మరోవైపు డబ్బింగ్, రీకార్డింగ్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి దసరా కానుకగా సెప్టెంబర్ 27న తెలుగు, తమిళ భాషల్లో చిత్రాన్ని విడుదల చేస్తున్నాం" అన్నారు. రకుల్‌ప్రీత్ సింగ్, ఎస్.జె.సూర్య తదితరులు ముఖ్యపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: హేరిస్ జయరాజ్, సినిమాటోగ్రఫీ: సంతోష్ శివన్ ఎఎస్‌సి.ఐఎస్‌సి, ఎడిటింగ్: శ్రీకర్‌ప్రసాద్.

లక్నోలో మహేష్, కొరటాల శివ చిత్రం

ఇదిలా వుండగా, మహేష్, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో డి.వి.వి. ఎంటర్‌టైన్‌మెంట్స్ ఎల్ఎల్‌పి బేనర్‌పై డి.వి.వి.దానయ్య ఓ భారీ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం తాజా షెడ్యూల్ ఈనెల 11 నుంచి 22 వరకు లక్నోలో జరుగుతుంది. మహేష్ పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ లక్నోలో జరిగే షెడ్యూల్‌కి సంబంధించిన వివరాలు తెలియజేశారు. మహేష్, హీరోయిన్ కైరా అద్వాని, ప్రకాష్‌రాజ్‌లతోపాటు ప్రముఖ తారాగణం పాల్గొనే కీలక సన్నివేశాలతోపాటు పీటర్ హెయిన్స్ సారధ్యంలో ఓ భారీ యాక్షన్ ఎపిసోడ్ చిత్రీకరిస్తారు. ఈ చిత్రాన్ని జనవరి 11న సంక్రాంతి కానుకగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీప్రసాద్, సినిమాటోగ్రఫీ: రవి కె.చంద్రన్, నిర్మాత: డి.వి.వి.దానయ్య, దర్శకత్వం: కొరటాల శివ.

రజనీతో 'ఒకే ఒక్కడు' సీక్వెల్!



శంకర్ దర్శకత్వంలో గతంలో వచ్చిన 'ముదల్వన్' తమిళనాట విజయవిహారం చేసింది. అర్జున్ కథానాయకుడిగా నటించిన ఈ సినిమా, తెలుగులో 'ఒకే ఒక్కడు' పేరుతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అప్పట్లో ఈ సినిమాను ముందుగా రజనీతోనే చేయడానికి శంకర్ ప్రయత్నించినా, ఆయన పెద్దగా ఆసక్తి చూపలేదట. అలాంటి రజనీకాంత్ ఆ సినిమా సీక్వెల్‌లో చేయడానికి ఉత్సాహాన్ని చూపుతున్నారని వార్తలు వస్తున్నాయి. కాగా, తమిళనాట రజనీకాంత్ రాజకీయ ప్రవేశానికి భారీస్థాయిలో రంగం సిద్ధమవుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో 'ముదల్వన్' వంటి కథతో జనాల్లోకి వెళ్లవలసిన అవసరాన్ని రజనీ గుర్తించారట. దాంతో శంకర్ రంగంలోకి దిగాడని చెప్పుకుంటున్నారు. రజనీ గుణగణాలు ఆయన సీఎం అయితే ఎలా వుంటుందనే విషయాన్ని ముందుగా జనానికి తెలియజేసే ప్రయత్నంగా ఈ సినిమాను గురించి చెప్పుకుంటున్నారు. ఈ సినిమాకి విజయేంద్ర ప్రసాద్ కథను సిద్ధం చేస్తుండటం విశేషం.

తుదిదశలో 'మేడమీద అబ్బాయి'

'అల్లరి' నరేష్ నటిస్తున్న చిత్రం 'మేడమీద అబ్బాయి'. జాహ్నవి ఫిల్మ్స్ పతాకంపై శ్రీమతి నీలిమ సమర్పణలో బొప్పన చంద్రశేఖర్ నిర్మిస్తున్నారు. నిఖిల విమల్ కథానాయిక. జి.ప్రజిత్ దర్శకత్వం వహిస్తున్నారు. చిత్రీకరణను పూర్తిచేసుకున్న ఈ చిత్రం నిర్మాణానంతర పనులు తుదిదశకు చేరుకున్నాయి. కాగా ఈ చిత్ర టీజర్‌ను ఇటీవలే నరేష్ తన ట్విట్టర్ అకౌంట్ ద్వారా విడుదల చేశారు. 12 గంటల్లోనే టీజర్ 5లక్షల పైగా వ్యూస్‌ను సాధించడం విశేషం.

నరేష్ మాట్లాడుతూ... కొత్తదనంతో కూడిన కథతో చేస్తున్న విభిన్న చిత్రమిది. చాలా రోజుల తర్వాత ఓ మంచి సినిమా చేశాననే భావన కలిగింది. ఈ అబ్బాయిని అందరూ మీ ఇంటి అబ్బాయిగా ఆదరిస్తారని కోరుకుంటున్నానని తెలిపారు. నిర్మాత చిత్ర విశేషాలను తెలియజేస్తూ... నవ్యమైన కథ కథనాలతో దర్శకుడు చిత్రాన్ని చక్కగా రూపొందిస్తున్నాడు. 'గమ్యం', 'శంభో శివ శంభో' తర్వాత సున్నితమైన కథతో నరేష్ చేస్తున్న చిత్రమిది. రొమాంటిక్ కామెడీ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలో స్క్రీన్‌ప్లే హైలైట్‌గా వుంటుంది. సహజమైన అంశాలతో థ్రిల్లింగ్ వుంటూనే నరేష్ శైలి వినోదం వుంటుంది. నరేష్ కేరీర్‌లో మరపురాని చిత్రంగా ఇది నిలిచిపోతుందనే నమ్మకం వుంది. ఈ నెలలోనే పాటలను సెప్టెంబరు మొదటివారంలో సినిమాను విడుదలకు ప్లాన్ చేస్తున్నామని తెలిపారు.



మరో 'దళపతి'

మణిరత్నం దర్శకత్వంలో రజనీకాంత్, మమ్ముట్టి కలిసి నటించిన చిత్రం 'దళపతి'. 1991లో వచ్చిన ఈ సినిమా దక్షిణాదిన సంచలన విజయం సాధించి బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. తాజాగా అదే టైటిల్‌తో తెలుగులో సినిమా రూపొందుతోంది. ఆది అక్షర ఎంటర్ టైన్మెంట్స్ పతాకంపై సదా దర్శకత్వంలో బాబురావు పెదపూడి నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ చిత్రంలో సదా, కవితా అగర్వాల్, బాబు, ప్రియాంక శర్మ రెండు జంటలుగా నటిస్తున్నారు. యాజమాన్య సంగీతం సమకూర్చారు.

చిత్రం గురించి దర్శకులు సదా మాట్లాడుతూ... యాక్షన్, ఫ్యామిలీ ఎంటర్ టైనర్‌గా తెరకెక్కుతున్న చిత్రమిది. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. త్వరలో చిత్రాన్ని విడుదల చేయనున్నాం. ఛాయాగ్రాహకులు జై అందించిన సినిమాటోగ్రఫీ హైలెట్‌గా నిలుస్తుందని అన్నారు.

'రజనీకాంత్ 'దళపతి'లా మా సినిమానూ ప్రేక్షకులు ఆదరిస్తారన్న విశ్వాసాన్ని వ్యక్తం చేసాడు నిర్మాత.




'దళపతి'లో సన్నివేశం

స్క్రిప్ట్ పనుల్లో గుణశేఖర్



సొంత బ్యానర్లో భారీ బడ్జెట్‌తో 'రుద్రమదేవి' చేసిన గుణశేఖర్‌కు ఆ సినిమా ఆయనకి మంచి పేరు తెచ్చి పెట్టడంతో, ఆర్థికపరమైన గండం నుంచి గట్టెక్కారు. ఆ తరువాత ఆయన 'భక్త ప్రహ్లాద' జీవిత చరిత్రపై తన తదుపరి సినిమా ఉంటుందని ప్రకటించారు. కానీ ఎలాంటి సమాచారం లేకపోవడంతో, ఆ ఆలోచన విరమించుకున్నారేమోననే ప్రచారం మొదలైంది. అయితే ఈ విషయమై ఆయన ట్విట్టర్‌లో స్పందిస్తూ... ఈ ప్రాజెక్టు ఆగిపోలేదు. ప్రస్తుతం స్క్రిప్ట్ వర్క్ జరుగుతోందని అన్నారు. త్వరలోనే నటీనటుల సాంకేతిక నిపుణుల ఎంపిక ప్రక్రియ మొదలవుతుందని చెప్పారు. ఈ సినిమా టైటిల్ 'భక్త ప్రహ్లాద' కాదనీ .. టైటిల్ ఏమిటనేది త్వరలోనే ప్రకటిస్తానని అన్నారు. 'రుద్రమదేవి' తరహాలోనే ఎక్కడా రాజీ పడకుండా ఈ సినిమాను భారీతనంతో తెరకెక్కిస్తానని చెప్పుకొచ్చారు.

'మహాభారతం'లో కమల్



వివిధ భాషల్లో 'మహాభారతం' సినిమాను తెరకెక్కించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. 1000 కోట్ల బడ్జెట్‌తో ఈ సినిమాను రూపొందించడానికి చకచకా ఏర్పాట్లు పూర్తవుతున్నాయి. ప్రముఖ వ్యాపార వేత్త బీఆర్ శెట్టి నిర్మిస్తోన్న ఈ సినిమాకి, శ్రీ కుమార్ మీనన్ దర్శకుడిగా వ్యవహరించనున్నాడు. బహు భాషల్లో ఈ సినిమా తెరకెక్కనుంది కనుక .. ఆయా భాషలకి చెందిన నటీనటులను ఎంపిక చేసే పనిలో వున్నారు. ఇప్పటికే భీముడిగా మోహన్ లాల్‌ను తీసుకున్నారు. మరికొన్ని పాత్రల కోసం అమితాబ్, హతిక్ రోషన్, నాగార్జున, సూర్యలను సంప్రదించినట్టుగా తెలుస్తోంది. ఇక మరొక కీలకమైన పాత్ర కోసం కమల్‌ను తీసుకోనున్నారనే టాక్ తమిళ ఇండస్ట్రీలో వినిపిస్తోంది. ఈ చిత్రానికి ఎ.ఆర్. రెహ్మాన్ సంగీతాన్ని సమకూర్చుతున్నాడు.


అక్షయ్‌పైనే ఆశలు!

బాలీవుడ్‌కి ఈ మధ్య అస్సలేమాత్రం కలిసిరావట్లేదు. వచ్చిన సినిమా వచ్చినట్టే బాక్సాఫీస్ వద్ద బొక్క బోర్లా పడిపోతోంది. పెద్ద సినిమా, చిన్న సినిమా అన్న తేడాల్లేవ్. యాదృశ్చికమే కావొచ్చుగాక.. కానీ, 'బాహుబలి ది కంక్లూజన్' తర్వాత, బాలీవుడ్‌లో వచ్చిన సినిమాల పరిస్థితి అగమ్యగోచరంగా తయారవడం బాలీవుడ్ ట్రేడ్ పండితుల్నే విస్మయానికి గురిచేస్తోంది. 'ట్యూబ్‌లైట్', 'జబ్ హ్యారీ మెట్స్ షెజాల్', 'మున్నా మైఖేల్', 'జగ్గా జాసూస్', 'రాబ్తా'.. ఇలా చెప్పుకుంటూ పోతే లిస్ట్‌లో చాలానే వున్నాయి. వరుస ఫ్లాపుల దెబ్బకి ఒక్కసారిగా బాలీవుడ్ మార్కెట్ కుదేలయ్యింది. ఓవర్సీస్‌లో అయితే బాలీవుడ్ సినిమాలు బెంబేలెత్తించేస్తుండడం గమనార్హం. ఇది బాలీవుడ్‌కి అత్యంత బ్యాడ్ ఫేజ్ అని బాలీవుడ్ సినీ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. సరిగ్గా ఈ టైమ్‌లోనే అక్షయ్‌కుమార్ 'టాయిలెట్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. నిజానికి ఇది భారీ చిత్రం ఏమీ కాదు. అయితే, సినిమా మీద మాత్రం భారీ అంచనాలున్నాయి. సమాజానికి మంచి సందేశం ఇచ్చే సినిమా కావడంతో, ఏమాత్రం బాగున్నా.. సినిమాకి చేసిన తక్కువ ఖర్చు నేపథ్యంలో, సినిమా బంపర్ హిట్ అయ్యే అవకాశాలున్నాయి.

'సింగం 3' రీమేక్



ప్రముఖ సినిమాటోగ్రాఫర్లలో ఒకరు రవి కె చంద్రన్. ఈయన 'అమత, దిల్ చాహత హై, కలర్స్, ఫనా' సినిమాలకు సినిమాటోగ్రఫీ చేసి ప్రస్తుతం మహేష్ బాబు, కొరటాల శివల కలయికలో రూపొందుతున్న 'భరత్ అనే నేను'కు పనిచేస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం ఈయన దర్శకత్వం చేయబోతున్నట్లు తెలుస్తోంది. సూర్య నటించిన 'సింగం 3'ని హిందీలో రీమేక్ చేయనున్నట్లు సమాచారం. ఇందులో సన్నీ డియోల్ హీరోగా నటిస్తారట. రవిచంద్రన్ 2014లో జీవా హీరోగా 'యాన్' అనే సినిమాను డైరెక్ట్ చేశారు. సింగం3 గురించి త్వరలో మరిన్ని వివరాలు తెలియనున్నాయి.







ఆహ్లాదాన్ని పంచే విండ్‌ఛైన్స్

ఇంటిని మరింత ఆకర్షణీయంగా అలంకరించాలి అనుకునేవారికి విండ్ ఛైన్స్(గాలికి మోగే సంగీత వాయిద్యాలు) సరైన ఎంపిక. ఈ కలర్‌ఫుల్ విండ్‌ఛైన్స్ ఇంటిని ఆహ్లాదకరమైన ధ్వనితో నింపేస్తాయి. ఇంటి పరిసరాలను అందంగా కనిపించేలా చేయడంతోపాటు సానుకూల శక్తిని అందిస్తాయి. గాల్లో వేలాడుతూ అవి చేసే శబ్దాలు మనసును ఆహ్లాదపరుస్తాయి. మరి అలాంటి కలర్‌ఫుల్ విండ్‌ఛైన్స్ కొనుగోలు, ఎంపిక విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఈ వారం నివాసంలో తెలుసుకుందామా?!

మార్కెట్‌లో విభిన్నరకాల విండ్‌ఛైన్స్ అందుబాటులో ఉన్నాయి. అందులో మనకిష్టమైన, బడ్జెట్‌కు సరిపడా వస్తువులను ఎంపిక చేసుకోవాలి. ఉదాహరణకు ఉడెన్ విండ్‌ఛైన్స్. ఈ మోడల్స్ చూడ్డానికి ఎంతో ఆకర్షణీయంగా ఉంటాయి. అంతేకాదు, ఇంటికి ఎలిగేట్ లుక్‌ను అందిస్తాయి. సింపుల్‌సిటీని కోరుకునేవారికి ఉడెన్ విండ్ ఛైన్స్ అద్భుతమైన సెలెక్షన్ అని చెప్పుకోవాలి.



బాంబో విండ్‌ఛైన్స్ : ఈ విండ్‌ఛైన్స్ వెదురుతో తయారుచేస్తారు. ఇవి మెటల్ చేసే శబ్దాలు చేయవు. ఇంటిని మరింత అందంగా మార్చడంలో ముందుంటాయి. అలాగే, క్లాసిక్ విండ్‌ఛైన్స్. మెటల్‌తో తయారు చేసిన ఈ విండ్స్ ఇంటికి క్లాసిక్ లుక్‌ను ఇస్తాయి. వీటి రేటు చాలా ఖరీదనే చెప్పుకోవాలి. కానీ, వీటితో ఇంటి అందం నిమిషాల్లో మారిపోతుంది.

బటర్‌ఫ్లై విండ్ ఛైన్స్ : మెటల్‌తో తయారు చేసిన రంగులతో కూడిన బటర్‌ఫ్లై విండ్‌ఛైన్స్ ఇంటిని మరింత ఆకర్షణీయంగా మారుస్తాయి. పిల్లలకు ఇవెంతగానో ఆహ్లాదం కలిగిస్తాయి. ఎక్కువశాతం పిల్లలు పక్షులను ఇష్టపడుతుంటారు. కాబట్టి, పిల్లలు ఉండే ఇళ్లలో బటర్‌ఫ్లై విండ్‌ఛైన్స్‌ను పెట్టుకుంటే బాగుంటుంది. ఇంటికి తీసుకొచ్చిన విండ్‌ఛైన్స్ గాలితో పాటు సీతాకోకచిలుకల్లా ఎగురుతూ ఉంటే ఇళ్లు ఆకర్షణీయంగా కనిపిస్తుంది.

స్పైరల్ విండ్‌ఛైన్స్: సాధారణ విండ్‌ఛైన్స్‌తో పోలిస్తే స్పైరల్ విండ్ ఛైన్స్ పూర్తి భిన్నమైనది. చూడ్డానికి చాలా అందంగా ఉంటాయి. అలాగే, ఇవి చూడ్డానికి నీటితరంగాల మాదిరిగా కనిపిస్తాయి. వీటి ఆకారం సాధారణ విండ్‌ఛైన్స్ కంటే కొద్దిగా పెద్దగా ఉంటుంది. ఇవి బెల్, ఫిష్, సీప్ ఆకారంలో లభిస్తాయి. వీటి ఆకారాలు చాలా ఆకర్షణీయంగా ఉంటాయి.



చాలామంది విండ్‌ఛైన్స్‌ను ఎక్కడ పెట్టాలా? అని ఆలోచిస్తుంటారు. విండ్‌ఛైన్స్‌ను కేవలం లివింగ్ రూమ్‌లలోనే పెట్టాలని అనుకుంటుంటారు. విండ్‌ఛైన్స్ సౌండ్స్‌ని ఎక్కడైనా వినొచ్చు. విండ్‌ఛైన్స్‌ని ఏఏ ప్రాంతాల్లో పెట్టాల్లో ఇప్పుడు చూద్దాం.

లివింగ్‌రూమ్ : లివింగ్‌రూమ్‌ను ఇంకా ఆకర్షణీయంగా మార్చాలంటే ముఖ్యద్వారం దగ్గరే విండ్‌ఛైన్స్‌ని అలంకరించాలి. ముఖ్యద్వారం కొద్దిగా దూరంలో, లివింగ్ రూమ్ మధ్యన తగిలించాలి. విండ్‌ఛైన్స్‌ను కొనేటప్పుడు ఇంటిసభ్యులతో మాట్లాడుకుని అందరికి నచ్చే విధంగానే సెలక్ట్ చేసుకోవాలి. ఎందుకంటే, కొందరికి ఆ శబ్దాలు నచ్చకపోవచ్చు. మెటల్‌తో తయారు చేయబడిన విండ్‌ఛైన్స్‌ను ఎంచుకోవడం ఉత్తమం. ఎందుకంటే, వాటి ధ్వని తీవ్రత ఎక్కువగా ఉంటుంది. దీంతో ఎనర్జీ లెవల్స్ యాక్టివెట్ అయ్యే అవకాశం ఉంది. చెక్క, మట్టితో తయారుచేసిన విండ్‌ఛైన్స్ మానసిక ప్రశాంతతను చేరువచేస్తాయి. మట్టితో తయారుచేసిన విండ్‌ఛైన్స్ వినియోగం ఈ మధ్యకాలంలో తగ్గిందనే చెప్పుకోవాలి. ఎందుకంటే, ఎక్కువగాలి వల్ల మట్టి విండ్‌ఛైన్స్ కిందపడి పగిలిపోయే అవకాశాలు ఉన్నాయి.

బాల్కనీ : బాల్కనీలో విండ్‌ఛైన్స్‌ను అలంకరించుకోవచ్చు. దీంతో మీ బాల్కనీ ఇంకా అందంగా తయారవుతుంది. అక్కడ కూర్చున్న వారికి ఈ శబ్దం వినసొంపుగా వుంటుంది.

గార్డెన్ : గార్డెన్ అందాన్నేకాకుండా రంగు రంగులతో నిండివున్న పూలవనాన్ని ఇంకా ఆకర్షణీయంగా మార్చడానికి విండ్‌ఛైన్స్ ఎంతో దోహదపడతాయి. ఇంటి గార్డెన్ పచ్చదనాన్ని ఇంకా పెంచుతాయి. విండ్‌ఛైన్స్ మధురమైన శబ్దాలను గార్డెన్‌లో ఉండే పూలమొక్కలు ఒకదానితో ఒకటి ఆప్యాయంగా మాట్లాడుకున్నట్లుగా కనిపిస్తాయి. గార్డెన్స్‌లో చిన్నచిన్న విండ్‌ఛైన్స్‌ను అలంకరించడం మంచిది. కేవలం షో కోసం మాత్రమే విండ్‌ఛైన్స్‌ను అలంకరిస్తే ఇంటి తలుపులకు కానీ, కిటికీలను కానీ అలంకరించాలి. ఎక్కువగా గాలి వీచే ప్రాంతంలో అలంకరించుకోవాలి. ఆఫీసులలో కానీ, కార్యాలయాల్లోకానీ, కళాశాలలలో కానీ విండ్‌ఛైన్స్‌ను అలంకరించవద్దు. వీటి శబ్దాలతో ధ్యాస దెబ్బతినే అవకాశం ఉంటుంది.

విండ్‌ఛైన్స్‌ను కొనే ముందు వాటి మెటిరీయల్‌ను ఒకటికిరెండుసార్లు పరిశీలించి కొనుగోలు చేయాలి. వాటి రాడ్‌లు అందంగా, గట్టిగా ఉండేలా చూసుకోవాలి. సిరామిక్ విండ్‌ఛైన్స్‌ను సెలెక్షన్ చేసుకోవడం ఉత్తమం.

సేకరణ : అమల తిలారు



ఇంటి మరమ్మతులా?!

తరచుగా చాలామంది ఇంటి మరమ్మతు సమయంలో చిన్న చిన్న తప్పులు చేస్తుంటారు. ఆ తప్పుల వల్ల తరువాత బాధపడాల్సి వస్తుంది. అలాంటి తప్పులను చేయకుండా కొన్ని సూచనలు, సలహాల ద్వారా ఇంటి మరమ్మతును పర్‌ఫెక్ట్‌గా చేసుకోవచ్చు. సుమారు 85 శాతం మంది ప్రజలు ఇంటిని కొనడం కంటే, ఇంటిని పునరుద్ధరించుకోవడానికి ఇష్టపడతారనీ ఓ సర్వేలో తేలింది. దీన్ని ఎంచుకోవడానికి గల కారణాలలో ముఖ్యమైనది బడ్జెట్ తక్కువగా ఉంటుందని. మెటీరియల్ కొనడం, మంచి కాంట్రాక్టర్‌ను ఎంపికచేసుకోవడం ఇలాంటివన్నీ.

- ఎలాంటి బడ్జెట్ ప్లాన్ లేకుండా ఇంటి మరమ్మతు పనిని మొదలుపెట్టకూడదు.
- ఎక్కువసార్లు ఆర్కిటెక్చరల్ మార్పులు చేయడం వల్ల మెటీరియల్ పాడయ్యే అవకాశం ఉంటుంది. అలా చేయడంవల్ల బడ్జెట్ ఎక్కువయ్యే ప్రమాదం కూడా ఉంటుంది. అందుకే, ఆర్కిటెక్చర్, కాంట్రాక్టర్ తో కూర్చుని ముందుగానే మీ మాస్టర్ ప్లాన్‌ను ఫైనల్ చేసుకోవాలి.
- బడ్జెట్ మాత్రమే కాకుండా ఎమర్జెన్సీ రిజర్వ్ ఫండ్ కూడా పెట్టుకోవడం మంచిది. అత్యవసర సమయాల్లో అవసరమైనప్పుడు ఆ ఫండ్‌ను ఉపయోగించాలి.
- ఎలాంటి మాస్టర్ ప్లాన్ లేకుండా ఇంటి మరమ్మతు పనులు మొదలు పెట్టకూడదు.
- పునరుద్ధరణ చేసే సమయంలో మనకు నచ్చిన కలర్‌ఫుల్ గ్లాస్, టైల్స్ డిజైన్ కోసం ఎక్కువ ఖర్చు చేయకుండా ఉండేలా చూసుకోవాలి.



- వంటగదిని బాగుచేసే సమయంలో సింక్, ఫ్రిజ్, గ్యాస్‌లను ఒకేదిశలో పెట్టడం సరికాదు. వాటిని ట్రై యాంగిల్ షేప్‌లో పెట్టాలి.
- కిచెన్‌లో లీకేజ్ సమస్యలు ఏవైనా ఉంటే సింక్ వాటర్ పైప్‌లైన్‌ను ఒకసారి చెక్‌చేసుకొని, రిపేర్ చేయించడం మంచిది. పైప్‌లైన్ ఫిట్టింగ్‌చేసిన ప్రాంతాన్ని కవర్ చేయాలి.
- కిచెన్ సామాగ్రి పెట్టేందుకు ఎంత వీలైతే అంత ఎక్కువ సామాన్లు స్టోర్ చేసేందుకు సరిపోయేంత ప్లేస్‌ను ఉంచాలి.
- వెంటిలేషన్ సరిగా లేకపోతే కిచెన్‌లో పనిచేసుకునేటప్పుడు ఆరోగ్య సంబంధిత సమస్యలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. కిచెన్‌ను పునరుద్ధరించే సమయంలో ఫైర్/ఎగ్జాస్ట్ ఫ్యాన్ పెట్టుకోవాలి. లైటింగ్ వచ్చేలా కూడా ఉండాలి.
- బాత్‌రూమ్‌లో బాత్‌రూమ్ ఫ్యాన్/ఎగ్జాస్ట్ ఫ్యాన్‌ను తప్పకుండా పెట్టుకోవాలి. వెంటిలేషన్ సరిగా లేని కారణంగా ఫ్లోర్‌పై తేమ ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. దీనికారణంగా పెయింట్ కూడా పాడయ్యే అవకాశం ఉంది. అందుకే వెంటిలేషన్ ఉండేలా చూసుకోవాలి.

- రెనోవేషన్‌ను ప్రారంభించే ముందు బాత్రూమ్ లీకేజ్‌ను ఒకసారి చెక్‌చేయాలి. చాలాసార్లు బడ్జెట్ కారణంగా లీకేజ్ లపై మన ధ్యాస ఉండదు.
- టెరండి లేదా బ్రాండెడ్ బాత్రూమ్ ఫిట్టింగ్స్ లేదా ఫిక్చర్స్ (వాష్‌బేషిన్, షవర్, టాయ్‌లెట్ పాట్, ట్యాప్స్) కోనే సమయంలో బడ్జెట్‌ను మరవద్దు.
- బాత్రూమ్ కోసం ఫ్లోరింగ్‌ను ఎంచుకుంటే మంచిది. డయురబుల్, వాటర్ రెసిస్టెంట్ అయితే ఇంకా మంచిది.
- చాలామంది చిన్నచిన్న వాటిని మర్చిపోతుంటారు. ఉదా: లైట్, ట్యాప్స్, షవర్ వాటర్‌పైప్స్ ఫిట్టింగ్స్. అందుకే కాంట్రాక్టర్ ఇంటినుంచి బయటికి వెళ్లే ముందే మనం అన్ని మళ్లీ ఒకసారి చెక్‌చేసుకోవాలి. ★

టీచర్ : రమ్యా! మతిమరుపుకి, జ్ఞాపకశక్తికి తేడా చెప్పు?

రమ్య : మనకు ఇవ్వాల్సినవి గుర్తుపెట్టుకోవడం జ్ఞాపకశక్తి, మనం ఇవ్వాల్సినవి మరచిపోవడం మతిమరుపు.

టీచర్ : ఆ..!!??

పొడుపు కథ

అనగనగనగా ఓ అప్సరస.
ఆమె పేరులో మధ్య అక్షరం తీసేస్తే మేక.
ఎవరామె ?





జలుబు ఎలా వస్తుందంటే!

తలంటు స్నానం చేసిన వెంటనే జుట్టును తుడుచుకుని ఆరబెట్టుకోకపోయినా, తడి జుట్టుతో బయట తిరిగినా జలుబు చేస్తుందనే అభిప్రాయం అందరిలోనూ ఉంది. వానలో తడిసినా, చలిలో తిరిగినా, ఎక్కువసేపు ఈత కొట్టినా కూడా జలుబు చేస్తుందని అనుకుంటాం! నిజానికి జలుబు అనేది వైరల్ వల్ల వస్తుంది. ఒకటి కాదు, రెండు కాదు వందల రకాల వైరస్‌లు జలుబుకు కారణమవుతాయి. ఆ వైరస్‌లు మన శరీరంలోకి ప్రవేశించి, మన రోగనిరోధక వ్యవస్థపై ఆధిపత్యం సాధిస్తాయి. అందువల్ల మనకు జలుబు చేస్తుంది. అంతే కానీ నీళ్లలో నానినందుకో, తడిజుట్టుతో బయట తిరిగినందుకో జలుబు రాదు. జలుబు చేయడానికి కారణమయ్యే వైరస్‌లు మన చుట్టూ దాదాపు అన్ని ప్రదేశాల్లోనూ, అన్ని రుతువుల్లోనూ ఉంటాయి. మన శరీర ఆరోగ్య వ్యవస్థ అంతో ఇంతో బలహీనపడినప్పుడు మాత్రమే ఇవి మనపై ప్రభావాన్ని చూపిస్తాయి. అదే విధంగా జలుబుతో బాధపడుతున్న వారి దగ్గర ఎక్కువసేపు ఉంటే జలుబు వైరస్‌లు మన శరీరంలోకి కూడా ప్రవేశిస్తాయి. జలుబు అంటువ్యాధి. కాబట్టి ఒకరికొచ్చిన జలుబును మరొకరికి అంటించకుండా జాగ్రత్తపడాలి. అంటే తుమ్ము వచ్చినప్పుడు కచ్చితంగా రుమాలు అడ్డుపెట్టుకోవడం, చేతులు కడుక్కోవడం వంటి ఆరోగ్య సూత్రాలు తప్పకుండా పాటించాలి. ★





గుర్తించండి!

పిల్లలూ.! పైనున్న చిత్రంలో కొన్ని మూగజీవాలు.. అవి నివసించే ఇళ్లూ ఉన్నాయి. వాటిని గుర్తించి, ఒకదానికొకటి జతచేయండి!



ఉత్కం'టై'

బెంగళూరు × తెలుగు మ్యాచ్ డ్రా
సత్తా చాటిన రాహుల్‌చౌదరీ



నాగపూర్ : బెంగళూరు బుల్స్, తెలుగు టైటాన్స్ జట్ల మధ్య నరాలు తెగే ఉత్కంఠ భరితంగా సాగిన మ్యాచ్ టైగా ముగిసింది.చివరి నిమిషం వరకు విజయం దోబూచులాడింది. అప్పటి వరకు ఒక్క పాయింట్‌తో పై చేయిగా నిలిచిన బెంగళూరు బుల్స్‌ను నిలువరించిన తెలుగు జట్టు అనుహ్యంగా 21-21స్కోర్లను సమం చేసి గట్టెక్కింది. తొలి అర్ధ భాగంలో బుల్స్ 9-8తో తెలుగు జట్టుపై స్వల్ప ఆధిక్యంలో నిలిచింది. రెండో అర్ధభాగంలో చివరి నిమిషం వరకు ఒక్క పాయింట్ ఆధిక్యంలోనే ఆ జట్టు సాగింది. చివర్లో రాహుల్ చౌదరీ దాడులకు వెళ్లి ఓ పాయింట్ తేవడంతో ఇరుజట్లు స్కోర్లు 21-21తో సమానమయ్యాయి. రైడింగ్ పాయింట్లలో తెలుగు జట్టు 14-10తో పై చేయిగా నిలిచింది. టాకిల్ పాయింట్లలో 7-6 బుల్స్ కుమ్మేసింది. ఆల్ అవుట్ పాయింట్లలో 2-0తో, ఎక్స్‌ట్రా పాయింట్లలో 2-1తో నిలిచింది. తెలుగు కెప్టెన్ రాహుల్ చౌదరీ మరోసారి జట్టును గాడిలో పెట్టాడు. తొలి మ్యాచ్‌లో విజయం తప్ప వరుసగా ఐదు ఓటములతో గాడితప్పిన సైన్యం మళ్లీ దారికొచ్చింది. రాహుల్ ఏడు దాడులతో 8 పాయింట్లతో మరోసారి తన ప్రతిభను చాటాడు. 42 సార్లు బుల్స్‌పై ఆ జట్టు దండెత్తగా 11 సార్లు సక్సెస్ సాధించి 14 పాయింట్లను సాధించడం విశేషం. బెంగళూరు బుల్స్ జట్టు కూడా 42 దాడులు చేసి 11 సార్లు సక్సెస్ సాధించి కేవలం 10 పాయింట్లే ఖాతాలో కలిశాయి. బుల్స్ తరపున రవీంద్ర పాల్ 2, రోహిత్ కుమార్ 5 పాయింట్లను సాధించారు.

నేటి మ్యాచ్
రాత్రి 8 గంటలకు
బెంగళూరు బుల్స్X బెంగాల్ వారియర్స్

గుజరాత్‌పై హర్యానా జయకేతనం..

ప్రొ కబడ్డీ(పికెఎల్) ఐదో సీజన్‌లో కొత్త జట్టుగా బరిలో దిగిన హర్యానా స్టీలర్స్ తన మూడో మ్యాచ్‌లో గెలుపు గుర్రం ఎక్కింది. మంకాపూర్ ఇండోర్ స్టేడియంలో గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్స్, హర్యానా స్టీలర్స్ మధ్య మంగళవారం మ్యాచ్ జరిగింది. రెండు అర్ధభాగాల్లోను పైచేయిగా నిలిచిన స్టీలర్స్ గుజరాత్‌ను 32-20 భారీ పాయింట్లతో ఓడించారు.

ఈ సీజన్‌లో రెండూ కొత్త టీమ్‌లు తలపడటం ఇది రెండో సారి.ఈ నెల రెండో తేదీన జరిగిన తొలి మ్యాచ్ 27-27తో డ్రా ముగిసింది. రెండో మ్యాచ్‌లో ఆది నుంచి పాయింట్ల వేటలో ముందంజ వేసిన హర్యానా భారీ పాయింట్లతో సత్తా చాటింది. ఆడిన రెండు మ్యాచ్‌లో ఓ మ్యాచ్ డ్రా, మరొకటి ఓటమితో ఉన్న హర్యానా స్టీలర్స్ ఆది నుంచి రైడింగ్ పాయింట్లతో దూకుడు పెంచింది. తొలి అర్ధభాగం ముగిసే సరికి హర్యానా గుజరాత్‌పై 13-9తో ఆధిక్యంలో నిలిచింది. కెప్టెన్ సురేంద్ర నాడా ఆరు, మోహిత్ చిల్లర్ ఏడు, వికాస్ ఖండోలా ఆరు పాయింట్లతో మరోసారి విజృంభించారు. గుజరాత్ జట్టులో సచిన్ అత్యధికంగా ఎనిమిది, మహేంద్ర రాజ్‌పుత్ 5 పాయింట్లను సాధించారు. కెప్టెన్ సుకేష్ హెగ్డే ఒక్కపాయింట్ తేలేకపోయాడు. రెండో అర్ధ భాగంలో హర్యానా దాడులకు ఎదురు లేకుండా పోయింది. ఎడాపెడా పాయింట్లతో ప్రత్యర్థి జట్టపై సంపూర్ణ ఆధిపత్యంతో విజయం సాధించింది.


ఒలింపిక్స్‌లో క్రికెట్ బిసిసిఐ సమ్మతి తెలిపేనా?
నేడు బిసిసిఐ ఆఫీస్ బేరర్ల సమావేశం

న్యూఢిల్లీ: 2024 పారిస్ ఒలింపిక్స్‌లో వివిధ కొత్త క్రీడల్లో క్రికెట్ కూడా చేర్చుతారన్న ఊహాగానాల నేపథ్యంలో బిసిసిఐ పాలకుల సమావేశంలో దీనిపై ఏ నిర్ణయం తీసుకుంటారన్నది ఆసక్తి కరంగా మారింది. న్యూఢిల్లీలో బుధవారం బిసిసిఐ పాలకుల కమిటీ బుధవారం దాదాపుగా 10 అంశాలపై సమీక్షించనుంది. చాలా కాలం తర్వాత జరుగుతున్న ఈ సమావేశంలో ఎజెండాలో ఇది కూడా ఓ అంశంగా పెట్టారు. ఆదాయ పంపిణీలో వ్యత్యాసం ఉన్నట్లు బిసిసిఐ కొంత గుర్రుగా ఉన్న నేపథ్యంలో ఐసిసి తీర్మానాన్ని ఆమోదించి ఒలింపిక్స్‌లో క్రికెట్‌కు ఆమోద ముద్ర వేయడం కష్టమేనని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.సభ్యుడిగా ఉన్న రామచంద్ర గుహ రాజీనామా చేసిన నేపథ్యంలో తెరపైకి తీసుకువచ్చిన పలు అంశాలపై ఇందులో ఏ మేరకు చర్చ సాగిస్తారా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. 2018 ఐపిఎల్, రానున్న సీజన్‌కు బిసిసిఐ కామెంటేటర్ల తుది జాబితా, మాజీ కెప్టెన్ అజారుద్దీన్ బకాయి పడ్డ వేతనాలు, ఆటగాళ్లకు వేతనాల స్థిరీకరణ, రానున్న కాలంలో భారత్ జట్టు పర్యటనలు, ఇతర జట్లు పర్యటన తదితర అంశాలపై ఇందులో చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నారు.

ఇండియా 'ఎ' జట్టులో విజయ్, గౌతమ్

న్యూఢిల్లీ: దక్షిణాఫ్రికాతో ఈ వారంలో జరిగే టెస్ట్ సిరీస్‌కు విజయ్ శంకర్, కృష్ణప్ప గౌతమ్‌లను ఇండియా 'ఎ' తుది జట్టులోకి తీసుకున్నారు. వాస్తవంగా వీరి కంటే ముందుగా నెల రోజుల క్రితమే జయంత్ యాదవ్, ప్రియాంక పాంచల్ జట్టులోకి తీసుకున్నారు.జయంత్ యాదవ్ తండ్రి అకాల మరణం కారణంగాను, పాంచల్‌కు డెంగ్యూ జ్వరం కారణంగా జట్టు నుంచి దూరం అయ్యారు. గౌతమ్ స్పిన్నర్ కాగా, శంకర్ ఆల్‌రౌండర్‌గా బరిలో దిగుతున్నారు. కొద్ది రోజుల్లో దక్షిణాఫ్రికాలో ముక్కోణపు సిరీస్ ముగియనుంది.

డీఎస్పీ పోస్టును అంగీకరించిన సుష్మావర్మ



హిమాచల్‌ప్రదేశ్: మహిళా ప్రపంచకప్ క్రికెట్‌లో సత్తా చాటిన భారత జట్టు వికెట్ కీపర్ సుష్మ వర్మ డిఎస్పీ పోస్టును స్వీకరించేందుకు అంగీకరించింది. కీపర్,బ్యాట్స్‌మెన్‌గా ప్రపంచకప్‌లో తనదైన శైలిలో రాణించిన సుష్మాకు హిమాచల్‌ప్రదేశ్ సీఎం డిఎస్పీ పోస్టును ప్రకటించిన విషయం తెల్సిందే. ప్రభుత్వం ప్రకటించిన రూ.5 లక్షల చెక్‌ను సీఎం వీరభద్రసింగ్ చేతుల మీదుగా సుష్మా మంగళవారం స్వీకరించింది.

ఆసియా రగ్బీ సెవెన్స్‌లో భారత్‌కు 4వ స్థానం

న్యూఢిల్లీ : హాంగ్‌కాంగ్‌లో గత వారం జరిగిన ఆసియా రగ్బీ అండర్ -20 బాలికల సెవెన్స్ సిరీస్‌లో భారత్ బాలికల జట్టు నాలుగో స్థానంలో నిలిచింది. ఈ నెల 4,5 తేదీల్లో రౌండ్ రాబిన్ లీగ్ పద్దతిలో సాగిన ఈ టోర్నీలో బాలికల జట్టు ఆరు మ్యాచ్‌ల్లో అద్భుత ప్రతిభతో 3 మ్యాచ్‌ల్లో విజేతగా నిలిచింది.తొలి మ్యాచ్‌లో థాయిలాండ్ చేతిలో 0-36తో ఓటమి చెందగా, రెండో మ్యాచ్‌లో మలేషియాపై 10-0తో విజయం సాధించింది. చైనాతో 32-0, హాంగ్‌కాంగ్ చేతిలో 39-0 ఓటమి పాలైన టీమిండియా తర్వాత మ్యాచ్‌ల్లో సింగపూర్‌పై 10-5, ఉజ్బెకిస్తాన్‌పై 22-15తో భారత్ విజయం సాధించింది. ముంబయికి చెందిన క్రీడాకారిణి రుచి షెట్టీ భారత జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించింది.

నెం:1 ఆల్‌రౌండర్ జడేజా



- ఐసిసి ర్యాంకింగ్స్‌కు టాప్‌కు
- జడ్డును అభినంది ంచిన కోహ్లీ

దుబాయ్: భారత లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ రవీంద్ర జడేజా అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ ర్యాంకింగ్స్‌లో నెం:1 ఆల్‌రౌండర్‌గా అగ్రస్థానం చేజిక్కుంచుకున్నాడు. శ్రీలంకపై 2-0తో భారత్ టెస్ట్ సిరీస్‌ను వశం చేసుకున్న విషయం తెల్సిందే. ఈ రెండు టెస్ట్‌ల్లో అద్భుత ప్రతిభతో పలువురు ఆటగాళ్లు ఐసిసి ర్యాంకింగ్స్‌లో పైకి ఎగబాకారు. కొద్ది నెలలుగా టెస్ట్‌ల్లో నెం:1 బౌలర్‌గా కొనసాగుతున్న జడేజా, తాజాగా ఆల్‌రౌండర్‌గా 438 పాయింట్లతో నెంబర్ వన్ స్థానాన్ని అధిష్ఠించాడు. ఇప్పటి వరకు ఈ స్థానంలో ఉన్న షాకిబ్ అల్ హసన్ (431) పాయింట్లను రెండో స్థానానికి నెట్టేశాడు. టాప్-3లో 418 పాయింట్లతో అశ్విన్ నిలిచాడు. మాంచెస్టర్‌లో సత్తా చాటిన జేమ్స్ అండర్సన్ రెండో స్థానంలో నిలిచాడు. బౌలింగ్ విభాగంలో జడేజా నెంబర్ వన్ ర్యాంకులో యధాతథంగానే కొనసాగుతున్నాడు. నెం:2 ర్యాంకర్ అండర్సన్ కంటే జడ్డు 15 పాయింట్ల ముందంజలో ఉన్నాడు. ఇటీవల కొలంబోలో 50వ టెస్ట్ ఆడిన పుజారా తొలి ఇన్నింగ్స్‌లో 133 పరుగులతో బ్యాటింగ్ విభాగంలో టాప్ టెన్‌కు చేరాడు. టాప్ ర్యాంకులో నిలిచిన జడేజాను భారత్ కెప్టెన్ విరాట్ కోహ్లీ ప్రశంసలతో ముంచెత్తాడు. కత్తి మాస్టర్, మిస్టర్ జడేజాకు అభినందనలు చెప్పాడు. జడ్డుకు భారీ అభినందనలుంటూ ట్విట్టర్‌లో కోహ్లీ ట్వీట్ చేశాడు. 2012లో టెస్ట్‌ల్లో ప్రవేశించిన జడేజా బెస్ట్ ఆల్‌రౌండర్లలో ఒకడిగా నిలిచాడు. 5 వికెట్ల చొప్పున 9 సార్లు పడగొట్టడంతో పాటు, వేగంగా 150 వికెట్లను తీసిన రెండో బౌలర్‌గా ఇటీవల రికార్డుల కెక్కాడు.

జడ్డు స్థానంలో అక్షర్ లేదా జయంత్

శ్రీలంకతో ఈ నెల 12 నుంచి ఆరంభం అయ్యే మూడో టెస్ట్‌లో జడేజా స్థానంలో అక్షర్ పటేల్ లేదా జయంత్ యాదవ్‌ల్లో ఎవర్నో ఒకర్ని తీసుకునే అవకాశం ఉంది. రెండోటెస్ట్‌లో అవమానకర రీతిలో జడేజా గ్రౌండ్స్‌లో వ్యవహరించిన తీరుతో అతన్ని చివరి టెస్ట్‌కు ఐసిసి సస్పెండ్ చేసి, మ్యాచ్ ఫీజులో 50 శాతం కోత విధించిన విషయం తెల్సిందే. దీంతో రెండో స్పిన్నర్‌గా అక్షర్ లేదా జయంత్‌ల్లో పల్లెకలె టెస్ట్‌కు ఎంపిక చేసే విషయమై కెప్టెన్ కోహ్లీ, ప్రధాన కోచ్ రవిశాస్త్రితో చర్చించి తుది నిర్ణయాన్ని చీఫ్ సెలక్టర్ ఎంఎస్కే ప్రసాద్ తీసుకునే అవకాశం ఉంది.

శతక్కొట్టిన అయ్యర్

- ముక్కోణపు సిరీస్ భారత్ ఎ వశం
- ఫైనల్లో 7 వికెట్లతో దక్షిణాఫ్రికా ఓటమి

ప్రిటోరియా: ముక్కోణపు సిరీస్‌లో ఇండియా ఎ జట్టు విజేతగా అవతరించింది. మంగళవారం నాటి ఫైనల్స్‌లో దక్షిణాఫ్రికాపై భారత్ ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేపట్టిన దక్షిణాఫ్రికా ఎ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 267/7 పరుగులను చేసింది. బెహర్డియన్ అజేయమైన సెంచరీ (101)తో ఆ జట్టు గౌరవ ప్రదమైన స్కోర్ సాధించింది. భారత బౌలర్లలో శార్దూల్ ఠాకూర్ 3 వికెట్లు, ఎస్ కౌల్‌కు రెండు, అక్షరపటేల్‌కు ఒక వికెట్ లభించింది. 268 పరుగుల విజయ లక్ష్యాన్ని భారత్ ఎ 46.5 ఓవర్లలోనే 270 పరుగులను చేసింది. ఓపెనర్లు సంజు శ్యాంసన్ 12, కరుణ్ నాయర్ 4 పరుగుల వద్ద ఔటయ్యారు. ఈనేపథ్యంలో శ్రేయస్ అయ్యర్ అబేధ్యమైన 140 పరుగులతో అజేయంగా నిలిచి జట్టును ఒంటో చేత్తో గెలిపించాడు. ఆల్ రౌండర్ విజయ శంకర్ 72 పరుగులతో అయ్యర్‌కు సహకారం అందించాడు. మనీష్ పాండే 32 పరుగులతో అజేయంగా నిలిచి జట్టును విజయ పథాన నడిపారు.



ఉద్యమాలకు క్విట్ ఇండియా స్ఫూర్తి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

స్వాతంత్రోద్యమంలో క్విట్ ఇండియా ఉద్యమం పతాక సన్నివేశమని, జాతికి స్ఫూర్తినిచ్చిన ఉజ్వల ఘట్టమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. మహాత్ముని పిలుపుతో ఆగస్టు తొమ్మిదిన ఉద్యమం మొదలైందని తెలిపారు. నాయకులు జైళ్లలో ఉన్నా ఉద్యమాన్ని ప్రజలే ముందుకు తీసుకెళ్లారని తెలిపారు. శుత్రువు వ్యూహంలో చిక్కుకున్నప్పుడు డిమాండ్ల సాధనకు ఒత్తిడి పెంచాలనే వ్యూహాన్ని మహాత్ముడు అనుసరించారని, అందుకు నిదర్శనమే క్విట్ ఇండియా ఉద్యమమని సిఎం అభివర్ణించారు. చావో రేవో అంటూ మహాత్ముడు ఇచ్చిన పిలుపుతో దేశంలో ఉద్యమాలు వెల్లువెత్తి బ్రిటీష్ వాళ్ల గడగడలాడారని, స్వాతంత్ర్యం ఇస్తామని రాయబారాలు పంపారని పేర్కొన్నారు. బ్రిటీష్‌వాళ్ల దేశం వదిలి వెళ్లాలని ఆగస్టు 8న ముంబయిలో మహాత్మాగాంధీ పిలుపునిచ్చారని, తొమ్మిదోతేదీ నుండి క్విట్ ఇండియా ఉద్యమం ప్రారంభమైందని తెలిపారు.

ప్రజా ప్రతినిధులపై ఉన్న కేసుల ఎత్తివేత వివరాలివ్వండి

ప్రజాశక్తి, హైదరాబాద్

తెలుగుదేశం ప్రభుత్వంలోని మంత్రులు, అధికార పార్టీ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులపై ఉన్న కేసుల ఎత్తివేతపై తేదీల వారీగా పూర్తి వివరాల్ని పట్టిక రూపంలో ఇవ్వాలని పిటిషనర్ అయితు, వైసీపీ మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకష్ణారెడ్డిని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేశ్ రంగనాథన్, న్యాయమూర్తి ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ ఆదేశించింది. ఎవరిపై హత్య కేసులున్నాయి, ఎవరిపై అత్యాచార కేసులున్నాయి, ఇంకే కేసులున్నాయో తెలపాలని మంగళవారం బెంచ్ సూచించింది. ఆళ్ల తరపు న్యాయవాది పి. సుధాకర్‌రెడ్డి వాదిస్తూ... వివిధ కోర్టుల్లో సాగుతున్న ప్రాసిక్యూషన్‌ను ఎత్తేస్తూ ఆయా పీపీలకు ఆదేశాలివ్వడం చెల్లదన్నారు కేసుల ఉపసంహరణపై నిర్ణయం పీపీలే తీసుకోవాలని చెప్పారు. అధికారంలో ఉంటే ఏమైనా చేయవచ్చునన్న ధీమా టీడీపీ పాలకుల్లో ఉందని, అందుకే హత్య, అత్యాచారం, మహిళల ఆత్మగౌరవానికి ఆటంకం కలిగించడం, దోపిడీ తదితర కేసుల్లో ఆరోపణలు కేసు ఉపసంహరణకు ఆదేశాలిచ్చిందన్నారు. పూర్తి వివరాలు కోరిన హైకోర్టు తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది.

ఉగ్రవాదులకు నిధులు కేసులో హురియత్ నేత గిలానీ కుమారులను ప్రశ్నించిన ఎన్ఐఎ

న్యూఢిల్లీ : 'ఉగ్రవాదులకు నిధులు' కేసుకు సంబంధించి హురియత్ కాన్ఫరెన్స్ ఛైర్మన్ సయ్యద్ అలి షా గిలాని కుమారులు నయీమ్, నసీమ్‌లను మంగళవారం జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) ప్రశ్నించింది. వాస్తవానికి నయీమ్ జులై 31న ఎన్ఐఎ ఎదుట హాజరు కావాల్సి ఉంది. కాని ఛాతీ నొప్పి రావడంతో స్కిమ్స్ ఆసుపత్రిలో చేరాడు. ఉగ్రవాద సంస్థ తెహ్రీక్ ఎ హురియత్‌కు నయీమ్ నేతృత్వం వహిస్తుండగా, నసీమ్ శ్రీనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్నాడు. జమ్మూలో గిలానీకి అత్యంత సన్నిహితుడికి చెందిన రెండు ప్రాంతాలలో జులై 30న ఎన్ఐఎ సోదాలు జరిపింది.

అదే సమయంలో జమ్మూ కాశ్మీర్ పీస్ ఫోరం అనే సంస్థకు ఛైర్మన్‌గా ఉన్న దేవిందర్ సింగ్ బేహాల్‌ను కూడా ఎన్ఐఎ అరెస్టు చేసింది. ఆయనతో పాటు పాకిస్తాన్ నుంచి ఉగ్రవాదులకు నిధులు సమకూరుస్తున్న కేసులో మరో ఏడుగురు కాశ్మీర్ వేర్పాటు వాదులను కూడా ఎన్ఐఎ అరెస్టు చేసింది. అరెస్టు చేసిన వారిలో కొంతమందిపై ఆర్థిక నేరాలకు సంబంధించి విచారణ జరుపుతున్నామని ఎన్ఐఎకు చెందిన ఒక అధికారి తెలిపారు. పాకిస్తాన్ నుంచి ఉగ్రవాదులకు నిధులు అందుతున్నాయన్న విషయాన్ని ధృవీకరించారు. అరెస్టయిన వారంతా కూడా హవాలాతో సహా పలు అక్రమ మార్గాల ద్వారా నిధులు అందుకుంటున్నారని ఆయన చెప్పారు. జమ్మూ కాశ్మీర్‌లో వేర్పాటు, ఉగ్రవాద కార్యకలాపాలకు ఈ నిధులు సమకూరుస్తున్నారని తెలిపారు. జమ్మూ కాశ్మీర్, ఢిల్లీ, హర్యానాలలో సోదాలు జరిపిన సమయంలో పలు పత్రాలను, ఎలక్ట్రానిక్ పరికరాలను, నగదుతో పాటు కొన్ని కోట్ల రూపాయల ఖరీదు చేసే విలువైన వాటిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

వెంకయ్య ఉపరాష్ట్రపతి కావడం
తెలుగుజాతికి గర్వకారణం

స్పీకర్ కోడెల



వెంకయ్యనాయుడు ఉపన్యాసాల ప్రతులను ఆవిష్కరిస్తున్న రామోజీరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారత ఉప రాష్ట్రపతిగా సేవలందించే భాగ్యం వెంకయ్యనాయుడుకు దక్కడం తెలుగు ప్రజలకు లభించిన అరుదైన గౌరవంగా భావిస్తున్నానని శాసనసభ స్పీకర్ కోడెల శివప్రసాదరావు అన్నారు. వెంకయ్య నాయుడు చేసిన ప్రసంగాలు, రచనలు, ఉపన్యాసాలతో 'అలుపెరుగని గళం - విరామమెరుగని పయనం' పేరిట రూపొందించిన సంకలన గ్రంథాలను మంగళవారం ఇక్కడ ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావు ఆవిష్కరించారు. మొదటి సంపుటిని వెంకయ్య నాయుడుకు, ద్వితీయ సంపుటిని స్పీకర్ కోడెలకు తృతీయ సంపుటిని తెలంగాణ స్పీకర్ మధుసూదనాచారికి అందజేశారు. ఈ సందర్భంగా రామోజీరావు మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతం కోసం జీవితాంతం కట్టుబడిన అరుదైన వ్యక్తి వెంకయ్యనాయుడు అని కొనియాడారు. దేశ రాజకీయాల్లో ఆయన అరుదైన అగ్రస్థానానికి చేరారన్నారన్నారు. రాజ్యసభ ఛైర్మన్ బాధ్యతల్ని హుందాగా నిర్వహిస్తారని ఆశిస్తున్నానన్నారు. అనంతరం స్పీకర్ కోడెల మాట్లాడుతూ దేశ, రాష్ట్ర రాజకీయాల్లో 30 ఏళ్లుగా వివిధ హోదాల్లో వెంకయ్య నాయుడును దగ్గర నుంచి చూశానని, ఆయన ఉపన్యాసాల్లో చురకలతో పాటు హాస్యం కూడా ఉంటుందని అన్నారు. చట్టసభల్లో వెంకయ్యలాంటి వాళ్లు శాశ్వతంగా ఉండాలని తెలంగాణ స్పీకర్ మధుసూదనాచారి అన్నారు. స్వీయ ప్రతిభతో వెంకయ్య ఈ స్థాయికి ఎదిగారని కొనియాడారు. వెంకయ్యను 'వాగ్భూషణుడు' అని అభివర్ణించారు.

ఆ రెండు ఒకే చోట వద్దు

- ముస్లింలు ఎక్కువున్న చోట మసీదు నిర్మాణం
- సుప్రీంకోర్టుకు తెలిపిన షియా వక్ఫ్ బోర్డు



న్యూఢిల్లీ: అయోధ్యలో రామమందిరం, మసీదు ఒకే చోట నిర్మించవద్దని యుపి షియా సెంట్రల్ వక్ఫ్‌బోర్డు సుప్రీంకోర్టును కోరింది. .వివాదాస్పదమైన రామజన్మభూమి నుంచి సహేతుకమైన దూరంలో ముస్లిం ప్రాబల్యం ఎక్కువగావున్న చోట కొత్తగా మసీదును నిర్మించుకునేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. ఈ మేరకు మంగళవారం 30 పేజీల అఫిడవిట్‌ను కోర్టుకు అందించింది. ఈ వివాదానికి సంబంధించి 1946లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ యుపిఎస్‌సిడబ్ల్యుబి మంగళవారం స్పెషల్ లీవ్ పిటిషన్(ఎస్ఎల్‌పి) కూడా వేసింది. అంతేగాక ఈ కేసులో తమను కూడా ప్రతివాదులుగా చేర్చాలని కోరింది. మసీదు - రామజన్మభూమివున్న 2.7 ఎకరాల భూమిని ఉభయ పక్షాలకు పంచుతూ అలహాబాద్ హైకోర్టు గతంలో తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే.

దీన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను యుద్ధప్రాతిపదికన ఆగస్టు 11 నుంచి విచారించేందుకు సుప్రీంకోర్టు సమ్మతించిన నేపథ్యంలో వక్ఫ్ బోర్డు ఈ ప్రతిపాదన చేసింది.. బాబర్ కాలంలో పర్షియా నుంచి వచ్చిన షియా తెగస్తుడు మీర్ బక్వీ ఆ మసీదును నిర్మించారని, కాబట్టి ఇది షియా మసీదు అవుతుందని బోర్డు ఛైర్మన్ వసీం రిజ్వి చెప్పారు. అక్కడ పనిచేసే ఇమామ్, మ్యూజ్జిన్లు మాత్రమే సున్నీలని, వారికి షియా ట్రస్టీ నుంచే వేతనాలు అందుతున్నాయని పేర్కొన్నారు. 1944లో సున్నీ వక్ఫ్ బోర్డు ఈ మసీదును రిజిస్టర్ చేసుకోవడాన్ని షియా వక్ఫ్ బోర్డు 1945లో సవాలు చేసినట్లుగా ఆయన వివరించారు. గతంలో ఈ వివాదానికి సంబంధించి సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఇది చాలా సున్నితమైన అంశమనీ, చర్చల ద్వారానే దీన్ని పరిష్కరించుకోవాలని, అవసరమైతే ఓ మధ్యవర్తిని కూడా నియమిస్తామని సుప్రీంకోర్టు తెలిపింది. మధ్యవర్తిగా ఉండాలని ఇరు పార్టీలూ తనను కోరితే అందుకు కూడా సిద్ధమేనని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జెఎస్ ఖేహర్ ఆ సందర్భంగా పేర్కొన్నారు.

మైనార్టీ హోదాపై మూడు నెలల్లో నిర్ణయం

- జమ్మూకాశ్మీర్‌లో ముస్లిమేతరులపై కేంద్రానికి సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: జమ్మూకాశ్మీర్‌లో ముస్లిమేతరులకు మైనార్టీ హోదా కల్పించే అంశంపై కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు చివరి అవకాశమిచ్చింది. దీనిపై మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని మంగళవారం ఆదేశించింది. ముస్లిం మెజార్టీ రాష్ట్రమైన జమ్మూకాశ్మీర్‌లో ముస్లిమేతరులకు మైనార్టీ హోదా కల్పించి, ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని కోరుతూ అంకుర్ శర్మ అనే న్యాయవాది గతంలో దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జెఎస్ ఖేహర్, జస్టిస్ ఎకె గోయెల్, జస్టిస్ డివై చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. కేంద్రం తరపున అదనపు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా విచారణకు హాజరయ్యారు. ఈ అంశంపై వివిధ స్థాయిల్లో ప్రభుత్వం చర్చలు జరుపుతోందని, పూర్తి స్థాయిలో అభిప్రాయ సేకరణకు ఎనిమిది వారాల గడువు కావాలని కేంద్రం కోరారు. దీనికి అంగీకరించిన ధర్మాసనం చివరి అవకాశంగా మూడు నెలల గడువును ఇచ్చింది.

కేసులెత్తేస్తూ జీవోలివ్వడం అన్యాయం

- కోర్టులో చంద్రబాబుకు ఓటమి తప్పదు
- ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులివ్వడాన్ని స్వాగతిస్తున్నాం
- వైఎస్ఆర్ సిపి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలుగుదేశం పార్టీ నేతలపై ఉన్న కేసుల్ని ఎత్తేస్తూ ప్రభుత్వం జీవోలు విడుదల చేయడం దారుణమని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. కేసుల ఉపసంహరణపై హైకోర్టు ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో హైదరాబాద్‌లో పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. భారత శిక్షాస్మ తి కింద లూటీలు చేయడం, ప్రభుత్వ ఉన్నతాధికారులను నిర్బంధించడం, మహిళలపై అత్యాచార యత్నాలకు పాల్పడటం, హత్యలు, హత్యాయత్నాల్లాంటి నేరాలు చేస్తే 323,335,341,353,354,376,302,307 వంటి పలు సెక్షన్ల క్రింద కేసులు నమోదు చేస్తారని, అలాంటి వారిని కూడా తప్పిస్తూ చంద్రబాబు నాయుడు ప్రభుత్వం జీవోలు విడుదల చేసిందన్నారు. ఇప్పటి వరకు 120 జీవోల్లో 1400 మందిని కేసుల నుంచి తప్పించారన్నారు. ఉప ముఖ్యమంత్రి దగ్గర్నుంచి స్పీకర్, మంత్రులు, ఎమ్మెల్యేలు అనేక మంది టిడిపి నాయకులపై కేసులు ఎత్తేసేలా జీవోలిచ్చారని అన్నారు. అధికారులను భయపెట్టి, ఒత్తిడి తీసుకొచ్చి చంద్రబాబు నాయుడు జీవోలను విడుదల చేయించడం దారుణమన్నారు. సమాజంలో తప్పు చేయడానికి ఈ సెక్షన్‌లకు మించి మరే సెక్షన్ లేదని, అలాంటి తప్పులను చేసినవారిని కూడా నీతిమంతులు, గొప్పవాళ్లన్నట్లుగా కేసుల నుంచి తప్పించారంటే ఇంతకంటే దారుణమైన, అన్యాయమైన పాలన మరొకటి ఉండదని అన్నారు. న్యాయస్థానం ఇచ్చిన తీర్పును గౌరవిస్తున్నామని, ప్రభుత్వం ఏం సమాదానం చెబుతుందో చూడాలని అన్నారు. ప్రాసిక్యూషన్ చేసే హక్కు ప్రభుత్వానికి లేదని చట్టాలు స్పష్టంగా చెబుతున్నాయన్నారు. చంద్రబాబు నాయుడుకు ఓటమి తప్పదన్నారు. చంద్రబాబు ఇష్టానుసారం చేసుకుంటూ పోతే, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని, కచ్చితంగా అడ్డుకుని తీరుతుందని ఆయన హెచ్చరించారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68